





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 37 | శనివారం | 04-01-2025 | మహబూబ్‌నగర్

Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00


## వణికిస్తున్న చలి

రాష్ట్రంలో రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతోందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయిందని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు తెలిపారు.

# ఆదాయం సరిపోట్లే



కొందరు రాజకీయాలకోసం నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారు

నెలకు వచ్చేది రూ.18,500 కోట్లే

ఖర్చు రూ.22,500 కోట్లు

రూ.4,000 కోట్లు లోటు

అన్నీ కావాలంటే రూ.30 వేల కోట్లు అవసరం

ఆదాయం పెంచేందుకు ఉద్యోగులు సహకరించాలి

టిజిఒ డైరీ ఆవిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తమ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం నాడు ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు నాయిని రాజేందర్ రెడ్డి, అద్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం

తరువాయి 2లో





# క్లీన్ అండ్ గ్రీన్

విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం ముందుకు

2030 నాటికి 20వేల మెగావాట్లు ఉత్పత్తి

త్వరలోనే గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటిస్తాం

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రీన్ పవర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం అద్భుత విజయాలను సాధించి, దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2030 సంవత్సరం నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేసే వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. మంత్రి వర్గంలో చర్చించి త్వరలోనే గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటిస్తామని వెల్లడించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తి చేసేలా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని, ఇందుకు అవసరమైన నిధులను కూడా కేటాయిస్తామన్నారు. ''క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ''పైన భాగస్వాములతో (స్టేక్ హోల్డర్స్) హైదరాబాద్‌లోని హెచ్‌ఐఐసిలో భట్టి విక్రమార్క

తరువాయి 2లో

# ఘనంగా నుమాయిష్ షురూ

ప్రారంభించిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 84 వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) – 2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ నూమాయిష్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ , సోసైటీ కార్యదర్శి బి. సుదర్శన్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా హైదరాబాద్ సుమాయిష్‌కు పేరుందని, 1988వ సంవత్సరంలో అప్పటి నిజాం ప్రారంభించిన సుమాయిష్ అంచలంచెలుగా సంవత్సరాలుగా కొనసాగుతుండనం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో పలు రాష్ట్రాల ఉత్పత్తులు

తరువాయి 2లో





# 6న కెటిఆర్ విచారణ

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో మాజీమంత్రికి ఎసిబి నోటీసులు

మరో ఇద్దరు నిందితులు అరవింద్‌కుమార్, బిఎల్‌ఎన్ రెడ్డిలకు కూడా

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఈ నెల 6న విచారణకు రావాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. కెటిఆర్‌తో పాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేసింది. కెటిఆర్‌ను ఈ నెల 6న ఉదయం 10 గంటలకు హాజరు

తరువాయి 2లో



# వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు

కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా - సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కౌలు రైతుల రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం భేషరతుగా ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి శనివారం జరగనున్న కేబినేట్ సమావేశంలో విధివిధానాలు ప్రకటించాలని, లేకపోతే ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. శుక్రవారంహైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ కమిటి నాయకులు, పశ్య పద్మ (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం), విస్సా కిరణ్ కుమార్, బి.కొండల్, కన్నెగంటి రవి (రైతు స్వరాజ్య వేదిక), డాక్టర్ ప్రసాద రావు (తెలంగాణ రైతు సంఘం), జక్కుల వెంకటయ్య(తెలంగాణ రైతాంగసమితి),ప్రసాద్ (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం) పి.శంకర్ , కల్పన(బహుజన పార్టీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ 2011లో తీసుకు వచ్చిన కౌలు రైతు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడమే కాకుండా కౌలు రైతులకు పంట పెట్టుబడి సహాయంతో పాటు రైతు బీమా, పంట బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల్లో రైతులకు ఇచ్చిన ప్రతి హామిని అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌అధికారంలోకి వస్తే కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని టిపిసిసి అధ్యక్షుడి హోదా 2023 సెప్టెంబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బహిరంగ లేఖ రాశారని, కాని అధికారం చేపట్టి ఏడాది పూర్తైనా కనీస స్పందన కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం ద్వారా ఇచ్చిన మాటను నిలుపుకోవాలని కోరారు. విస్సా కిరణ్ మాట్లాడుతూ 'తొలి ఏడాది రైతుల కోసం రికార్డు స్థాయిలో రూ.54,000 కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అందులో ఒక్కశాతం కూడా తెలంగాణలోని 36శాతం ఉన్న కౌలు రైతులకు దక్కకపోవడం దారుణమన్నారు. రైతు ఆత్మహత్యల్లో 75శాతం కౌలు రైతులవేనని, వీటిని అరికట్టేందుకు 2011 చట్టం తీసుకొచ్చిన కాంగ్రెస్ దానిని అమలు చేసి వారికి అన్ని పథకాలను వర్తింపజేస్తుందని కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడుముఖ్యమంత్రి గా ఉన్నా ఇందుకు సంబంధించి కనీస చర్యలు తీసుకోలేదన్నారు. డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సముచిత నిర్ణయమని దీనిని స్వాగతిస్తున్నామని చెప్పారు. అయితే ఈ రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులు సాగు భూమిలో 40 శాతం వారే సాగు చేసి వివిధ పంటలను పండిస్తున్నారని అలాంటి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆక్షేపణీయమన్నారు. రైతు భరోసాకు

తరువాయి 2లో

# నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

రైతు భరోసాపై మంతివర్గ ఉప సంఘం నివేదికపై చర్చ!

కొత్త రేషన్ కార్డులు, భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12 వేల సాయం, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లపై చర్చించనున్న కేబినేట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. సమావేశంలో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు,

తరువాయి 2లో

# చైనాలో హెచ్‌ఎంపివి కలకలం



**న్యూఢిల్లీ :** ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారికి పుట్టినిల్లుగా చెప్పుకునే చైనాలో ఇప్పుడు మరో వైరస్ వ్యాప్తి కలవరానికి గురిచేస్తోంది. ప్రస్తుతం అక్కడ హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ (హెచ్‌ఎంపివి) తీవ్రంగా వ్యాప్తి చెందిందని, కొవిడ్ వెలుగులోకి వచ్చిన సరిగ్గా ఐదేండ్ల తర్వాత మరో ప్రమాదకర వైరస్ వ్యాప్తి చెందుతున్నదని స్థానిక, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ వైరస్ బారినపడి అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల్లో చేరుతున్నట్లు

తరువాయి 2లో

## ఢిల్లీలో సావర్కర్ కాలేజీ

# తెగించిన ప్రధాని మోదీ

మన్మోహన్ పేరు పెట్టాలని కాంగ్రెస్ డిమాండ్

సావిత్రి బాయి ఫూలే పేరు పెట్టాలి : డి.రాజా



**న్యూఢిల్లీ :** ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలో నిర్మించబోయే నూతన కళాశాలకు హిందూత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్ పేరు పెట్టడం వివాదాస్పదంగా మారింది. తక్షణమే ఆ పేరును మార్చి, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ కళాశాల ఏర్పాటుపై ప్రకటన వెలువడిన వెంటనే ప్రధానమంత్రి ముందు మూడు డిమాండ్‌లు పెడుతూ ఎన్‌ఎస్‌యుఐ లేఖ రాసింది. 'ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలో నిర్మిస్తున్న ప్రపంచ స్థాయి కళాశాలకు డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలి. ఒక సెంట్రల్ యూనివర్సిటీని కూడా ఆయన పేరుతో అంకితం చేయాలి. విభజన అనంతరం విద్యార్థి దశ నుంచి విద్యారంగం, రాజకీయ రంగంలో అంతర్జాతీయ వ్యక్తిగా ఖ్యాతి సాధించిన మన్మోహన్ జీవిత ప్రయాణాన్ని పాఠ్యాంశాలలో చేర్చాల'ని లేఖలో పేర్కొన్నారు. దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం కోసం అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ జీవితాలను త్యాగాలు చేశారని, అందులో ఎవరిదైనా పేరును కొత్త కాలేజీకి పెడితే వారికి నివాళి అర్పించినట్లు అవుతుందని కాంగ్రెస్ ఎంపి నాసిర్ హుస్సేన్ అన్నారు. బిజెపికి నాయకులు, ప్రఖ్యాతులు ఎవరు లేకపోవడంతో బ్రిటీషవారికి మద్దతు పలికిన వారినే ప్రోత్సహిస్తూ, చట్టబద్ధత కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు.

**శంకుస్థాపన చేసిన ప్రధాని**

నజఫ్‌గఢ్‌లోని రోషన్‌పురాలో వీర్ సావర్కర్ కాలేజీకి శుక్రవారం నాడు ప్రధాన మంత్రి నరంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఈ కాలేజీని రూ.140 కోట్లతో నిర్మించనున్నారు. దాంతో పాటుగా ప్రధాన మంత్రి ఢిల్లీ యూనివర్సిటీలో భాగంగా తూర్పు ఢిల్లీలో సూరజ్‌మల్ విహార్ క్యాంపస్‌లో, ద్వారకాలోని పశ్చిమ క్యాంపస్‌లో రెండు అకడమిక్ బ్లాక్‌లకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు కొత్త క్యాంపస్‌లో విద్య, పరిశోధనలకు ఆధునిక వసతులను సమకూర్చనున్నారు. వీటన్నిటికీ రూ.600 కోట్లకు పైగా ఖర్చు కానుంది. ఢిల్లీ యూనివర్సిటీకి నలు దిక్కులలో క్యాంపస్‌లు ఉండడం తమకు గర్వకారణమని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యోగేశ్ సింగ్ అన్నారు.

**సావిత్రిబాయ్ ఫూలే పేరు పెట్టాలి: డి.రాజా**

ఢిల్లీ యూనివర్సిటీలో నూతన కళాశాలకు సావిత్రి బాయి ఫూలే పేరు పెట్టాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా విద్య, సామాజిక సమానత్వానికి పునాది వేసిన సంఘ సంస్కరణ ఆమె అని కొనియాడారు. మార్పు కోసం ఆమె సాహసం, దూరదృష్టి,

తరువాయి 2లో

# అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్



**హైదరాబాద్ :** సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి న్యాయ స్థానం రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఆయనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అల్లు అర్జున్ హైకోర్టు మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. రెగ్యులర్ బెయిల్‌పై నాంపల్లి కోర్టులో వాదనలు ముగియగా తాజాగా న్యాయస్థానం తీర్పును వెలువరించింది. అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు నెలల పాటుగా ఛార్జిషీట్ దాఖలు చేసే వరకు చిక్కడపల్లి పోలీసుల విచారణకు అల్లు అర్జున్

తరువాయి 2లో

# ఆస్తి హక్కు... 'రాజ్యాంగహక్కు'



బిఎంఐసిపి భూసేకరణ కేసులో కర్నాటక హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ దాఖలైన అప్పీల్‌పై 'సుప్రీం' తీర్పు

**న్యూఢిల్లీ :** ఆస్తి హక్కు రాజ్యాంగ హక్కు అని, చట్టప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించకుండా వ్యక్తి లేకుండా అతని ఆస్తిని హరించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగం (44వ సవరణ) చట్టం 1978కారణంగా ఆస్తిపై హక్కు ప్రాథమిక హక్కుగా నిలిచిపోయిందని, అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఎ కింద ఆస్తిహక్కు మానవహక్కుగా, రాజ్యాంగబద్ధమైన హక్కుగా సంక్షేమ రాజ్యంలో కొనసాగుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయి, కెవి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఎ చట్టం అధికారం ద్వారా తప్ప ఏ వ్యక్తి తన ఆస్తిని కోల్పోకూడదనే రక్షణను కల్పించింది. బెంగళూరు'మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ప్రాజెక్ట్ (బిఎంఐసిపి) కోసం భూసేకరణకు సంబంధించికర్నాటక హైకోర్టు నవంబరు 2022న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. 'ఇందులో చర్చించినట్లుగా, ఆస్తిపై హక్కు ప్రాథమిక హక్కు కానప్పటికీ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఎ నిబంధనల దృష్ట్యా ఇది రాజ్యాంగహక్కు' అని ధర్మాసనం పేర్కొంది. 'ఒక వ్యక్తికి చట్ట ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించకుండా ఒక వ్యక్తి అతడి ఆస్తిని కోల్పోలేడు' అని మౌలిక సదుపాయాల కారిడార్‌కు సంబంధించిన పరిహారంపై సుప్రీంకోర్టు డివిజన బెంచ్ తన తీర్పును వెలువరించింది. ప్రాజెక్ట్ కోసం భూములను సేకరించేందుకు జనవరి 2003లో కర్నాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కెఐఎడిబి) నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ప్రాజెక్ట్ కోసం భూములను సేకరించేందుకుగాను 2005నవంబరులో అప్పీలుదారుల

తరువాయి 12లో

## లాక్కున్నంత మాత్రాన

# మీదైపోదు

ఆక్రమిత భూభాగంలో చైనా కౌంటీలను సమ్మతించం

సార్వభౌమాధికారాన్ని వదులుకోం : భారత్ తీవ్ర నిరసన



**న్యూఢిల్లీ :** చైనా ఆక్రమణలో ఉన్న అక్సాయ్‌చిన్ భూభాగాలను ఆ దేశం అధికారికంగా సృష్టించిన రెండు కొత్త కౌంటీలలో కలిపేసుకోవడంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. బలవంతంగా లాక్కుని అక్రమంగా, అన్యాయంగా ఆక్రమించిన అక్సాయ్‌చిన్ ప్రాంతంలో కొత్త కౌంటీలు సృష్టించినంత మాత్రాన అది చైనా భూభాగంగా మారిపోదని, దానికి ఎంతమాత్రం చట్టబద్ధత రాబోదని భారత విదేశీ వ్యవహారాలమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విమర్శించారు. చైనా చర్యకు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. భారత్ భూభాగం లధఖ్‌లోకి ఈ రెండు కౌంటీలు చొరబడ్డాయి. ఈ కౌంటీలు సృష్టించినట్లు చైనా ప్రకటన వెలువడిన సరిగ్గా వారం రోజులకు భారత్ స్పందించింది. సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకునే విషయంలో

తరువాయి 12లో

# యూరప్‌కు ఆగని అక్రమ వలసలు

## మరో 27మంది మృతి



**పదేళ్ళలో మధ్యధరా సముద్రంలో 24,500 మంది మృతి**

**ట్యునీస్ :** యూరప్‌కు అక్రమ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మధ్యధరా సముద్రంలో మరో రెండు బోట్లు బోల్తా పడ్డాయి. ఈ ఘటనల్లో 27 మంది మరణించారు. మరో 83 మందిని కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ట్యునీషియా తీర ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. వలస ప్రజలు రహస్యంగా బయలుదేరేందుకు ఎస్‌ఫాక్స్ నగర తీరంలో ఒక ప్రదేశం ఉంది. అక్కడి నుండి రెండు బోట్లు బయలుదేరిన తర్వాత అవి బోల్తాపడ్డాయి. ఎక్కువగా లిబియా, ట్యునీషియా దేశాల బోట్లు ఇలా బోల్తా పడుతూ ఉంటాయి. ఈమధ్య ట్యునీషియా వలసమృతుల వార్తల్లోకి వస్తున్నది. డిసెంబరు 31వ తేదీ రాత్రి రెండు బోట్లు బయలుదేరిన తర్వాత మునిగిపోయాయి. ఆఫ్రికా నలుదిశల నుండి (సబ్ సహారన్ ఆఫ్రికన్ కంట్రీస్) వచ్చిన వలస ప్రజలు ఈ పడవల్లో ఉన్నారని ఎస్‌ఫాక్స్ నగర రక్షణ విభాగం డైరెక్టర్ జియాద్ అల్ సిదిరి విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. సజీవులైన 15 మందిని ఆసుపత్రికి తరలించి ఫస్ట్ ఎయిడ్ చేశారు. మృతుల దేహాలన్నింటినీ తీరప్రాంత గస్తీ దళాలకు అప్పగించారు. వారు వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతారు. గతనెలలో కూడా ట్యునీషియా గస్తీదళ అధికారులు 30 మృతదేహాలను మధ్యధరా సముద్రంలో స్వాధీనం చేసుకున్నారు. మధ్యధరా సముద్రంలో 2024లో 2,200 మంది అక్రమ వలస వెతుకూ మరణించారని యూనిసెఫ్ ప్రకటించింది. 2023లో 1300 మంది మరణించారని తెలిపింది. ఈ సంఖ్య ఏటేటా పెరుగుతోందని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు అమెరికా వలసవచ్చేవారిని కట్టడిచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా, యూరప్ దేశాలు కూడా ఈ నిబంధనలను కట్టుదిట్టం చేస్తున్నాయి. 2024లో ట్యునీషియా తీరంలో 700 మంది మరణించారని ఆ దేశ గస్తీ దళం తెలియజేసింది. మధ్యధరా సముద్రంలో 2014 నుండీ ఇప్పటివరకూ 24,500 మంది ఈ విధంగా అక్రమంగా వలస ప్రయాణికులు మరణించారని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) తెలియజేసింది. ఆఫ్రికా నుండి యూరప్‌కు సముద్ర మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా మధ్యధరా సముద్రంలో అక్రమంగా ప్రయాణించేవారి పడవలు పగిలిపోవడం, ధ్వంసంకావడం, బోల్తాపడటం వల్ల వేలాదిమంది మరణించారు. ఈ అక్రమ వలసలను అడ్డుకునేందుకు యూరోపియన్ యూనియన్ 2023లో ట్యునీషియాతో ఒక ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు 262 మిలియన్ డాలర్లు ట్యునీషియాకు సమకూర్చింది.

## ప్రపంచం

# 2024లో రష్యాకు భారీ సైనిక నష్టం నిజమేనా?



**కీవ్ :** ఉక్రేన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా 2024లో భారీ మూల్యాన్ని చెల్లించిందని ఉక్రేన్ చెబుతున్నది. సహజంగా ఎదుటిపక్షం శత్రువును దెబ్బతీసేందుకు ఎప్పుడూ తప్పుడు ప్రచారాలు చేయడం కూడా ఒక యుద్ధవ్యూహంగానే ఉంటుంది. ఐతే తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా 4.30 లక్షలమంది సైనికులను కోల్పోయిందని, అంటే వారంతా మరణించడమో లేక యుద్ధానికి పనికిరాకుండా పోవడమో జరిగిందని ఉక్రేన్ చెబుతున్నది. రష్యా ఒకశాతం ఉక్రేన్ భూభాగాన్ని కూడా స్వాధీనం చేసుకోలేకపోయిందని అంటున్నది. ఉక్రేన్‌లోని ఔడివ్‌కా, సెలైడోవ్, ఊహ్లెడార్, ఖురఖోవ్ అనే నాలుగు ప్రాంతాలను స్వాధీనం చేసుకునేందుకు మూడేసి నెలలు గడువు తీసుకుందని, ఇప్పుడు ఆ భూభాగంలో చాలావరకూ ఖాళీ చేసిందని ఉక్రేన్ చెబుతున్నది. ఇందుకు రష్యా ఇంకా సమాధానం చెప్పాల్సింది.

# హెచ్1బి వీసాలపై 'సాగు'తున్న చర్చ

**వాషింగ్టన్ :** ఒకవైపు డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవం గడువు దగ్గర పడుతుంటే మరోవైపు హెచ్1బి వీసాలపై చర్చ ఇంకా వేడి వేడిగా కొనసాగుతూనే ఉంది. ఈ వీసాల జారీపై పార్టీలలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పార్టీలు ఈ విషయంలో ఏకాభిప్రాయానికి రాలేదు. ఫారిన్ గెస్ట్ వర్కర్స్ వీసాలను ఎంతో గొప్ప నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులకు తప్ప ఇవ్వకూడదన్నది చర్చ. వాస్తవంగా డెమోక్రాట్లు, రిపబ్లికన్లు రెండుపార్టీల మధ్య ఈ విషయంలో విభేధాలు వచ్చాయి. ఈ హెచ్1 బి వీసాల వల్ల భారతీయులే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ నైపుణ్యంగల వృత్తినిపుణులుగా భారతీయులకే అవి ఎక్కువగా దక్కుతున్నాయి. ప్రతి సంవత్సరం 65,000 మందికి ఈ వీసాలు ఇవ్వాలని కాంగ్రెస్ తీర్మానం. మరో 20వేలు వీసాలు కూడా ఉన్న విద్యకోసం ఇస్తున్నారు.

47వ అమెరికా అధ్యక్షుడుగా ఈనెల 20న ట్రంప్ ప్రమాణ స్వీకారం చేస్తారు. హెచ్1బి వీసాలకు ఆయన మద్దతు ఇస్తున్నారు. ఐతే దీనిపై ఎలాన్‌మస్క్, వివేక్ రామస్వామిలతో కూడిన కొత్త మంత్రిత్వశాఖ ప్రధానంగా నిర్ణయం తీసుకుంటుంది. ట్రంప్ మాత్రం ఈ వీసాల జారీకి సుముఖత వ్యక్తం చేశారు. మస్క్, రామస్వామి కూడా ఈ వీసాలు అనివార్యమని వాదిస్తున్నారు. భారత సంతతికి చెందిన చట్టసభ సభ్యులతో వారు ఏకీభవిస్తున్నారు.



# అటు దోహాలో చర్చలు.. ఇటు గాజాలో దాడులు

**డెయిర్ అల్–బలాహ్ :** చాలా రోజుల తర్వాత హమాస్‌తో గాజా సమస్యపై దోహాలో మధ్యవర్తులు చర్చలు ప్రారంభించారు. మరోవైపు శుక్రవారంనాడు గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 50 మంది మరణించారు. ఇజ్రాయెల్ గగనతల దాడులలో హమాస్ సెక్యూరిటీ ఆఫీసర్‌తోపాటు 50 మంది మరణించారు. గురు,శుక్రవారాలలో బాంబు దాడులు యథేచ్ఛగా కొనసాగాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ కార్యాలయం తెలియజేసింది. అదేవిధంగా దోహాలో చర్చలు జరపడానికి ఒక ప్రతినిధి బృందాన్ని మొస్సాద్ ఇంటిలిజన్స్ ఏజన్సీ నుండి పంపేందుకు అనుమతి ఇచ్చినట్లు కూడా ప్రధానమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఒక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేవరకూ ఖతార్‌లో సంప్రదింపులు కొనసాగించాలని ఇంటిలిజన్స్, ఇంటర్నల్ సెక్యూరిటీ, మిలిటరీ ప్రతినిధి బృందాన్ని కోరినట్లు తెలిపింది. గడచిన 15 నెలల యుద్ధ సమయంలో పదే పదే శాంతి చర్చలకు విఘాతం కలిగి నిలిచిపోయాయి. అమెరికా నాయకత్వంలో ఈ చర్చలు జరుగుతున్నాయి.

# యోల్ నివాసం వద్ద హైడ్రామా

**అరెస్టు వాయిదా**

**దర్యాప్తు అధికారులను అడ్డుకున్న ప్రదర్శకులు**

**సియోల్ :** కోర్టు ఉత్తర్వుల మేరకు దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేసేందుకు వెళ్ళిన దర్యాప్తు అధికారులకు శుక్రవారంనాడు చుక్కెదురైంది. యోల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఆరుగంటలసేపు యోల్ నివాసం వద్ద హైడ్రామా నడిచింది. భారీఎత్తున అక్కడ గుమిగూడిన ప్రదర్శకులు దర్యాప్తు అధికారులను ఎటూ కదలకుండా అడ్డుకున్నారు. సుమారు 20 మందిపైగా దర్యాప్తు అధికారులు, 80 మంది పోలీసులు, 200మంది సాయుధులైన భద్రతాదళం యోన్ నివాసం వద్ద గుమిగూడిన ప్రదర్శకులను ఏమీ చేయలేకపోయింది. ఎటూకదలలేక ఆ విధంగా వారు ఆరుగంటలపాటు స్తంభించిపోయారు. దీంతో యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేయాలన్న నిర్ణయాన్ని దర్యాప్తు అధికారులు వాయిదా వేసుకున్నారు. భద్రతా కారణాలరీత్యా అరెస్టును వాయిదా వేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు వివరణ ఇచ్చారు. ఒకవేళ నిర్ణీత ప్రకారం యోల్‌ను శుక్రవారంనాడు అరెస్టు చేసి ఉంటే 48 గంటలపాటు దర్యాప్తు అధికారులు ఆయన్ను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసి ఉండేవారు. దేశాధ్యక్షుణ్ణి (మాజీ) అరెస్టు ప్రయత్నం దక్షిణ కొరియాలో ఇదే మొదటిసారి.

కోర్టు ఆయనకు వ్యతిరేకంగా అరెస్టు వారెంటు జారీ చేయకముందునుండీ యోల్‌కు మద్దతుగా లక్షలాదిమంది దేశంలో ప్రదర్శనలు చేస్తున్నారు. ఆయన అరెస్టు చేయకూడదని వాదిస్తున్నారు. అదేవిధంగా ప్రతిపక్షాల నాయకత్వంలో యోల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కూడా ప్రదర్శనలు జరిగాయి.

**14 నుండి సుప్రీంకోర్టు విచారణ**

దేశంలో అక్రమంగా మార్షల్ లా విధించడం వెనుక ఉన్న ఆంతర్యాలు తెలుసుకునేందుకు దక్షిణ కొరియా సుప్రీంకోర్టు జనవరి 14 నుండి యోల్ ఇంపీచ్‌మెంట్‌పై విచారణ, వాదోపవాదాలను వినడం ప్రారంభిస్తుంది. ఇప్పటికే తాత్కాలిక అధ్యక్షుడు ఇద్దరు న్యాయమూర్తులను నియమించడంతో ధర్మాసనంలో న్యాయమూర్తుల సంఖ్య ఎనిమిదికి చేరింది. డిసెంబరు (2024) 14న యూన్ సుక్ యోల్‌పై జాతీయ అసెంబ్లీలో అభిశంసన తీర్మానం చేశారు. సరిగ్గా నెలరోజులకు అదేరోజున కోర్టులో విచారణ కూడా ప్రారంభం కానున్నది. యూన్ సుక్ యోల్ అధ్యక్షపదవి పోగొట్టుకున్నారు. ఆయనకు ఎలాంటి అధికారాలు లేవు. ఆయన పుణ్యమాఅని ఆయన స్థానంలో అధికారం చేపట్టిన మరో తాత్కాలిక అధ్యక్షుడు కూడా జాతీయ అసెంబ్లీలో అభిశంసనకు గురయి పదవి పోగొట్టుకోవడంతో నెలరోజుల వ్యవధిలోనే తాత్కాలిక అధ్యక్ష బాధ్యతల నిర్వహణకు మూడో నాయకుడు మోక్ రంగ ప్రవేశం చేశారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం తీసుకురావడమే తన ధ్యేయమని ఆయన చెబుతున్నారు. పీపుల్స్ పవర్‌పార్టీ నాయకుడు యూన్ సుక్ యోల్ రెండున్నర సంవత్సరాలు అధ్యక్షపదవిలో కొనసాగిన తర్వాత ఆకస్మికంగా 2024 డిసెంబరు 3వ తేదీన దేశంలో మార్షల్ లా విధించారు. దీంతో పదవికి తానే ఎసరుపెట్టుకున్నట్లయింది. కొద్ది గంటల వ్యవధిలోనే మార్షల్ లా ఉత్తర్వులను వెనక్కు తీసుకున్నప్పటికీ పదవి పోగొట్టుకున్నారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకే మార్షల్ లా విధించారని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గతనెలారంభం నుండీ దక్షిణ కొరియాలో తీవ్ర రాజకీయ సంక్షోభ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంటు తీసుకువెళ్ళినప్పటికీ యోల్‌ను అరెస్టు చేయలేకపోయామనీ, ఆయన ఇంటివద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడి తాము బయటే స్తంభించిపోయామని ఉన్నతస్థాయి దర్యాప్తు అధికారులు చెప్పారు.





## రెగ్యులర్ బెయిల్ (మొదటి పేజీ తరువాయి)

హాజరుకావాలని కోర్టు అదేశాలు జారీ చేసింది. కోర్టు ముందస్తు అనుమతి లేకుండా అర్జున్ దేశం విడిచి వెళ్లకూడదని న్యాయస్థానం అదేశించింది. ఒక్కొక్కరికి రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు తెలిపింది. దీంతో పాటు అల్లు అర్జున్ దర్యాప్తు చేస్తున్న పోలీసులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎటువంటి బెదిరింపులకు పాల్పడవద్దని కోర్టు సూచించింది. ఈ కేసుకు సంబంధించిన సాక్షులను బెదిరించే ప్రయత్నం చేయవద్దని కోర్టు హెచ్చరించింది. డిసెంబరు 4న పుష్ప బెనిఫిట్ షో రోజు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో మరుసటి రోజు ఉదయం జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, డిసెంబరు 27న రిమాండ్ ముగిసింది. అదే రోజు ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అప్పుడే ఆయన తరపు లాయర్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ విచారణ వాయిదా పడగా, సోమవారం నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది.

## హెచ్ఎంపివి కలకలం

**(మొదటి పేజీ తరువాయి)**

సమాచారం. హెచ్ఎంపివితోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్–19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ ప్రకటించినట్లు పలువురు నెటిజన్లు పేర్కొంటున్నారు. అయితే, దీనిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఈ కొత్త వైరస్ లక్షణాలు ఎలా వ్యాపిస్తుంది, నివారణ చర్యలు వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కొవిడ్ తరహా లక్షణాలే....**

ఈ వైరస్ సోకిన వారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తాయని తెలిసింది. దగ్గు, జ్వరం, ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఈ వైరస్ సోకిన వారిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. వైరస్ తీవ్రమైతే బ్రోన్కైటిస్, న్యుమోనియా వంటి సమస్యలకు దారితీస్తుంది. మూడు లేదా ఆరురోజుల వరకూ లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ తీవ్రతను బట్టి లక్షణాలు వేర్వేరు వ్యవధిలో ఉంటాయి. కరోనా మాదిరిగానే ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ ఈజీగా సోకుతుంది. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ దరి చేరకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం.. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రద్దీ ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండడం వంటివి తప్పనిసరిగా పాటించాలి. తద్వారా వైరస్ వ్యాప్తిని కాస్తమేర కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

## క్లీన్ అండ్ గ్రీన్

**(మొదటి పేజీ తరువాయి)**

శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశానంతరం మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రీన్ పవర్ డిమాండ్‌ను, ప్రస్తుత కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని 'క్లీన్ అండ్ గ్రీన్' పవర్‌ను ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ప్రస్తుతం 13,623 మెగావాట్ల డిమాండ్ ఉండగా, 2024–30 సంవత్సరానికిగాను 24,215 మెగావాట్ల డిమాండ్ ఉంటుందని, 2035 సంవత్సరం నాటికి 31,809 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని తమ అంచనా అని వివరించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలను ఆహ్వానిస్తామని, వారికి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. గ్రీన్ పవర్ ఉత్పత్తి విషయమై ఇతర రాష్ట్రాలతో మాట్లాడి అక్కడి విద్యుత్ ఉత్పత్తి విషయమై ఒప్పందం చేసుకుంటామని భట్టి తెలిపారు. రాష్ట్రం 11,399 మెగావాట్ల గ్రీన్ పవర్ సామర్థ్యాన్ని సొంతం చేసుకుని, 2030 నాటికి 20,000 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుత పునరుత్పత్తి శక్తి సామర్థ్యం 11,399 మెగావాట్లు ఉండగా, 7,889 మెగావాట్ల సౌరశక్తి, 2,518 మెగావాట్ల జలశక్తి, 771 మెగావాట్ల పంపిణీ పునరుత్పత్తి శక్తి, 221 మెగావాట్ల ఇతర పునరుత్పత్తి శక్తికి (128 మెగావాట్లు పవన శక్తి) అవకాశం ఉన్నదన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ ఉన్నాయని, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వంటి ఆధునిక పరిష్కారాలు పరిశీలనలో ఉన్నాయని ఆయన వివరించారు. 54,717 మెగావాట్ల గాలివస్తు సామర్థ్యం కలిగి, దేశంలో టాప్ 8 రాష్ట్రాలలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, పంప్డ్ స్టోరేజ్ వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తోందన్నారు.

**పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు సబ్సిడీలు..**

విద్యుత్ వాహన చార్జింగ్ స్టేషన్ల సంఖ్య ప్రస్తుతం 872కి చేరుకుంది. పారిశ్రామికవేత్తలకు పన్ను మినహా యింపులు, చెల్లింపుల సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షిస్తామని, వ్యర్థాలను శక్తిగా మార్చడం వంటి ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. పునరుత్పత్తి శక్తి రంగంలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉన్నదని, ఈ రంగంలో రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు.

**అవసరమైతే 'పవర్ ఆదాయం'**

తెలంగాణ రాష్ట్రంను పవర్ ప్లస్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, అవసరమైతే పవర్ నుంచి ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తామని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ, ఫార్మాసిటీ, ఆర్ఆర్ఆర్ ఏర్పాటు హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ లాంటివి పూర్తయితే, విద్యుత్ అవసరం ఉంటుందని, ఇలా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికను రూపొందిస్తున్నామని వివరించారు. గ్రీన్ పవర్ విషయమై స్టేక్ హోల్డర్స్‌తో జరిగిన సమావేశంలో పలు అంశాలపై సలహాలు తీసుకున్నామని, వీటన్నింటినీ క్రోడీకరించి తుది గ్రీన్ పాలసీని ప్రకటిస్తామని భట్టి తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సిఎండి బలరాంనాయక్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషరఫ్‌అలీ ఫారూఖీ, టిజి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, రెడ్‌కో సిఎండి వెన్నల, ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి హాజరయ్యారు.

## ఈనెల 6న కెటిఆర్ విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**

కావాలని ఎసిబి నోటీసులో పేర్కొంది. కెటిఆర్‌ను విచారించిన తరువాతనే మిగతా నిందితులను విచారించనుంది. ఇదే కేసులో ఈనెల 7న డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు కెటిఆర్‌ను విచారించాల్సి ఉంది. ఫార్ములా ఈ–కార్ రేస్‌కు సంబంధించి హెచ్ఎండిఎ హిమాయత్‌నగర్‌లోని ఓవర్సిస్ బ్యాంక్‌లో ఉన్న తన ఖాతా నుంచి రూ.55 కోట్లను అక్రమంగా ప్రైవేటు సంస్థలకు బదిలీ చేశారని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎసిబి గత నెల 19న వీరిపై కేసు నమోదు చేయగా మరుసటి రోజే ఇడి అధికారులు కూడా కేసు నమోదు చేశారు. అటు ఎసిబి ఇటు ఇడి అధికారులు ఈ కేసుపై దర్యాప్తును ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఈ కేసులో నిందితులుగా ఉన్న కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలను ఎసిబి, ఇడి విచారించనుంది. ఇప్పటికే ఈ రెండు దర్యాప్తు సంస్థలు నిందితులకు నోటీసులు జారీ చేశాయి. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే నోటీసులు అందుకున్న అరవింద్‌కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలు ఇడి విచారణకు గైర్హాజరయ్యారు. గడువు కావాలని ఈమెయిల్ పంపారు. దాంతో వారిద్దరి విచారణను తాత్కాలికంగా వాయిదా వేసి ఈనెల 8, 9 తేదీలతో ఇడి అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఫార్ములా ఈ–రేసు నిర్వహణకు మంత్రి మండలి ఆమోదం లేకుండా, ఆర్బీఐ అనుమతి తీసుకోకుండానే నిధులు మళ్లించారన్న ఆరోపణపై నిందితులను విచారించనున్నారు. ఇదిలావుండగా ఎసిబి నమోదు చేసిన కేసు కొట్టివేయాలంటూ కెటిఆర్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై తుది తీర్పు రాలేదు. తీర్పు వచ్చేంత వరకు కెటిఆర్‌ను అరెస్టు చేయరాదని హైకోర్టు చెప్పిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వచ్చేంత వరకు ..తమ విచారణ కొనసాగుతుందని ఎసిబి, ఇడి అధికారులు అంటున్నారు. అరెస్టులు మాత్రం తీర్పు వచ్చిన తరువాతనే పరిశీలిస్తామంటున్నారు.

## మంత్రివర్గ సమావేశం

**(మొదటి పేజీ తరువాయి)**

భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12వేల సహాయం, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ నివేదిక, షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యంగా 'రైతు భరోసా' అమలుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో రైతు భరోసాపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం నివేదికపై శనివారం సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో సంతాప దినాలను ప్రకటించడం, ఆయనకు సంతాపం తెలియజేసేందుకు తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడం వల్ల డిసెంబర్ 30వ తేదీన జరగాల్సిన మంత్రివర్గ సమావేశం జనవరి 4వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే.

## వ్యవసాయ కూలీలకు రూ.12వేలు

**(మొదటి పేజీ తరువాయి)**

సంబంధించి ఈనెల 5వ తేదీ నుంచి గ్రామ సభల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వార్తల నేపథ్యంలో అదే వేదికల నుంచి కౌలు రైతులతో పాటు వ్యవసాయ కూలీల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కన్నెగంటి రవి, కొండల్, వెంకయ్య పి.శంకర్ తదితరులు మాట్లాడుతూ కౌలు రైతులకు సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అనుసరిస్తున్నట్లు కనబడుతోందని, ఇది ప్రభుత్వానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఇప్పటికే బిజెపి, బిఆర్ఎస్, రాజకీయ కాంగ్రెస్‌ను దెబ్బకొట్టి గద్దె దించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రజల నుంచి వారి మనుస్సులు గెలుచుకోవాలని, లేకపోతే ప్రజలు సైతం తిరగబడితే ఈ ప్రభుత్వానికి తిప్పలు తప్పవని విషయం గుర్తు ఉంచుకోవాలని హెచ్చరించారు.

## ఘనంగా నూమాయిష్ షురూ

**(మొదటి పేజీ తరువాయి)**

అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా వచ్చే ఆదాయంతో తెలంగాణ నలుమూలల మహిళా సాధికారతలో భాగంగా దాదాపు 30వేల మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉన్న కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలకు నాటి ప్రధాని దివంగత జవహర్‌నెహ్రూ శంకుస్థాపన చేస్తే, మాజీ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని తెలిపారు.. ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగే విద్యారంగ వ్యాప్తికి మరింత కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం వరకు మరో 10 విద్యాసంస్థలను కరీంనగర్, నిజామాబాద్ ములుగు అదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం తరుపున అన్ని సహకారాలు అందిస్తామన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ హైదరాబాద్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ లాంటి నగర ఉన్నతాధికారులను ఎగ్జిబిషన్ భాగస్వాములను చేయాలని సూచించారు. అన్నిశాఖల ఉన్నతాధికారులు భాగస్వాములైనప్పుడే ఎగ్జిబిషన్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టిపిసిసి అధ్యక్షుడు ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆయన సూచించారు. ఒక వైపు మహిళల సాధికారితకు మరో వైపు నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ఎగ్జిబిషన్ సొసైటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, కోశాధికారి ప్రభాకర్ సంయుక్త కార్యదర్శి డి.మోహన్ తోపాటు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ గంగాధర్, ధనం వీరేందర్, ఏనుగుల రాజేందర్. ఆర్.సుఖేష్ రెడ్డి, అశ్విని మార్గల, ఆధిత్య మార్గం, పబ్లిసిటీ కన్వీనర్ సురేష్, హనుంతరావులతో పాటు సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెగించిన ప్రధాని మోదీ

**(మొదటి పేజీ తరువాయి)**

నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిని అందిస్తోందని అన్నారు. సావిత్రి బాయి ఫూలే వారసత్వానికి నివాళిగా, విద్యలో మహిళలకు సాధికారత కల్పించే దిశగా ఢిల్లీ యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టి గౌరవించాలని కోరారు.

**గాడ్సే పేరు కూడా పెడతారేమో? : నారాయణ**

చదువుల దేవాలయానికి హిందూత్వ వాదానికి ఆద్యుడైన సావర్కర్ పేరు పెట్టడం పూర్తి అభ్యంతరకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా వ్యతిరేకించారు. మహాత్మా గాంధీ హత్య కేసులో కూడా ఒక నిందితుడిగా అనుమానించబడ్డ సావర్కర్ పేరును సరస్వతీ నిలయానికి పెడతారా? ఇది ఇలాగే వదిలేస్తే గాడ్సే పేరును కూడా ఏ విశ్వవిద్యాలయాలకో, ఉన్నత సంస్థలకో కూడా పెట్టే అఘాయిత్యానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుందని ఒక ప్రకటనలో మండిపడ్డారు.

## ఆదాయం సరిపోట్లే

**(మొదటి పేజీ తరువాయి)**

ఉద్యోగులను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసునని, అలాంటి పరిస్థితుల్లో ఒక గొప్ప అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారన్నారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి తారీకునాడు జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామన్నారు. ప్రతి నెల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.18,500 కోట్లు అని, ఇది ప్రభుత్వ అవసరాలకు సరిపోవడంలేదని సిఎం చెప్పారు. అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే రూ.30 వేల కోట్లు కావాలని వెల్లడించారు. వచ్చే ఆదాయంలో రూ.6,500కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నామని, మరో రూ.6,500 కోట్లు ప్రతి నెల అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మిగిలిన రూ.5,500 కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి అని, కనీస అవసరాలకు ప్రతి నెల 22,500 కోట్లు అవసరమని తెలిపారు. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4000 కోట్లు తక్కువ పడుతోందని చెప్పారు. గత పదేళ్లలో పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే పరిపాలనా వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని, సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేర్చేది ఉద్యోగులేనన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వ ఆదాయం ప్రతీనెలా మరో రూ. 4000 కోట్లు పెంచుకోవాలని, సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ధర్నాలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదని, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉన్నా ప్రభుత్వానికి చేయలేని పరిస్థితి అని, నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

**గ్రామీణ రహదారులకు మహర్దశ :**

**రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం**

**జనవరి నుంచి జూన్ వరకు ప్రతి నెల రూ.150 కోట్లు విడుదల : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

రాష్ట్రంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.1000 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటాయించారు. ఈ రహదారుల నిర్మాణానికి ఈనెల నుంచి నెలకు రూ.150 కోట్ల చొప్పున జూన్ నెలాఖరు నాటికి ఈ రూ. 1000 కోట్లను విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సిఎం ఆదేశించారు. శుక్రవారం సచివాయలంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించి సిఎం పలు కీలక సూచనలు చేశారు.

# కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలే పట్టుగొమ్మలు




## ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యంగా ముందుకు కదలండి
## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలే ప్రధాన పట్టుగొమ్మలని, అలాంటి ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు కదలాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల, ప్రజా సంఘాల సంయుక్త సమావేశం సమావేశం సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ఉద్యమ చరిత్రలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించడం జరిగిందన్నారు. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక, కర్షక, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాటలు నిర్వహించేది ఎర్ర జెండా పార్టీయేనన్నారు. భారతదేశంలో మొట్టమొదటగా ప్రజా సంఘాలను ఏర్పాటు చేసిందని, కార్మికుల కోసం ఏఐటియుసిని విద్యార్థుల కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య, యువజనుల కోసం అఖిల భారత యువజన సమాఖ్య, మహిళల కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య, రైతుల కోసం అఖిల భారత కిసాన్ సభ, వ్యవసాయ కూలీల కోసం భారత్ ఖేత్ బజ్దూర్ యూనియన్, కళాకారుల కోసం ఇప్టా.. ఇలా అనేక రకాల సంఘాల ఏర్పాటు చేసి అన్ని రంగాల సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు నేటికీ నిర్వహిస్తుందన్నారు. పార్టీ అభ్యున్నతికి, బలోపేతం కోసం ప్రజా సంఘాల నిర్మాణం బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ప్రజా సంఘాల బాధ్యులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రజా సంఘాల నిర్మాణం చేయడం కోసం గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో సభ్యత్వం, కమిటీలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, లక్ష్మి సమ్మయ్యతో పాటు ప్రజా సంఘాల ఆఫీసర్ బేరర్స్ పాల్గొన్నారు.



**బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన సావిత్రిబాయి పూలే**

భారతదేశంలో అణగారిన, పేద, బడుగు, బలహీన వర్గాల బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యాయురాలు, అభ్యుదయవాది, సంఘ సేవకురాలు సావిత్రిబాయి పూలే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీల అభివృద్ధి అని నమ్మి బాలికల కోసం దేశంలో మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించిన వీర వనిత సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహిళాభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి

## సావిత్రిబాయి పూలేకు సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆ మహనీయురాలి చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్న తరుణంలో మహిళా ఉపాధ్యాయులందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సావిత్రి బాయి పూలే ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పునకు సావిత్రిబాయి పూలే పునాది వేశారని అన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సావిత్రిబాయి ఆశయాలను సాధించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. మహిళల సాధికారత, ఆడబిడ్డలకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాల వృద్ధికి ప్రజా ప్రభుత్వం ఇప్పటికే పలు



కార్యక్రమాలు చేపట్టిందన్నారు. బిసిలు, బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ అభ్యున్నతికి రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వేను ఇటీవలే పూర్తి చేసిందని అన్నారు. వారి త్యాగానికి, కృషికి గుర్తింపుగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళా టీచర్లు సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రతి ఏడాది ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎంపి పోరిక బలరామ్‌నాయక్, ఎంఎల్‌ఎలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు సావిత్రీ బాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

**మహిళా సాధికారతకు పర్యాయపదం సావిత్రిబాయి పూలే**

మహిళా సాధికారతకు పర్యాయపదం సావిత్రి బాయి పూలే అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. మహిళలపై తీవ్ర అణచివేత, వివక్ష కొనసాగుతున్న ఆ కాలంలోనే మహిళలకు విద్య కోసం, స్త్రీజాతి విముక్తి కోసం పోరాడి ధీరవనితగా సావిత్రిబాయి పూలే ఖ్యాతి గడించారని మంత్రి అన్నారు. అనాథ పిల్లలు, స్త్రీలకు శరణాలయాలు, ఆశ్రమాలు నెలకొల్పడంతో పాటు సాంఘిక దురాచారాల నిర్మూలనకు, సమాజ ఉద్ధరణకు తన జీవితాన్ని అర్పించిన త్యాగశీలిగా ఈ ప్రపంచం సావిత్రిబాయి పూలేని సదా గుండెల్లో పెట్టుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరపాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించడం పట్ల మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. స్త్రీవాదం పట్ల, మహిళల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు.



# చిత్రపురి సొసైటీ అక్రమాలపై వెంటనే సిబిఐ దర్యాప్తు

## సభ్యత్వాలు రద్దు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలి
## ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ హైదరాబాద్, ఖాజాగూడ చిత్ర పురి కాలనీ సొసైటీ అవినీతి కమిటీ సభ్యత్వాలు రద్దు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలి అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. తెలుగు సిని వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అక్రమాలు తెలుసుకొని శుక్రవారం చిత్ర పురి కాలనీని ఆప్ నేతలు సందర్శించారు. కమిటీ నేతలు అక్రమంగా అమ్ముకున్న భూములను, ప్లాట్‌లను డాక్టర్ దిడ్డి సుధాకర్ పరిశీలించి బాధితుల నుండి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సినీ కార్మికులు ఇళ్ళు, ప్లాట్‌లు కోసం విడతల వారి డబ్బు చెల్లించిన తర్వాత వారికీ కేటాయించక మరొకరికి అక్రమంగా అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. చిత్రపురి అవినీతి కమిటీకి సపోర్ట్ చేస్తున్న కో ఆపరేటివ్ అధికారులపై సస్పెండ్ చేసి, అఫిషల్ ఫైవ్ మెన్ కమిటీ కాకుండా అడ్‌హాక్ కమిటీని ప్రభుత్వమే నియమించాలని దీనితోపాటు చిత్రపురి సొసైటీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేసారు. అన్యాయానికి గురైన వందలాది సినీ కార్మికుల బాధితుల పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ అండగా ఉంటుందని, వారు చేస్తున్న పోరాటానికి మద్దతుగా జనవరి 6న హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తుందని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత మద్దినేని రమేష్, ఆప్ యువజన విభాగం అధ్యక్షులు విజయ్ ముల్లంగి, మహిళా విభాగం అధ్యక్షులు నర్సింగ్ యమునా గౌడ్, డాక్టర్ విభాగం అధ్యక్షులు లక్ష్య నాయుడు, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిశీల సామాజిక సంస్కర్త సావిత్రిబాయి



## భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాటి మనువాద సంప్రదాయాలలో భాగమైన కుల వివక్ష, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన ప్రగతిశీల సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద శుక్రవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ప్రేమ్ పావనితోపాటు భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఎఐటియూసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూ సఫ్, ఎఐటియూసి సీనియర్ నాయకులు యు.రత్నాకర్ రావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు పర్యాయపదంగా నిలుస్తుందన్నారు. సావిత్రిబాయి అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆమె ధైర్యం, సంకల్పం, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత ఆమెను భారతదేశంలో గౌరవనీయమైన వ్యక్తిగా మార్చాయని తెలిపారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే కేవలం ఉపాధ్యాయురాలు మాత్రమే కాదని, మహిళలు, అట్టడుగు వర్గాలను అభ్యున్నతికి విద్యను సాధనంగా ఉపయోగించుకున్న మహోన్నతురాలు అని గుర్తు చేశారు. నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ సాంప్రదాయ లింగ బేధాలను సవాలు చేసి, మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఎండి.యూసఫ్ మాట్లాడుతూ స్త్రీలకు విద్య వద్దన్న బ్రాహ్మణులకు కూడా విద్యను నేర్పిన గొప్ప వీర వనిత సావిత్రి పూలే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాళ్లు షహనా అంజూమ్, జె. శ్రీదేవి, ఏఐవైఎఫ్ నేతలు షేక్ మహమూద్, కే కళ్యాణ్, పి.అనిల్ కుమార్, హేమంత్ కుమార్, అరుణ్, పంజాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఎన్‌ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ్మాకు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఎన్‌ఎం పోస్టుల సంఖ్యను పెంచాలని తెలంగాణ రాష్ట్ర సెకండియర్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ్మాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సెకండియర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రతినిధుల బృందం మంత్రికి వినతి పత్రం అందజేశారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ) పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో వెల్లడించిన పోస్టులకు అదనంగా పోస్టులను పెంచడం ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో గత 18 ఏళ్లుగా పని చేస్తున్న 5 వేల రెండవ ఎఎన్‌ఎంలకు ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశం లభిస్తుందని తద్వారా వారకి న్యాయం జరుగుతుందని ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మా ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనరసింహ్మాకు వివరించారు. వయోపరిమితి వల్ల పరీక్షకు అర్హత లేని వారికి గతంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ప్రకారం వీరికి 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని, 10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్, 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, 10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ లను అమలు చేయాలని వారు కోరారు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందిస్తూ వీలైనన్ని ఎక్కువ పోస్టులను విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని అధికారులతో రిపోర్టు తెప్పించుకొని ఖాళీ పోస్టులన్నింటిని భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్‌ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షురాలు జే.పద్మ, ప్రధాన కార్యదర్శి శ్యామల, సహాయ కార్యదర్శి తన్వీర్ సుల్తానా, సువర్ణ, సుమిత్ర, భాగ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డ్ నూతన క్యాలెండర్‌ను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి పూర్తి సహకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థలో రైతు ఉత్పత్తి సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సహకార సంఘాలు 1904లో ఆవిర్భవించగా, అవి ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. అయితే ఈ మధ్యకాలంలో పలు మార్పులతో తీసుకొచ్చిన 'రైతు ఉత్పత్తి సంఘాల' (ఎఫ్‌పిఓ) ఏర్పాటుకు సహకార వ్యవస్థనే పునాది అని తెలిపారు. కొత్తగా ఏర్పడిన రైతు ఉత్పత్తి సంఘాల్లో కొన్ని అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని, ముఖ్యంగా ఒక లక్ష్యంతో ఏర్పడి ముందుకు సాగుతున్నాయని కితాబు ఇచ్చారు. రాష్ట్రంలో ఎఫ్.పి.ఓలందరికి తమ ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఎఫ్‌పిఓలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పని ముట్లను, యంత్రాలను చౌకధరకు అద్దెకు అందించడంతో విధంగా చూడాలని, అంతేకాక పప్పు ధాన్యాలను, నూనె గింజల సాగులో మార్కెటింగ్, వాటి ప్రాసెసింగ్‌లో ఎఫ్‌పిఓలు ప్రధానపాత్ర పోషించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి, పిజెటిఎయు వైస్ చాన్సలర్ ఎ.జానయ్య, వ్యవసాయశాఖ సంచాలకులు బి.గోపి, ఐసిఎఆర్, ఐఐఓఆర్ డైరెక్టర్ డా.ఆర్.కే.మథూర్, ఎటిఎఆర్ఐ డైరెక్టర్ డా.షేక్ ఎన్ మీరా, ఎన్‌సిడిసి రీజనల్ డైరెక్టర్ శార్దుల్ జాదవ్, ఎఫ్‌పి ఓ ఫెడరేషన్ ఛైర్మన్ జైపాల్ రెడ్డి, డైరెక్టర్ సాయ రెడ్డి, బికెఎస్ సెక్రటరీ మోహిని మోహన్ మిశ్రా, రిటైర్డ్ సైంటిస్టు ప్రసాద్, ఐఎఫ్‌ఛైర్మన్, సిఇఓ దోర బాబు, తదితరులు పాల్గొన్నారు.




# హోంశాఖ ముఖ్య కార్యదర్శితో టిజిఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజ్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డిసి) చైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజు శుక్రవారం రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తాతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. సినిమా పరిశ్రమలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై చర్చించారు. థియేటర్ల లైసెన్స్ గడువు సులభంగా ఉండాలనే అంశంపై వారి మధ్య చర్చ జరిగింది. దిల్ రాజుతో పాటు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, పలువురు ఎగ్జిబిటర్లు హాజరయ్యారు.

# ఘనంగా టిజిఎస్‌పి 'దీక్షాంత్ పరేడ్'

## టిజిఎస్‌పిలో బాక్సింగ్, క్రికెట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటు
## మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, రైల్వే పోలీసు విభాగాలలో వీరి సేవలు ఉపయోగించుకుంటాం
## 'దీక్షాంత్ పరేడ్'లో డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగం (టిజిఎస్‌పి)లో ఉత్తమ స్థాయిలో బాక్సింగ్,క్రికెట్ కేంద్రాలను నెలకొల్పాలని యోచిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా టిజిఎస్‌పి బెటాలియన్లలో శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ దీక్షాంత్ పరేడ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మొత్తం 4077 కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. హైదరాబాద్ యూసఫ్ గూడలో ఉన్న టిజిఎస్‌పి మొదటి బెటాలియన్‌లో జరిగిన దీక్షాంత్ పరేడ్‌లో డిజిపి డాక్టర్ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ క్రీడలలో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని చాటి చెప్పిన బాక్సర్ నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ క్రికెటర్లు ప్రస్తుతం టిజిఎస్‌పి డిఎస్‌పిలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. వారి ఆధ్వర్యంలో నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు టిజిఎస్‌పి విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు డిజిపి తెలిపారు. తద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాల్సి ఉందన్నారు. టిజిఎస్‌పి సిబ్బందికి శాంతి భద్రతల పరిరక్షణలోనూ, ఇతర రాష్ట్రాలకు వెళ్లి సేవలు చేసినందున వారికి ఎంతో పేరు ఉందని అన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న టిజిఎస్‌పి సిబ్బందిని మాదకద్రవ్యాలను అరికట్టేందుకు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు కూడా వినియోగిస్తామన్నారు. అదేవిధంగా రైల్వే పోలీసు, సిఐడి విభాగాలలోను వీరి సేవలు ఉపయోగించుకుంటామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4077 మంది టిజిఎస్‌పి కానిస్టేబుల్‌లకు శిక్షణ ఇచ్చామని, యూసఫ్‌గూడ బెటాలియన్‌లో 548 మందికి శిక్షణ పూర్తయిందని తెలియజేశారు. భారీ స్థాయిలో టిజిఎస్‌పి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈరోజు నుంచి పోలీస్ విభాగంలో చేరుతున్న సిబ్బంది వారి తల్లిదండ్రులు గర్వపడేలా, రాష్ట్ర పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేయాలని డిజిపి సూచించారు. భారీ స్థాయిలో శిక్షణ ఇచ్చిన అధికారులను సిబ్బందిని డిజిపి అభినందించారు. టిజిఎస్‌పి అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.... క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పని చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న 4077 కానిస్టేబుళ్లలో 2746 గ్రాడ్యుయేట్స్ , 596 పోస్ట్ గ్రాడ్యుయేట్స్ 62 మంది ఎక్స్ సర్వీస్ మెన్లు ఉన్నారని తెలిపారు. కమాండెంట్ మురళి కృష్ణ, మహిళా బాక్సర్ నికత్ జరీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బెటాలియన్‌లో బాక్సింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తానని డిజిపి చెప్పడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా పోలీసు కానిస్టేబుళ్లకు బాక్సింగ్ నేర్పిస్తానని డిఎస్‌పి నిఖత్ జరీన్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తాను డిఎస్‌పిగా పోలీసు డ్రెస్ వేసుకుని దీక్షాంత్ పరేడ్‌కు హాజరు కావడం తొలిసారని, ఈ అనుభూతి జీవితంలో మరచిపోలేనని చెప్పారు. పోలీసు శాఖలో ఉన్నతాధికారులు తనకు ఇచ్చిన బాధ్యతలను చక్కగా నిర్వహిస్తానని చెప్పారు.



**బెటాలియన్లలో పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీజీఎస్పీ బెటాలియన్లలో శుక్రవారం పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాలు జరిగాయి. టీఎస్పీ మూడవ బెటాలియన్‌లో ఇంటెలిజెన్స్ డిజిపి బి.శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, నాలుగో బెటాలియన్‌లో ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి ఏడవ బెటాలియన్‌లో నిజామాబాద్ ఇన్చార్జి సిపి సిహెచ్ సింధు శర్మ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, పదవ బెటాలియన్‌లో ఐజిపి వి. సత్యనారాయణ, 12వ బెటాలియన్‌లో ఐజిపి ఎం.రమేష్ 13వ బెటాలియన్‌లో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ 15 బెటాలియన్‌లో ఖమ్మం సిపి సునీల్‌దత్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# ఐఐటిలు ఆవిష్కరణలకు కేంద్రాలు

## ఐఐటిలు కేవలం విద్యా సంస్థలు కాదు .. దేశ నిర్మాణ కేంద్రాలు
## అద్భుతమైన ఆవిష్కరణలకు వేదిక ఐఐటి హైదరాబాద్
## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ఐఐటి హైదరాబాద్ (కంది)లో ఆస్ట్రేలియా ఇండియా క్రిటికల్ మినరల్స్ వర్క్ షాప్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. ఈయన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఐటి హైదరాబాద్ అద్భుతమైన ఆవిష్కరణలకు చిరునామాగా మారిందన్నారు. ఐఐటి హైదరాబాద్ విద్యార్థుల దేశ భవిష్యత్ కలల కర్మాగారం అన్నారు. ఐఐటిలు కేవలం విద్యాసంస్థలు మాత్రమే కాదు, దేశ నిర్మాణానిక వేదికలు అని ఐఐటి హైదరాబాద్‌లో ఇప్ప టి వరకు 11,500 పరిశోధన ప్రచురణలు ,320 పైగా ఏజెంట్లు, స్టార్టప్‌ల ద్వారా 1500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం గొప్ప విషయమన్నారు. ఆస్ట్రేలియా ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ కింద మోనాశ్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు కేవలం తెలంగాణకే కాదు భారతదేశానికి కాదు ప్రపంచానికి అన్నారు. ప్రపంచానికి కీలకంగా మారనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించడంలో ఈ వర్క్ షాప్ సహకార స్ఫూర్తికి అద్దం పడుతుందన్నారు. భారతదేశంలో ఐఐటిలకు ఆద్యుడు మన దేశ మొట్టమొదటి




ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని అన్నారు. ఐఐటిలను ఆధునిక భారత దేశ దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించినట్లు తెలిపారు. భారతదేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పేదరికం ,అసమాన తలపై పోరాడడానికి అవసరమైన సాధనాలుగా ఐఐటిలు నెహ్రూ పేర్కొన్నారన్నారు. ఐఐటి హైదరాబాద్ ఏర్పాటులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత కాంగ్రెస్ నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. వారి నాయకత్వంలో ఐఐటి హైదరాబాద్‌కు పునాదులు పడ్డాయన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక గొప్ప రాజకీయ నాయకుడితో పాటు గొప్ప సంఘసంస్కర్త అన్నారు. రాష్ట్రంలో విద్య వైద్య సౌకర్యాల మెరుగు కోసం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపడం కోసం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఐఐటి హైదరాబాద్ ఏర్పాటు చేసే సమయంలో ఎమ్మెల్సీగా నేను భాగస్వామిని కావడం ఆదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో క్లిష్టమైన ఖనిజాలను వెలికి తీసేందుకు సమర్థవంతమైన మార్గలు కొనుగొనడం స్థిరమైన మైనింగ్ పద్ధతులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకోసమే తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పరిశోధన వాటి సంబంధిత సైన్స్ ఆధార కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. క్లిష్టమైన ఖనిజాలు ,పారిశ్రామిక ముడి పదార్థాలు మాత్రమే కాదు అని అవి, హరిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉపయోగపడతాయన్నారు. సోలార్ పవర్ ప్యానెల్స్ విండ్ టర్బైన్లు ప్రతి ఎలక్ట్రిక్ వాహనం, విద్యుత్ నిల్వ బ్యాటరీలు వంటివి క్లిష్టమైన ఖనిజాల ద్వారానే తయారవుతాయన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీని భవిష్యత్తు ఇంధనంగా ప్రభుత్వాలు భావిస్తున్నట్లు తెలిపారు. ఆవిష్కరణల పోత్సాహానికి సుస్థిరతకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. ఐఐటిల ఆలోచనలు పరిశ్రమలను పునర్ నిర్వహణ చేస్తాయన్నారు. ఆర్థిక వ్యవస్థలను పునిర్మిస్తాయన్నారు. గ్రీన్ ఎనర్జీ స్థిరమైన టెక్నాలజీ, శాస్త్రీయ ఆవిష్కరణలలో దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్, బి.ఎస్. మూర్తి డైరెక్టర్ ఐఐటి హైదరాబాద్, అతిథి ఎమ్ఎస్ హిల్లరీ మెక్ గేచీ కాన్సూల్ జనరల్ ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ బెంగళూరు, ఎం.గోపాల్ బాగ్దే భారతదేశ హైకమిషనర్ ఆస్ట్రేలియా (ఆన్‌లైన్) దినేష్, మహూర్ జాయింట్ సెక్రటరీ గనుల మంత్రిత్వ శాఖ బలరాం నాయక్ సింగరేణి కాలరీస్ సిఎండి, ప్రొఫెసర్ మోహన్, యెల్లిశెట్టి మోనా షీ ,విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, నరసింహ మం గదొడ్డి ఐఐటి హైదరాబాద్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
శనివారం, జనవరి 04

# మణిపూర్‌పై చొరవ ఏదీ?

జాతుల అంతఃకలహాలతో ఏడాదిన్నరగా అల్లకల్లోలంగా ఉన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో శాంతిసాధనకు, స్థాపనకు కొత్త సంవత్సరంలోనైనా కేంద్రప్రభుత్వం ఏదైనా చొరవ కనబరుస్తుందా? ఆ సూచన కనిపించటం లేదు. అసలు అక్కడి సమస్యలో తమ ప్రత్యక్ష జోక్యం అవసరమని కేంద్రప్రభుత్వం గుర్తించినట్లే తోచదు. హోంమంత్రి సంవత్సరంలో ఇదిగో – ఇన్నిసార్లు ఈశాన్య రాష్ట్రాలు సందర్శించారన్న గణాంకాల ప్రకటన తప్ప కల్లోలిత మణిపూర్‌లో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు ఏమి చేశారో వివరణ లేదు. 2024లో ఈశాన్యంలో క్రైమ్ ఘటనల్లో 77శాతం మణిపూర్‌లో జరిగాయని గణాంకాలు తెలుపుతున్నాయి. మణిపూర్ భౌగోళిక స్థితితో ఈ సమస్య ముడిపడి ఉంది. లోయ లేదా మైదాన ప్రాంతంలో మీతి జాతీయులు అత్యధిక మెజారిటీ. షెడ్యూల్డు ఆదివాసీ నివాసిత కొండ ప్రాంతాల్లో కుకీ తదితర ఆదివాసీ జాతీయులు మెజారిటీ. ముఖ్యమంత్రి బైరాన్‌సింగ్ సహా శాసనసభలో, మంత్రివర్గంలో మీతీలు మెజారిటీ. షెడ్యూల్డు ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసే హక్కు ఆదివాసీయేతరులకు లేదు. ఇది షెడ్యూల్డు ప్రాంతాల్లో దేశమంతటా అమలులో ఉన్న చట్టమే. అయితే తమను షెడ్యూల్డు తెగగా గుర్తించాలని మీతీలు చేసిన విన్నపాన్ని హైకోర్టు మన్నించటంతో తమ భూములకు ఎసరుపెడుతున్నారన్న అనుమానం కుకీల్లో తలెత్తింది. అసలే అది సాయుధ తిరుగుబాట్లకు నిలయమైన రాష్ట్రం. ప్రజాస్వామిక అశాంతిపై రాజ్యహింసతో మానభంగాలు, హత్యలు, గృహదహనాలు మొదలైనాయి. ఈ సున్నితమైన సమస్య పై రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి, కోర్టు తీర్పును అమలు జరపబోమని ప్రకటించి ఉంటే జాతుల మధ్య వైరాన్ని మొగ్గలోనే అణచివేసే అవకాశం ఉండేది. రాష్ట్రప్రభుత్వ మీనమేషాలు లెక్కిస్తూ ఆందోళనను అణచివేసేందుకు ప్రయత్నించటం, ముఖ్యమంత్రి కూడా మీతీ జాతీయుడు కావడం అగ్నికి ఆజ్యంపోసినట్లయింది. ఇంత జరుగుతు న్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనముని గా ఉండటం, ఆ రాష్ట్రాన్ని సందర్శించి బాధిత ప్రజలకు సాంత్వన కలిగించే మాటలు చెప్పిఉంటే, తదనుగుణంగా చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి నేడున్నంత తీవ్రరూపం దాల్చి ఉండకపోను. తమ పార్టీ స్వార్థం రీత్యా అసెంబ్లీని రద్దు చేయకపోయినా సస్పెన్షన్‌లో ఉంచి పరిపాలనను కేంద్రం తమ చేతిలోకి తీసుకుని ఉండాల్సింది. సమస్యను కేవలం శాంతి–భద్రతల కోణం నుంచి చూశారేగాని జాతుల మధ్య వైరాన్ని అర్థం చేసుకోలేదు. ప్రధానమంత్రి మణిపూర్ సందర్శించాలని ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేసినా మోదీ ఈ రోజుకూ ఖాతరు చేయకపోవటం విచారకరం. తమ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడుకోవటానికి ప్రాధాన్యత ఇవ్వటం సిగ్గుచేటు.

> “ నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమం త్రి బైరాన్‌సింగ్ రాష్ట్ర ప్రజలకు సందేశంలో తమ ప్రభుత్వం వైపునుండి కొన్ని తప్పులు దొర్లాయని, అందుకు ప్రజలు క్షమించాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరంన్నరగా నిమ్మకు నీరెత్తినట్లున్న ముఖ్యమంత్రి ఇప్పుడు క్షమాపణ కోరితే ప్రజలు శాంతిస్తారా? ముఖ్యమంత్రి క్షమాపణ కోరటంతోపాటు రాజీనామా ప్రకటించి ఉంటే సబబుగా,సమయోచితంగా ఉండేది. ”

నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి బైరాన్‌సింగ్ రాష్ట్ర ప్రజలకు సందేశంలో తమ ప్రభుత్వంవైపునుండి కొన్ని తప్పులు దొర్లాయని, అందుకు ప్రజలు క్షమించాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరంన్నరగా నిమ్మకు నీరెత్తినట్లున్న ముఖ్యమంత్రి ఇప్పుడు క్షమాపణ కోరితే ప్రజలు శాంతిస్తారా? ముఖ్యమంత్రి క్షమాపణ కోరటంతోపాటు రాజీనామా ప్రకటించి ఉంటే సబబుగా, సమయోచితంగా ఉండేది. కుకీలు తమ ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి బోర్డు కోరుతున్నారంటే మీతీలతో పరస్పరం కలిసి ఉండలేనంతగా విద్వేషాలు పెరిగినట్లు అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మంత్రివర్గం రాజీనామా చేయాలి. వివిధ జాతుల మధ్య చర్చలకు అనువైన వాతావరణం సృష్టించాలి. అన్ని తెగలకు, వారి ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి సముచితమైన, విస్తృత ఆమోదయోగ్యత ప్రాతిపదికగా స్థూల ఏకాభిప్రాయ పరిష్కారాన్ని ఓర్పుగా, నేర్పుగా సాధించాలి. ప్రశాంత వాతావరణం ఏర్పడిన తదుపరి శాసనసభకు ఎన్నికలు జరపాలి. అంతేగాని ప్రస్తుత శాసనసభను పునరుద్ధరించే ప్రయత్నం చేయకూడదు. ఓట్లు–సీట్లు కన్నా ప్రజల్లో అశాంతిని చల్లబరిచి సామరస్యం సాధించటం ప్రధానం.

# డల్లేవాల్ మరణాన్ని మోదీ కోరుకుంటున్నాడా?

**అరుణ్ శ్రీవాస్తవ**

‘ఖానౌరీ సరిహద్దుకు భారీ సంఖ్యలో చేరుకుని, కేంద్రం దురహంకారానికి వ్యతిరేకంగా ప్రస్తుతం జరుగుతున్న సత్యాగ్రహాన్ని కాపాడండి’ అని పంజాబ్ యువతకు రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ ఇచ్చిన పిలుపు బిజెపి నాయకత్వం దగాకోరుతనాన్ని బట్టబయలు చేసింది. 70 ఏళ్ల డల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఐదువారాలకు పైగా ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారు. ‘‘నేను రైతు బిడ్డను. నేను బలహీనతను ప్రదర్శించను. నా దేశం కోసం నా ప్రాణాన్ని త్యాగం చేస్తాను. ఒక రైతు కొడుకు ఇక్కడ ఎందుకు కూర్చున్నాడు?’’ అని రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌కడ్ చేసిన వ్యాఖ్యలపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ముఖంలోకి సూటిగా చూసి రైతుల డిమాండ్‌లను అంగీకరించాలని చెప్పే నైతిక సంకల్పం, బలం ఈ రైతు బిడ్డలో లేదన్నది వేరే విషయం. మోదీ ఉద్దేశ్యాలను ఆందోళన చేస్తున్న రైతులు విశ్వసించేలా చేయడమే ధన్‌ఖడ్ డిసెంబర్ 13 ప్రకటన ప్రధాన లక్ష్యం. కానీ యువతకు డల్లేవాల్ నుంచి వచ్చిన ఏక వాక్య విజ్ఞప్తి మోదీ ద్వంద్వవైఖరిని బట్టబయలు చేసింది.

రైతుల ఉద్యమంపై మోదీ, ఆయన మంత్రులు గందరగోళం సృష్టించడం చిరాకు కలుగచేస్తున్నది. ఇది పంజాబ్ కేంద్రంగా సాగుతున్న ఆందోళన అని, సిక్కు రైతులు మాత్రమే దీనికి నాయకత్వం వహిస్తున్నారని మోదీ మంత్రులు చెబుతున్నారు. ఈ కథనం ‘సిక్కులు తనకు వ్యతిరేకమని మోదీ భావిస్తున్నారా? ఆయన ఈ అభిప్రాయాన్ని కలిగి ఉన్నట్లయితే, ఆయన అందుకు కారణం కూడా తెలుసుకోవాలి. వాస్తవాలను ప్రధాని ఎందుకు ప్రజల్లోకి తీసుకెళ్లరు? దానికి బదులుగా వాస్తవాన్ని దాచిపెట్టి, ఒక వక్రీకరించిన కథనాన్ని ఎందుకు చూపిస్తున్నారనే’ ప్రశ్నను లేవనెత్తింది. సుదూర రాష్ట్రాల రైతులు పాల్గొనడం లేదని కాదు, వారి భాగస్వామ్యం తక్కువ. పంజాబ్, హర్యానాలు ఢిల్లీకి పొరుగునే ఉన్నందున, తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్ రైతులతో పోలిస్తే ఈ రెండు రాష్ట్రాల రైతులు త్వరగా ఢిల్లీకి వెళ్లడం సులభం. రైతుల డిమాండ్లను అంగీకరించేందుకు నిరాకరిస్తున్న ప్రభుత్వాన్ని సమర్థించేందుకు కొందరు మోదీ మద్దతుదారులు ఆశ్చర్యకరమైన వివరణతో ముందుకు తీసుకువస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు అదానీ, ఇతర జాతీయవాద కార్పొరేట్ సంస్థలను రైతులు అనుమతించడం లేదని, రెండేళ్ల క్రితమే ప్రధాని నరేంద్ర మోదీ కందులు దిగుమతిని నిషేధించారని వారు చిత్రంగా వాదిస్తున్నారు.

కానీ వ్యాపార ప్రయోజనాల కారణంగా విదేశాల్లో నివసిస్తున్న పంజాబీ సిక్కులు, కాంగ్రెస్ నాయకుడు అమరీందర్ సింగ్, కమల్ నాథ్ వంటి వారు మోదీ చర్యను వ్యతిరేకించారు. ‘ఖలిస్తానీలు తమ ఉద్యోగాలను కోల్పోవడం మొదలైంది. అందుకే జస్టిన్ ట్రూడో రైతుల ఉద్యమానికి మద్దతు ఇచ్చాడు’ అంటూ అత్యంత తలతిక్క చేశారు. ‘అదానీ, అంబానీ గ్రూపులు విదేశీ గుత్తాధిపత్యాన్ని అంతం చేయడం ద్వారా, భారతీయ వినియోగదారులకు విపరీతమైన ప్రయోజనాలను అందించడం ద్వారా, అవి ప్రారంభించిన అన్ని వ్యాపారాలలో లాభాలను ఆర్జించాయి’ అని కూడా వారు వాదించారు. బిజెపి మద్దతుదారులు రైతుల డిమాండ్లపై గందరగోళం సృష్టిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఢిల్లీలో ప్రదర్శనకు రాకుండా రైతులను భద్రతా దళాలు అడ్డుకున్న తరువాత ఫిబ్రవరి 13 నుండి డల్లేవాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర),కిసాన్ మజ్దూర్ మోర్చా కార్యకర్తలు పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు ప్రాంతాల వద్ద శిబిరాలు వేసుకొని ఉన్నారు. కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి)ప్రభుత్వం చట్టబద్ధంగా హామీ ఇవ్వాలన్నది వారి డిమాండ్. ఇది రైతుల హక్కులు, అభ్యున్నతి కోసం జరుగుతున్న పోరాటం, అయితే ఈ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయాలని భావిస్తోంది. రైతులు కూడా భారతదేశంలో భాగమే, మా ప్రజాస్వామ్య హక్కులు నెరవేర్చబడకపోతే మేము మా జీవితాలను త్యాగం చేయాలనుకుంటున్నామని డల్లేవాల్ చెప్పారు.

ఇవి 2020–21లో ఏడాదిపాటు ఆందోళన చేపట్టిన రైతుల పాత డిమాండ్లు. సెప్టెంబరు 2020లో పార్లమెంట్ ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వారు నిరసన తెలిపారు. ఈ చట్టాలను రైతు సంఘాలు ‘రైతు వ్యతిరేక చట్టాలు’గా అభివర్ణించాయి. కార్పొరేట్ సంస్థలు వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించకుండా ఉండేందుకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) బిల్లును రూపొందించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయ చట్టాలపై రైతులను ఒప్పించడంలో ప్రభుత్వం విఫలమైన తరువాత ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాకే రైతులు తమ ఆందోళనను విరమించుకున్నారు. ‘నిజమైన ,స్వచ్ఛమైన హృదయంతో నేను దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను... మేము రైతులను ఒప్పించలేకపోయాము. మా ప్రయత్నాల్లో కొంత లోపం ఉండి, కొంతమంది రైతులను ఒప్పించలేకపోయాం’ అని మోదీ అన్నారు. డల్లేవాల్ ఆరోగ్యం నిరంతరం క్షీణిస్తున్నప్పటికీ, శరీర నిర్మాణ సంబంధమైన, శారీరక పారామితులన్నీ క్షీణిస్తున్నప్పటికీ, ప్రధాన మంత్రి చలించకుండా, ఆయనతో మాట్లాడటానికి ఇష్టపడకపోవడాన్ని బట్టి ఆందోళన పట్ల మోదీ చలించని వైఖరిని మనం అర్థం చేసుకోవచ్చు.

డల్లేవాల్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన శరీరంలో కీటోన్ స్థాయి సాధారణం కంటే 25రెట్లు ఎక్కువగా ఉందని, అతను దాదాపు 15కిలోల బరువు కోల్పోయాడని, ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ లేదా బహుళ అవయవ వైఫల్యానికి గురయ్యే అవకాశాన్ని తోసిపుచ్చలేమని చెప్పారు. ఆయనకు గతంలో నిర్ధారించబడిన ప్రోస్టేట్ క్యాన్సర్ కోసం మళ్ళీ నిర్వహించిన పిఎస్ఎ పరీక్ష రిపోర్ట్‌లు అసాధారణంగా ఉన్నాయి. డల్లేవాల్ నిరాహారదీక్ష పట్ల ప్రధాని మోదీ పట్టింపులేని వైఖరి, డల్లేవాల్ జీవించి ఉన్నాడా లేదా చనిపోయాడా అనే ఆందోళన మోదీకి లేదన్న వాస్తవాన్ని నొక్కి చెబుతోంది. డల్లేవాల్ డిమాండ్లు చాలా సామాన్యమైనవి : రుణమాఫీ, పింఛన్లు, విద్యుత్ ఛార్జీల పెంపు నిలుపుదల, ఎంఎస్‌పికి లీగల్ హామీలే కాకుండా ఆందోళన చేస్తున్న రైతులపై పెట్టిన పోలీసు కేసుల ఉపసంహరణ. వాస్తవానికి, ఇందులో లఖీంపూర్ ఖేరీలో 2021లో నాటి బిజెపి కేంద్ర మంత్రి అజయ్ ‘తేని’ మిశ్రాకు చెందిన కారు చక్రాల కింద నలిగిన రైతులు, బాధితులకు ‘న్యాయం’ అనే అంశం కూడా ఉంది. ఈ విషయం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది.

డల్లేవాల్‌తో చర్చలు జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఆదేశించే బదులు, నిరసన స్థలం చుట్టూ దుర్భేధ్యమైన ఏర్పాటును పంజాబ్ ప్రభుత్వం ఎందుకు అనుమతించిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. డల్లేవాల్ మరణానికి దారితీసే విధంగా ఉన్న రైతుల ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఏదైనా రాజీ మార్గాన్ని చూపిస్తే డల్లేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చేందుకు రైతులు అంగీకరించవచ్చని పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ చెప్పిన తర్వాత కూడా కోర్టు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.పంజాబ్ ప్రభుత్వాన్ని నిలదీసే బదులు కోర్టు మోదీని ఒక పరిష్కారం కనుగొనవలసిందిగా కోరాల్సింది. పంజాబ్ ప్రభుత్వం బలవంతంగా ఆయనను తీసుకువెళుతుందనే భయంతో రైతులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.డల్లేవాల్‌కు కాపు కాస్తున్నారు. డల్లేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చకుండా అడ్డుకునే వారు రైతు సమాజానికి ఒక గొప్ప నాయకుడిని లేకుండా చేయాలనుకుంటున్నారని నిరసన స్థలంలో ప్రజలకు తెలియజేయాలని కోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇది అసంబద్ధమైంది. ఒకవేళ కోర్టు నిజంగా ఆందోళన చెందితే, తగిన చర్యలు తీసుకోవాలని మోదీ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.



డల్లేవాల్ నిరాహార దీక్ష శిబిరం వద్ద రైతుల రక్షణ కవచం

అన్ని పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీని అమలు చేయాలని, ఎం.ఎస్.స్వామినాథన్ ఫార్ములా ప్రాతిపదికగా ఎంఎస్‌పిని లెక్కించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. స్వామినాథన్ కమిటీ ఫార్ములా ప్రకారం అన్ని ఖర్చులకు 50 శాతం లాభం కలిపి అన్ని పంటలను ఎంఎస్‌పి నిర్ణయించాలి. రైతులు ఆందోళన విరమణ సందర్భంలో ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీని మోదీ హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల ప్రచారంలో కూడా అన్ని పంటలను ఎంఎస్‌పికి ప్రభుత్వం కొంటుందని ప్రధాని చెప్పారు. ఇప్పుడెందుకు వెనకడుగువేసి రైతుల్ని దగా చేస్తున్నారు?

(ఐపిఎ సర్వీస్)

# అమిత్ షా ఎందుకీ అవహేళన?



మన్నారం నాగరాజు
95508 44433

అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్.. అనడం ఇప్పుడు ఫ్యాషన్ అయిపోయింది. అలా పదేపదే అంబేద్కర్ పేరు స్మరించే బదులు ఏ దేవుడిని స్మరించుకున్నా ఏడు జన్మల దాకా స్వర్గప్రాప్తి లభించేది అంటూ కేంద్ర హోంశాఖ మంత్రి, బిజెపి అగ్రనేత అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. ఈ ప్రకటన అంబేద్కర్‌ను అవమానించేలా ఉంది. అంబేద్కర్‌ను జీవితాంతం అవమానించి, ఆయన సిద్ధాంతాలను పక్కనబెట్టి, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు భారతరత్న ఇవ్వకుండా, రిజర్వేషన్ సూత్రాలను తుంగలో తొక్కినవారే నేడు ఆయన పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని అమిత్ షా తిరిగి ఆరోపించారు. మరోవైపు, అంబేద్కర్ గౌరవార్థం ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో తన మంత్రిని డిఫెండ్ చేసుకున్నారు. అయితే, వివాదం ఇంతటితో ముగియలేదు. అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. బాబా సాహెబ్‌ను, రాజ్యాంగాన్ని అవమానించారని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించకూడదని వారి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం తెలియజేస్తోందని ఖర్గే ఆరోపించారు. అదే సమయంలో అంబేద్కర్ పేరుతో కాంగ్రెస్, బిజెపిలు రాజకీయం చేస్తున్నాయని బిఎస్‌పి అధినేత్రి మాయావతి విమర్శించారు. దోపిడీ నుంచి విముక్తి కల్పించే వ్యక్తి దేవుడైతే.. కుల ఆధారిత భారతీయ సమాజంలోని కోట్లాదిమంది ప్రజల దేవుడు అంబేద్కర్. ఆయన శతాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా వివక్షకు గురైన షెడ్యూల్డ్ వెనుకబడిన వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా సమానత్వ హక్కును కల్పించారు. అందుకే అమిత్ షా ప్రకటన అంబేద్కర్‌ను అవమానించేలా ఉందని బాబాసాహెబ్ భావజాలం, దళిత రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులు భావిస్తున్నారు. ఇది అక్షర సత్యం.

అయితే ప్రస్తుతం అంబేద్కర్ విషయంలో అన్ని రాజకీయ పార్టీల మధ్య పోటీ ఉంది. అంబేద్కర్ ఆలోచనలను అమలు చేయకుండా, రాజకీయ పార్టీలు ఆయన గుర్తింపును ఉపయోగించుకుని దళిత ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నయ్. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన ప్రకటనతో బిజెపి డిఫెన్స్‌లో పడింది. దళిత, వెనుకబడిన వర్గాల ఓటర్లను ఆకర్షించడానికి గత కొన్నేళ్లుగా బిజెపి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి చాలా కారణాలున్నాయి. భారతీయ జనతా పార్టీ అంటే బ్రాహ్మణులు, బనియాల పార్టీ అని చెప్పేవారు. కానీ, దశాబ్ద కాలంగా బిజెపి ఈ గుర్తింపును దాటి హిందూ సమాజంలోని ఇతర కులాలకు కూడా వెళ్లడంలో విజయం సాధించింది. కుల రాజకీయాల ఆధిపత్యం లేకుండా, హిందూ గుర్తింపు రాజకీయాలు బలపడాలని బిజెపి ప్రయత్నించింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానంగా మహారాష్ట్రలోని అగ్రవర్ణాల సంస్థ, ముఖ్యంగా బ్రాహ్మణులది. అందుకే మొదట్లో షెడ్యూల్డ్ కులాలు దీనికి ఆకర్షితులు కాలేదు. ఆర్‌ఎస్‌ఎస్‌లో బ్రాహ్మణవాదంపై విమర్శలకు ఆస్కారం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం సమానత్వం కాదు, సామరస్యం. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలనుకుంటే హిందూ ఓటర్లలో ఐక్యతను సృష్టించాలి. అయితే దళిత, ఒబిసి వర్గాల ఓట్లను పొందకుండా అది సాధ్యం కాదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. బిజెపి ఆవిర్భావానికి ముందు నుంచే ఆర్‌ఎస్‌ఎస్ దీనికోసం ప్రయత్నాలు చేసింది. 1974లో బాలాసాహెబ్ దేవరస్ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌గా ఉన్నప్పుడు ఆ సంస్థ తన వైఖరిని మార్చుకుంది. అంబేద్కర్, పెరియార్, మహాత్మా పూలే పేర్లను ఉదయం ప్రార్థనల్లో చేర్చింది. అంతేకాకుండా దళితులు, గిరిజనులను తనవైపు ఆకర్షించే కార్యక్రమాలను ప్రారంభించింది. సమానత్వం, సామరస్యం రెండు వేర్వేరు విషయాలు. బిజెపి సామరస్యం గురించి మాట్లాడుతుంది కాని, సమానత్వం గురించి కాదు. సమానత్వం అనేది అంబేద్కర్ ప్రాథమిక ఆలోచన. అయితే, ఓటు రాజకీయాలకు అనేక మార్గాలున్నాయి. అమిత్ షా వ్యాఖ్యలతో పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆయనకు అనిపించినదే చెప్పారు. భీమా కోరేగావ్ సంఘటన తర్వాత మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అంబేద్కరిస్టులను అణచివేసింది. బిజెపి అంబేద్కర్ ఇమేజ్‌ను మాత్రమే ప్రచారం చేసింది, ఆయన భావజాలాన్ని కాదు. ఈ విషయం గమనంలో ఉంచుకోవాలి.

డాక్టర్ అంబేద్కర్ శూద్రులపైన, అస్పృశ్యతపైనా, కుల వ్యవస్థపైనా కొన్ని గ్రంథాలు రాశారు. అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రచించిన మేధావి, అధ్యయనశీలి, ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రచయిత బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన పట్లా కేంద్ర హోంశాఖ మంత్రి, బిజెపి అగ్రనేతకి అంత అక్కసు ఎందుకు? దేశ ప్రజల మనోభావాలు ఎంతగా దెబ్బతింటున్నాయో పట్టించుకోరా? అధికార బలం ఉందికదా అని తప్పుడు మాటలు మాట్లాడినా, బహుజన వర్గాలు ఊరుకుంటారా? బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు ఆచితూచి మాట్లాడలేరా... ఇంత అహంకారం ఎందుకో అని ప్రజలు విమర్శిస్తున్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వం, మరియు మానవ హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసుధారకుడు. ఆయన కృషి వల్లే సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం దక్కింది. రకరకాల విజన్లను తెరమీదకు తీసుకువస్తున్న పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అంబేద్కర్ విజన్ ను రూపొందించాలి. నిర్ణీత కాలవ్యవధిలో ఆయన ఆకాంక్షించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రణాళికను ప్రకటించి అమలు చేయాలి.

# బ్రెయిలీ లిపి అంధులకు వరం



జనవరి 4, లూయీ బ్రెయిలీ జన్మదినం

ఎంతోమంది అపారమైన ప్రజ్ఞావంతులు ఈ భువిపై స్వల్పకాలం జీవించి, తమ అనన్య సామాన్యమైన ప్రతిభతో ప్రపంచానికి వివిధ రూపాల్లో సేవలందించి, మరణించి, శతాబ్దాలు గడిచినా ప్రజల హృదయాల్లో సజీవులుగా కొలువై ఉన్నా రు. జనంకోసం జీవించి, జనంకోసం తపించి, అలుపెరుగని శ్రమతో తమ జీవితాలను ఇతరుల శ్రేయ స్సు కోసం వెచ్చించిన మహనీయులను జ్ఞప్తియందుంచుకోవడం మన కనీస ధర్మం. గణితం కోసమే జీవితమన్నట్టు బ్రతికి, గణిత ప్రపంచాన్ని శాసించిన శ్రీనివాస రామానుజన్ గణితాన్ని శ్వాసిస్తూ ఆస్వాదిస్తూ అంతిమ శ్వాస వదిలాడు. అలాగే అంధు లకోసం శ్రమించి, అంధత్వంలోనే వెలుగు రేఖలు పూయించి, సమాజం చేత నిర్లక్ష్యం చేయబడుతున్న అంధులకు ప్రత్యేక లిపి కనిపెట్టి, వారిని జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది, వారి ఆలోచనలను, వారి జ్ఞానాన్ని ప్రపంచానికి వినియోగపడేటట్టు చేసిన ‘లూయీ బ్రెయిలీ’ అంధుల పాలిట ఆరాధ్యదైవం. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కంటిచూపుకు నోచుకోకపోతే, మన ముందు ఎన్ని అద్భుతాలు జరుగుతున్నా, వినడమే తప్ప వీక్షించడం జరగదు. మనసు తో వీక్షించి, మస్తిష్కానికి పదునుపెట్టి, రాజ్యాలను ఏలిన రాజుల గురించి పురాణకాలం నుంచి కథలుగా వింటున్నాం. కలలో సైతం సాధ్యంకాని అద్భుతాలను ఇలలో సుసాధ్యం చేసిన ప్రజ్ఞావంతుల జాబితాలో లూయీ బ్రెయిలీ స్థానం మహత్తరమైనది. అంధత్వం శాపం కారాదని, అంధుల కోసం చుక్కలతో కూడిన లిపిని రూపొందించి, అప్పటికే అమల్లో ఉన్న నామమాత్రపు అంధుల లిపిని సరళీకరించి, గుర్తింపుతెచ్చిన బ్రెయిలీ కృషి నిరుపమానం. బాల్యం లోనే రెండుకళ్ళను కోల్పోయిన బ్రెయిలీ నిరుత్సాహ పడకుండా తన ప్రతిభతో తనను తాను తీర్చిదిద్దుకుని, ప్రొఫెసర్‌గా మారి, అంధుల లిపి కోసం అహరహం కృషి చేసాడు. బ్రెయిలీ కంటే ముందుగానే ఎంతోమంది అంధుల భాషకు అక్షర రూపమివ్వాలని భావించి, అంధులకు ప్రత్యేకంగా పుస్తకాలు తయారు చేయడానికి ఎంతగానో కృషి చేసారు. కాని ఆ కృషిలో వారు పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోయారు. 4వ సంవత్సరం వరకు ప్రపంచాన్ని తన కళ్ళతో చూసిన వ్యక్తికి హఠాత్తుగా కళ్ళుపోతే, అప్పటి వరకు చూసిన ప్రపంచం శూన్యంగా అగుపిస్తే, చుట్టూ అంధకారం అలముకుని, నిరాశానిస్పృహలతో జీవితం అయోమయంగా, అస్తవ్యస్థంగా మారితే ఆ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడమే కష్టం. అలాంటి ఉద్విగ్న మానసిక సంఘర్షణలో జనించిన ఒక చిన్న ఆలోచన సమున్నతమైన పరిశోధనకు తెరతీసింది. అంధుల లిపికి శ్రీకారం చుట్టింది. అంధులకు ఆరుచుక్కల్లోనే అక్షరాలను, చిహ్నాలను తయారుచేసి, కేవలం చేతి వేళ్ళ స్పర్శతో సమస్త ప్రపంచాన్ని అంధులకు ప్రసాదించిన ‘లూయీ బ్రెయిలీ’ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయా రు. బ్రెయిలీ లిపి అంధులకు ఆశాకిరణంలా మారింది. ఆయన మరణించి 172 సం. లు దాటినా ఈనాటికీ స్మరించుకుంటున్నామంటే ఆయన అంధుల కోసం, అంధుల లిపి కోసం చేసిన కృషి ఎలాంటిదో అవగతమవుతున్నది.



సుంకవల్లి సత్తిరాజు
9704903463

# ‘సినిమా సంస్కరణ’లకు సరైన సమయం ఇదే

ఏదైనా ఒక సామాజిక సమస్య ఏర్పడ్డప్పుడు దానిపై ప్రజలు మాట్లాడుతారు, విభిన్న కోణాలలో చర్చిస్తారు. ఇలాంటి సమయంలో వార్తాపత్రికలలో, సామాజిక మాధ్యమాలలో, టి.వి లాంటి ప్రసార సాధనాలలో ఆ సమస్య కొన్నాళ్లు నలుగుతుంది. ఇక్కడ రెండు రకాలుగా ఆ సమస్య సమాజం నుండి మాయమవుతుంది. ఒకటి సమస్యకు తగిన పరిష్కారం దొరకడం, రెండు పరిష్కారం లభించకుండానే నీరుగారిపోవడం. ఇప్పుడు ఎందుకు ఈ ప్రస్తావన అంటే ఈ మధ్యన ‘పుష్ప 2’ సినిమా అనేక రకాలుగా హల్చల్ చేస్తూనే ఉంది. ఈ సినిమా ‘ప్రీమియర్ షో’లో జరిగిన సంఘటనలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో చేసిన ప్రసంగం నిజంగా ‘నిజాలు’ ను ప్రతిబింబించింది. ఇటువంటి తరుణంలోనే తెలుగు ‘సినిమా’ సమస్యలకు పరిష్కారం వెతకవలసిన బాధ్యత ఇటు సమాజం, అటు ప్రభుత్వాలపైన ఉంది.

**తెలుగు సినిమా ప్రత్యేకతలు:** దేశ వ్యాప్తంగా మన తెలుగు సినిమాకు ప్రత్యేకత ఉంది. సామాజిక దురాచారాలను అంతమొందించే చిత్రాలను రూపొందించిన ఘన చరిత్ర మన తెలుగు సినిమాది. సమాజంలో ఉన్న వివిధ వర్గాలపై, వ్యవస్థలపై సినిమా ప్రభావం మెండుగా ఉంటుంది. అది మంచైనా లేదా చెడైనా సరే !

సినిమా ప్రధాన లక్ష్యం ప్రేక్షకులకు విలువలతో కూడిన వినోదాన్ని, ఆనందాన్ని అందించడం. కొన్ని సామాజిక సమస్యలను స్పృశించి ప్రజలలో మార్పు తేవడం. సమాజానికి ‘మంచి సందేశాన్ని’ అందించడం. కానీ ప్రస్తుతం వస్తున్న కొన్ని సినిమాలలో వినోదం మాట దేవుడెరుగు! యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయి. ఇప్పుడు సినిమా పక్కా వ్యాపారం. అధిక లాభాలు సంపాదించే ఒక అందమైన బిజినెస్.

**వినోదం తక్కువ ! అశ్లీలం ఎక్కువ:**

ప్రజాస్వామ్య సమాజాలలో ప్రభుత్వ వ్యవస్థలే పట్టుగొమ్మలు. అటువంటి వ్యవస్థలను తప్పుడుగా చూపించే కథాంశంగా ఉండే సినిమాలు వస్తున్నాయి. వీటిలో వాస్తవానికి దూరంగా ఉండే అంశాలు ఉంటున్నాయి. ‘ సినిమాలో హీరో అన్నింటికీ అతీతుడు. ఎంతమందినైనా ఒంటిచేత్తో కొడతాడు. అలా కొడితేనే మరి హీరో ! ఎన్నో వికృత చేష్టలు చేసినా తప్పు లేదు. అశ్లీల పదాలు వాడొచ్చు. తప్పుచేసే వ్యక్తులకు న్యాయస్థానాలతో పనిలేకుండా శిక్షిస్తాడు. వీలైతే ఆగ్రహావేశాలతో చంపేస్తాడు. ఇటువంటి చిత్రాల వలన వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలా ఒక నెగిటివ్ భావనను కలిగిస్తున్నాయి. హీరో పాత్ర సమాజం దృష్టిలో పాజిటివ్‌గా ఉండాలి. అంతే తప్ప ఒక స్మగ్లర్ని కూడా హీరోగా చూపిస్తే సమాజానికి ఆ సినిమా ఇచ్చే ‘సందేశం’ ఏమిటి? విద్యాపరంగా ఉన్నత స్థానాల్లో ఉండే ఉపాధ్యాయులపై సెటైర్లు, కౌంటర్లు వేస్తూ గురువులను ఒక జోకర్‌లా చూపించే పాత్రలను మన దర్శకులు సృష్టిస్తున్నారు.ఇదేనా చిత్రాలు గురువులకు ఇచ్చే గౌరవం! ఇటువంటివి విద్యార్థులు చూసి నిజ జీవితంలో ఆచరించారా?



గురువు మాట వినేదెవరు. ఒక హీరో (స్మగ్లర్ ) తన తోటి స్మగ్లర్లను జైలు నుండి తీసుకుపోడానికి పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలీసులను కొంటాడా? ఇది దుర్మార్గమైన చర్య కాదా? వ్యవస్థలను డబ్బుతో కొనేస్తాడా? ఒక ముఖ్యమంత్రి తనతో కలిపి ఫోటో తీయించుకోలేదని సిఎంనే మార్చుతాడా? ఈ చర్యకోసం ఎర్ర చందనాన్ని విదేశాలకు అక్రమంగా తరలించి సంపాదించిన డబ్బును ఉపయోగించడమా? వారి దృష్టిలో ఒక ప్రజానాయకుడును డబ్బుతో మార్చేస్తారా! వాళ్ళకే తెలియాలి. దేశ చరిత్రలో ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా జరిగిం దా?

కొన్ని సినిమాలలో జుగుప్సాకరమైన, ద్వంద్వార్థాలు వచ్చే భాషను వాడుతున్నారు. ఇక ప్రతీ సినిమాలలో ఒక ఐటెం సాంగ్ ఉండాలి ! వంటిమీద చాలీ చాలనట్లుగా కురచ దుస్తులతో మహిళలు నృత్యాలు! వెనుక కల్లు తాగిన కోతుల్లా సొంగ కార్చుకుంటూ యువత! నిజ జీవితంలో ఇలాంటివి ఉన్నాయా? నాయిక వాలకం చూస్తే ఫుల్‌ఎక్స్‌పోజింగ్ (అశ్లీలత)! ఇది మహిళలను అవమానించడం కాదా!

**‘శృంగార నైషధం’ కావ్యాన్ని రచించిన శ్రీనాథుడు ఇప్పుడు ఉండి ఉంటే ఏమి చేసే వారో ?**

విద్యార్థులు మద్యం త్రాగినా తప్పు లేదు అన్న భావంతో కొన్ని సీన్స్ ఉంటున్నాయి. ‘మద్యపానం సేవించడం, పొగ త్రాగడం హానికరం’ అని ఒక వాక్యం చూపించేస్తే సరిపోతుందా! సినిమాలలో ఇటువంటి అశ్లీల దృశ్యాలు చూసి యువత ఎందుకు పెడతోవపట్టరు? దీనికి కారకులెవరు?

**సినిమా వ్యూహం:** సినిమా విడుదలకాక ముందే రకరకాలైన పేర్లతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ షోలలో విడుదల కాబోయే సినిమా గురించి ఒక కృత్రిమ హైప్ సృష్టిస్తున్నారు. ఫట్ అయిన చిత్రాల్ని కూడా హిట్ చేసే కొన్ని ఏజెన్సీలు ఉన్నాయి. వీరు వివిధ సామాజిక మాధ్యమాల్లో చెత్త సినిమాలకోసం ఊదర కొట్టి కొట్టి మన కర్ణభేరిలకు కన్నాలు పెడుతున్నారు. ఇంకా ఒక సినిమాని పార్ట్ 1, పార్ట్ 2 అని విడదీసి రెండుసార్లు ప్రేక్షకులను సినిమాహాళ్ళకు రప్పించి వాళ్ళ జేబులకు చిల్లు వేస్తున్నారు. ఏమీ తెలియని సామాన్య ప్రేక్షకులు ఇవి నిజాలని నమ్మి సినిమాలు చూసేస్తున్నారు. సెన్సార్ వాళ్ళు ఈ సినిమాలను చూసి సర్టిఫికేట్ ఇస్తున్నారా? లేక చూడకుండా ఇస్తున్నారా? అనే సందేహం ఇటువంటి అనైతిక, అశ్లీల సినిమాలను చూసే సామాన్యుడి మెదడులో మెదులుతున్న ప్రశ్న.

**సంస్కరణలు అవసరం:** భారీ బడ్జెట్‌తో తీసిన సినిమాలపై ఎక్కువ శాతం పన్ను ను ప్రభుత్వం విధించాలి. ఇంకా ఎట్టి పరిస్థితులలో కూడా సినిమా టికెట్ ధరలు పెంచుకోడానికి అవకాశం ఇవ్వకూడదు. ఒక నగరంలో సగం కంటే ఎక్కువ సినిమా హాళ్లలో రిలీ జ్ కాకుండా నిబంధనపెట్టి చిన్న సినిమాలను బ్రతికించాలి. ప్రీ రిలీజ్ ఈవెంట్స్ జరిపేటప్పుడు ఏవైనా జరగరాని సంఘటనలు జరిగితే ఆ సినిమా యూనిట్ వారిని బాధ్యుల్ని చేయాలి.

**మార్గదర్శకాలు అవసరం:** ప్రతీ సినిమా కొన్ని మార్గదర్శకాలకు అనుగుణంగా చిత్రీకరించేటట్లుగా చట్టం చేయాలి. అవి ఒక చిత్రం వినోదాత్మకంగా ఉండాలి. సమాజానికి కీడు చేసే విధంగా ఉండగూడదు. అశ్లీలతకు, అనైతికతకు తావుండగూడదు. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఉండా లి.



జనక మోహన రావు దుంగ
8247045230





బిహార్ రాష్ట్ర రాజధాని పట్నాలోని జనశక్తి ప్రెస్ ప్రాంగణంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ రామ్ నరేశ్ పాండే అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో డి.రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి నాగేంద్రనాథ్ ఓఝా, కార్యవర్గ సభ్యుడు జానకి పాశ్వాన్ తదతరులు ప్రసంగించారు.

# పితాంపూర్‌లో ఉద్రిక్తత

## యూనియన్ కార్బైడ్ వ్యర్థాల వివాదం... నిరసన ఇద్దరు వ్యక్తులు సజీవ దహనానికి యత్నం



**ధార్ :** యూనియన్ కార్బైడ్ నుండి 337 టన్నుల ప్రమాదకర వ్యర్థాలను ప్రణాళికాబద్ధంగా పారవేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం మధ్యప్రదేశ్‌లో ని పితాంపూర్‌లో ఇద్దరు వ్యక్తులు సజీవ దహనానికి ప్రయత్నించారు. దీంతో పితాంపూర్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రత్యక్ష సాక్షుల ప్రకా రం, 'పితంపూర్ బచావో సమితి' నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులు తమపై తాము మండే ద్రవాన్ని పోసుకుని సజీవ ద హనానికి యత్నించారు. అయితే తోటి నిరసనకారులు వారి చర్యలను అడ్డుకున్నారు. వెంటనే వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇండోర్ నుం డి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌన్‌షిప్‌కు ప్రమాదకర పదార్థాలను తరలించడం వల్ల భద్రత, పర్యావరణపరమైన చిక్కులపై ప్రజలు ఆందోళనలు చేయడంతో నిరసనలు ఉత్పన్నమయ్యాయి. పరిస్థితి అదుపులో ఉంది కానీ ఉద్రిక్తంగా ఉందని ధార్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ సింగ్ పితామ్‌పూర్ బస్టాండ సమీపంలోని నిరసన ప్రదేశం నుండి ఫోన్‌లో పిటిఐకి తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను స్థానిక ఆసుపత్రి నుండి ఇండోర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారు ప్రాణాపాయం నుండి బయటపడ్డారని వైద్యులు ధృవీకరించినట్లు ఎస్పీ తెలిపారు. పితంపూర్ బచావో సమితి ఇచ్చిన బంద్ పిలుపు నేపథ్యం లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు కొనసాగా యి. వ్యర్థాలను తగులబెట్టడానికి ఏర్పాటు చేసిన పారిశ్రామిక యూనిట్ వరకు నిరసన ప్రదర్శన చేయగా, ఆందోళనలో పిల్లలు కూడా పాల్గొన్నారు. పితంపూర్‌లో దాదా పు 1.75 లక్షల జనాభా ఉంది. ఇక్కడ పారిశ్రామిక ప్రాంతంలో మూడు విభాగాల్లో దాదాపు 700 ఫ్యాక్టరీలు ఉన్నాయి. పట్టణంలోని ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, జిల్లా కలెక్టర్ ప్రియాంక్ మిశ్రా, ఎస్పీ సింగ్ ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని కోరుతూ రెండు వేర్వేరు వీడియోలను విడుదల చేశారు. తమ డిమాండ్లు వినడానికి అధికారయంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యమే ప్రధానమని, అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఉన్నతాధికారులు ఇద్దరు చెప్పారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటనతో ముడిపడి ఉన్న వ్యర్థాలను ప్రణాళికాబద్ధంగా కాల్చివేయడం స్థానిక నివాసితులకు, ఈ ప్రాంత పర్యావరణానికి హాని కలిగిస్తుందని పేర్కొంటూ పితంపూర్ బచావో సమితి ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా దుకాణాలు, మార్కెట్‌లు మూసివేశారు. నిరసనలో చిన్నారులు కూడా పాల్గొన్నట్లు ధార్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఇంద్రజీత్ సింగ్ బకర్వాల్ ధృవీకరించారు. డిసెంబర్ 23, 1984 మధ్య రాత్రి, భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ పురుగుమందుల కర్మాగారం నుండి మిథైల్ ఐసోసైనేట్ (ఎంఐసి) గ్యాస్ లీకైంది, కనీసం 5,479 మంది మరణించారు. వేలాది మంది తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో భోపాల్‌లో ఉన్నారు. ఈ చర్య నిరసనలకు దారి తీసినప్పటికీ, అధికారులు కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి 337 టన్నుల వ్యర్థాలను శాస్త్రీయంగా పారవేయడం కోసం పితాంపూర్‌కు తరలించారు. భోపాల్‌లోని మెటీరియల్ గురువారం పితాంపూర్‌లోని దహన యూనిట్‌కు చేరుకుంది. నిరసనల సమయంలో, ఐషర్ మో టార్స్ సమీపంలో నిరసనకారుల గ్రూపు రహదారిని అడ్డుకుంది. తేలికపాటి లాఠీచార్జి తర్వాత పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చారు. గురువారం నుంచి బస్టాండ్‌లో నిరాహార దీక్ష చేస్తున్న సందీప్ రఘువంశీ మాట్లాడుతూ పి తాంపూర్‌లో యూనియన్ కార్బైడ్ వ్యర్థాలను పారవేయడాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు తనకు సంఘీభావం తెలిపారు. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణకు పీతాంపూర్‌లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## ఒక మావోయిస్టు మృతి ఐఇడి బాంబు పేలి ముగ్గురు జవాన్లకు గాయాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఆ రాష్ట్రంలోని గరియాబాద్ జిల్లాలో శుక్రవారం ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఒడిస్సా సరిహద్దుల్లోని ఇందాగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందేకార్ గ్రామ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఈ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల అనంతరం సంఘటనా స్థలాని పరిశీలించిన భద్రతా బలగాలకు ఓ మావోయిస్టు మృత దేహం లభ్యమైంది. మరో ప్రక్క తుపాకులు, మందు గుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం లభ్యమైంది. అడవిలోనికి జారుకున్న మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు.

**ముగ్గురు జవాన్లకు గాయాలు**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం మావోయిస్టులు అమర్చిన ఐఇడి బాంబు పేలి ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. అడవుల్లో మావోయిస్టుల ఏరివేతకై కూంబింగ్‌కు వెళ్లిన డిఆర్‌జి జవాన్లు గాయాలపాలయ్యారు. భద్రతా బలగాలు గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తోక్డా గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. గాయాలపాలైన జవాన్లను హుటాహుటిన ఆస్పత్రికి తరలించ చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆ రాష్ట్రపోలీసులు ప్రకటించారు.

# బడ్జెట్ సమావేశాలలో కూడా వక్ఫ్ సవరణ బిల్లు లేనట్లే?

## జెపిసికి ఇచ్చిన గడువు సరిపోకపోవడమే కారణం

**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై నియమించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) మరోసారి గడువులోగా నివేదిక ఇచ్చే అవకాశాల కనిపించడం లేదు. బిజెపి ఎంపి జగదాంబికాపాల్ నేతృత్వంలోని జెపిసికి శీతాకాల పార్లమెంటు సమావేశాలలోనే నివేదిక ఇవ్వాలని గడువు విధించారు. అయితే, సమయం సరిపోదని ప్రతిపక్ష సభ్యులు చేసిన విజ్ఞప్తి మేరకు జనవరి 30న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకు గడువును లోక్‌సభ స్పీకర్ పెంచారు. బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 12న ముగిసే అవకాశం ఉంది. ఈ గడువులోగా కూడా కమిటీ తన పనిని పూర్తి చేసే అవకాశం లేనందును వర్షాకాల సమావేశాల వరకు నివేదిక సమర్పణకు గడువు కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతే కాకుండా, అధికార ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జెడి(యు)ల నుంచి కూడా వక్ఫ్ చట్టంలో ప్రతిపాదిత సవరణలను తీవ్రంగా వ్యతిరేకించడం కూడా మరో కారణమని తెలిసింది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించే ప్రతిపాదనలతో కూడిన సవరణలను ఆంధ్రప్రదేశ్, బిహార్‌లోని పలు ముస్లిం సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. "వివాదాస్పదమైన ప్రతిపాదనలను మార్చే విషయంలో టిడిపి లేదా జెడి(యు)లకు పరభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదు. త్వరలో జరగనున్న బిహార్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జెడి(యు) తన ఎన్నికల అవకాశాలకు దెబ్బ తగలకూడదని జెడి(యు) కోరుకుంటుంది" అని ఆ పార్టీ కీలక నేత వెల్లడించారు. ఆయా రాష్ట్రాలలో మైనారిటీలలో జెడి(యు), టిడిపిలు బలమైన మద్దతు కలిగి ఉన్నాయని చెప్పారు.



పార్లమెంటు శీతాకాల సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాలో ప్రభుత్వం చేర్చినప్పటికీ జెపిసి కోరడంతో గడువును పెంచారు. తమకు విధించిన గడువు ప్రకారం పని చేయడం అసాధ్యమని, ఎందుకంటే లక్షల మంది సాక్షుల ఆందోళనలను నమోదు చేసేందుకు చాలా సమయం పడుతుందని కమిటీ సభ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. భాగస్వాముల నుంచి నిజమైన ఆందోళనలు వినాలని ప్రతిపక్ష సభ్యుల నుంచి జెపిసి చైర్మన్‌పై ఒత్తిడి ఉననదని, ఇప్పటి వరకు కమిటీ సరైన పద్ధతిని పాటించలేదని ఆయన అన్నారు.

# రైల్వే ట్రాక్‌పై పబ్‌జీ ఆడుతూ.. ముగ్గురు యువకులు దుర్మరణం

**పాట్నా :** ఓ ముగ్గురు యువకులు రైల్వే ట్రాక్‌పై కూర్చొని పబ్‌జీ ఆడుతుండగా.. వారిని రైలు ఢీకొట్టింది. దీంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన బీహార్‌లోని వెస్ట్ చంపారన్ జిల్లాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. యువకుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ముగ్గురు కూడా చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని.. పబ్ జీ గేమ్‌లో నిమగ్నం కావడంతో.. రైలును గమనించలేకపోయారని పోలీసులు తెలిపారు. దీంతో రైలు వారిని ఢీకొట్టిందన్నారు. మృతులను ఫర్ఖాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా పోలీసులు గుర్తించారు. మృతుల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఢిల్లీలో కేంద్రం చేసిందేమీలేదు : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఆప్ అధినేత కేజ్రీవాల్ అన్నారు. చేసి ఉంటే ప్రధాని నరేంద్ర మోదీ తన 43 నిమిషాల ప్రసంగంలో 39 నిమి షాలు పాటు రాజధాని ప్రజలను, వారు అత్యధిక మెజారిటీతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని తి ట్టా ల్సిన అవ సరం ఉండేది కాదు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పాలనపై మోడీ చేసిన వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో కేజ్రీవాల్ స్పందిస్తూ బిజెపి 'దుర్వినియోగ రాజకీయాలు' 'వ్యక్తిగత దాడులకు' మాత్రమే పాల్ప డుతుందని అన్నారు. శుక్రవారం తన ప్రసంగంలో, మోడీజీ 39 నిమిషాల పాటు చెప్పింది ఏమీ లేదని, అయితే ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని, ఢిల్లీ ప్రజలను దూషిస్తూ సమయం వృథా చేశా రన్నారు. "గత పదేళ్లలో మా ప్రభుత్వం చేసిన పనిని లెక్కించేందుకు రెండు మూడు గంటలు కూడా సరి పోద న్నారు. మరోవైపు మోదీజీ ప్రసంగంలో మాట్లాడగలిగే ఏ పనీ బిజెపి ప్రభుత్వం చేయలేదని, అది చేసి ఉంటే.. ఢిల్లీ ప్రజలను దుర్భాషలా డాల్సిన అవసరం ఉండేది కాదు. అంతకుముందు అశో క్ విహార్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో, మోడీ ఆప్‌నుద్దే శించి ఢిల్లీకి 'ఆప్దా' (విపత్తు) అని పిలిచారు, ఈ 'ఆప్దా' గ త 10 సంవత్సరాలలో దేశ రాజధానిని తన గ్రిప్‌లోకి తీసుకుందని అన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ని ఓడించి బిజెపి విజయం సాధిస్తుందన్న విశ్వాసాన్ని కూడా ప్రధాని వ్యక్తం చేశారు.

# మెడికల్ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉండొద్దు

## కేంద్రానికి 'సుప్రీం' ధర్మాసనం ఆదేశం

## రాష్ట్రాలు, సంబంధిత వాటాదారులతో సమావేశం నిర్వహించాలని కోరిన 'అపెక్స్ కోర్ట్'

## తదుపరి విచారణ ఏప్రిల్‌కు వాయిదా

**న్యూఢిల్లీ :** మెడికల్ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉండకూడదని, రాష్ట్రాలు సహా సంబంధిత వాటాదారులతో సమావేశం నిర్వహించాలని, రాష్ట్రానికి సంబంధించి నియమించిన కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని కోరింది. జస్టిస్ బిఆర్.గవాయ్, కెవి.విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేసు విచారణకు స్వీకరించిన సందర్భంగా 'సీట్లు ఖాళీగా ఉండకూడదు' అని నొక్కిచెప్పింది.ఏప్రిల్ 2023లో మెడికల్ కోర్సుల్లో సూపర్ స్పెషాలిటీ సీట్లను భర్తీ చేయకుండా మిగిలిపోయిన అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యేకంగా ప్రస్తావించింది. సమస్యను పరిష్కరించడానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన రాష్ట్రాల, ప్రైవేట్ మెడికల్ కాలేజీల ప్రతినిధులు సహా అన్ని వాటాదారులతో కూడిన కమిటీని నియమించాలని కేంద్రం అప్పుడు ప్రతిపాదించింది.శుక్రవారం కేంద్రం తరపు న్యాయవాది మాట్లాడుతూ వాటాదారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని,అది తన సిఫారసులు అందజేసిందని, కేంద్రం స్టేక్ హోల్డర్స్‌తో సమావేశం నిర్వహించి నిర్దిష్టమైన ప్రతిపాదనతో ముందుకు రావడం సముచితమని న్యాయవాది చెప్పారు. అందువల్ల సమావేశం నిర్వహించాలని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించి అవసరమైన అన్నింటినీ మూడు నెలల్లో పూర్తిచేయాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంటూ కేసును ఏప్రిల్‌లో పోస్ట్ చేసింది. ఏప్రిల్ 2023లో 1003 విలువైన సూపర్ స్పెషాలిటీ సీట్లు ఇచ్చినా 'వెరీ సారీ పిక్చర్' అని చిత్రీకరించేముందు విలువైన సీట్ల భర్తీకి ఎలాంటి అడ్మిషన్లు జరుగనందున వృథాగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఒక వైపు సూపర్‌స్పెషాలిటీ వైద్యుల కొరత ఎల్లప్పుడూ ఉన్న విషయాన్ని ధర్మాసనం కనుగొన్నదని, మరోవైపు ఈ విలువైన సీట్లు ఇంకా భర్తీ చేయకుండా కనిపించాయని ధర్మాసనం తన అసంతృప్తి వ్యక్తం చేసింది.



# కాలేజీలలో కులవివక్ష అరికట్టేందుకు సమర్థ యంత్రాంగం ఉండాలి

## యుజిసికి సుప్రీంకోర్టు వెల్లడి

**న్యూఢిల్లీ :** కళాశాలల్లో కులవివక్షను అత్యంత సున్నితమై న సమస్య అని సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిని ఆపేందుకు ఉపాయంతో ఒక సమర్థ యంత్రాంగాన్ని రూపొందించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు జి సి)కి సుప్రీంకోర్టు శుక్రవారంనాడు మార్గదర్శకాలు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్రస్థాయి, ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలలో చదువుకునే విద్యార్థులమధ్య కుల ప్రాతిపదికపై ఎలాంటి వివక్షా చెలరేగకుండా భరోసా కలిగించేందుకు వీలుగా నియంత్రణలతో కూడిన క్రమబద్ధమైన విధివిధానాల ముసాయిదాను విడుదల చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఆరు వారాల్లోగా యుజిసి కొత్త నిబంధనల తుది నోటిఫికేషన్‌ను వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. "ఈ సున్నితమైన సమస్యపై పాటు మేం కూడా మనందరం సమానస్థాయిలో ఆందోళన చెందుతున్నాం. ఇందుకోసం మనం మనం ఏదైనా చేయాలి, యుజిసి 2012లో రూపొందించిన నిబంధనలను వాస్తవ రూపం దాల్చేందుకు వీలుగా తగిన కార్యవిధాన పద్ధతులను,ఒక సమర్థవంతమైన యంత్రాంగాన్ని కనుగొనాలి" అని ధర్మాసనం పేర్కొంది. యుజిసి సమానత్వ నిబంధనలుగా పిలిచే "ఉన్నత విద్యాసంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించే నిబంధనలు–2012" అమలు చేసేందుకు ఎన్ని విద్యాసంస్థలలో ఈక్వల్ ఆపర్చ్యునిటీ సెల్స్‌ను ఏర్పాటు చేశారో, వాటి పనితీరు, ఆ డేటాను తయారు చేయాలని కోరింది. కుల వివక్షకు సంబంధించి అన్ని విశ్వవిద్యాలయాలలో, ఉన్నత విద్యాస్థలలో ఈక్వల్ ఆపర్చ్యునిటీ సెల్స్‌కు ఎన్ని ఫిర్యాదులు ఇప్పటివరకూ వచ్చాయో, అదేసమయంలో వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ సమగ్ర సమాచారం రూపొందించాలని ధర్మాసనం కోరింది. కులవివక్ష కారణంగా ఆత్మహత్యకు పాల్పడి జీవితాలను కోల్పోయిన విద్యార్థులు రోహిత్ వేముల, పాయల్ తద్విల తల్లుల తరపున సుప్రీంకోర్టులో వాదనలకు హాజరైన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ మాట్లాడుతూ, ఐఐటిలలో, ఇతర ఉన్నత విద్యాసంస్థలలో 2004 నుండి ఇప్పటివరకూ 50 మంది విద్యార్థులు కుల వివక్ష కారణంగా మరణించారనీ, వీరిలో ఎక్కువమంది ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందినవారే ఉన్నారనీ చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్‌డి స్కాలర్‌గా చేస్తున్న వేముల రోహిత్ 2016 జనవరి 17న మరణించగా, తమిళనాడు టోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజీలో విద్యార్థిని తద్వి కూడా తన కళాశాలలో ముగ్గురు తోటి వైద్యులు కులవివక్ష పాటించడంవల్ల 2019 మే 22న ఆత్మహత్యకు పాల్పడింది. 2019లో ఈ కేసులో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైనప్పటికీ కూడా ఇంతవరకూ సమగ్ర విచారణ జరగలేదని ధర్మాసనం చెరప్పింది. "ఇక మీదట మేం ఈ పిటిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తాం, దీనికి సమర్థవంతమైన పరిష్కారం సాధించేలా చూస్తాం, గడచిన ఐదు సంవత్సరాలుగా జరగాల్సినంత పురోగతి జరగలేదు" అని న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. కాగా కులం ఆధారంగా వివక్షను అడ్డుకునేందుకు వీలుగారూపొందించిన కొత్త నిబంధనల ముసాయిదాను యుజిసికి చెందిన న్యాయవాది కోర్టుకు సమర్పించారు. యుజిసి ఏర్పాటు చేసిన కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. "ఈ ముసాయిదా నిబంధనలను వెబ్‌సైటులో పెట్టి దానిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నాయా? సలహాలు చెబుతారా?అని అడగాల్సిన అవసరం ఉందని, ప్రజల నుండి సలహాలు అడగాలని, ఆ తర్వాత ఈ నిబంధనలకు చట్టబద్ధత తీసుకురావాలని యుజిసి తరపు న్యాయవాది కోర్టును కోరారు. కమిటీ నివేదిక సమర్పించేందుకు ఎందుకు ఇంత జాప్యం జరిగిందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ఆయనను ప్రశ్నించింది. ఈ కొత్త నిబంధనలకు అధికారిక గుర్తింపు ఇచ్చేందుకు మీకు ఇంకా ఎంత సమయం కావాలని ఆయనను ధర్మాసనం ప్రశ్నించింది. నెలరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసి తుది నోటిఫికేషన్‌ను ఆరు వారాల్లో వెబ్‌సైటులో ఉంచాలని ఆదేశించింది.

# ఎన్‌కౌంటర్లు... లొంగుబాట్లు అష్టదిగ్బంధనంలో మావోయిస్టులు

## అడుగడుగునా పోలీస్ క్యాంపులు

## మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాయుధ బలగాలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** అనేక దశాబ్దాల పాటు భారత దేశంలో దాదాపు సగం రాష్ట్రాల్లో తన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుంది. మూడు రకాలైన ఇబ్బందుల నడుమ మావోయిస్టు ఉద్యమ భవితవ్యం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు దండకారుణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టులు ఇప్పుడు ఢీలా పడిపోతున్నారు. ఒక పక్క ఎన్‌కౌంటర్లు, మరో పక్క లొంగుబాట్లు ఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. పోలీస్ బలగాల ముప్పేట దాడితో రక్షణ కరువవుతుంది. మొదటిగా దండకారుణ్యంలోకి ప్రవేశించాలంటే దశాబ్ద కాలం క్రితం వరకు పోలీస్ బలగాలు వణికి పోయేవి. ఏ చెట్టు ఏ పుట్ట, ఏ గుట్టను చాటు చేసుకుని మావోయిస్టులు దాడి జరుపుతారో అన్న ఆందోళన పోలీస్ బలగాల్లో ఉండేది. మూకుమ్మడిగా ప్రయాణించిన సందర్భంలోనూ పోలీసులు మావోయిస్టుల దెబ్బకు విలవిలలాడిన సందర్భాలు పదుల సంఖ్యలో ప్రాణాలను పోగొట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కానీ ఇప్పుడు దండకారుణ్యంలో సాయుధ పోలీస్ బలగాలు యధేచ్ఛగా సంచరిస్తున్నాయి. మావోయిస్టుల పెట్టని కోటలా చెప్పుకునే ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలోనూ ప్రతి మూడు కిలోమీటర్లకు మరికొన్ని చోట్ల ప్రతి ఐదు కిలో మీటర్లకు, పది కిలో మీటర్లకు పోలీస్ బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అటవీ గ్రామాలను వదలకుండా అడవులను మొత్తం జల్లెడ పడుతున్నారు. గత మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే మావోయిస్టులు ఎదురు దెబ్బలు తిన్నారు తప్ప పోలీసులు దెబ్బతిన్న ఘటనలు చాలా స్వల్పం. మరో పక్క పోలీసులకు ఒకప్పుడు అటవీ గ్రామాల్లో నివసించే ప్రజల మద్దతు అసలు ఉండేది కాదు. సాయుధ మావోయిస్టులను అటవీ గ్రామాల ప్రజలు ముఖ్యంగా గిరిజనులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ పోలీసులు ఎంత హింసించినా మావోయిస్టుల జాడ చెప్పేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మావోయిస్టుల కంటే పోలీసులకు సమాచారం చేరవేయడం పట్ల ఉత్సుకత ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఆ ఉత్సుకతే మావోయిస్టుల ప్రాణాలు పెద్ద సంఖ్యలో పోవడానికి కారణమవుతుంది. దళాల రాక పోకలు నిశితంగా గమనిస్తూ పోలీసులకు సరైన సమాచారం ఇస్తుండడంతో దళాలు పోలీసులకు చిక్కి ప్రాణాలు పొగొట్టుకుంటున్నారు. రక్షణ లేని స్థితికి మావోయిస్టు దళాలు చేరుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పోలీసు బలగాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నాయి. మావోయిస్టులకు సంబంధించి రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గిపోయింది. అదే సందర్భంలో ఆర్థిక, ఇతరత్రా వనరుల లోటు కూడా మావోయిస్టులను ఇబ్బందిపెడుతుంది. దశాబ్ద కాలంగా మావోయిస్టు పార్టీలో చేరే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, బీహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో మావోయిస్టు ఉద్యమం బలంగా పని చేసిన ప్పటికీ పాతికేళ్లుగా తెలంగాణ ప్రాంతం నుంచి సాయుధ ఉద్యమం వైపు ఆకర్షితులైన అనేక మంది మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించి అగ్ర నేతలుగా కొనసాగారు. వారి తర్వాత తరం ఆ తర్వాత మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులు కావడం కానీ నాయకత్వ స్థానాలకు ఎదగడం కానీ జరగ లేదు. ప్రధానంగా సాయుధ బలగాల వైపు ఆకర్షించబడే ప్రాంతాల నుంచి మావోయిస్టు ఉద్యమం వైపు చూసేలా చేయడంలో నాయకత్వం ఘోరంగా విఫలం చెందింది. మారుతున్న యువత ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టి ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షించలేకపోయారు. దీనితో క్రమేపి సాయుధ బలగాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఉద్యమంలో పనిచేసిన ఉద్యమ సారాంశాన్ని అర్థం చేసుకోలేని అనేక మందికి కూడా మావోయిస్టులు ఆయుధాలను ఇచ్చారు. వారు సిద్ధాంత నిబద్ధత లేకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చేరిన వారు కావడంతో ఒత్తిడి పెరగగానే లొంగుబాటు బాట పడుతున్నారు. ఈ లొంగుబాటు వార్తలు మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటీవల తారక్క లొంగుబాటు మావోయిస్టు ఉద్యమ కొనసాగింపుపై తీవ్ర చర్చకు దారితీసింది. మావోయిస్టు ఉద్యమం సరి కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యూహాన్ని మార్చి ముందుకు సాగితే మరికొంత కాలం మనుగడ ఉండే అవకాశం ఉంది. రెండు దశాబ్దాలుగా కొత్త ప్రాంతాలకు విస్తరించాలన్న మావోయిస్టు పార్టీ ఆలోచన ఎక్కడ సఫలీకృతం కాలేదు. ఒకప్పుడు గోదావరి పరివాహక ప్రాంతంలో తెలంగాణలో తీవ్ర ప్రభావాన్ని చూపిన అప్పటి మావోయిస్టు పార్టీ అదేవిధంగా సింగరేణి కార్మిక సంఘం (సికాస) ఇప్పుడు అటువంటి ప్రభావాన్ని చూపేపరిస్థితిలో లేవు. సికాస ఆచూకీ కనుమరుగు కాగా మూడేళ్లుగా తెలంగాణలో అడుగు పెట్టిన మావోయిస్టు దళాలు పోలీసుల తుపాకీ గుండుకు బలైపోయాయి. వరుస ఘటనల తర్వాత తెలంగాణలో మావోయిస్టు పార్టీ పునర్ నిర్మాణం సాధ్యం కాదని లేదంటే అంత తేలిక కాదని అవగతమవుతుంది. పోలీసుల సంఖ్య గణనీయంగా పెరగడం అటవీ సమీప గ్రామాలు, ముఖ్యంగా గిరిజన ప్రజల మద్దతు మావోయిస్టులకు లేకపోవడం మావోయిస్టుల్లో రిక్రూట్‌మెంట్ లేకపోవడం నిబద్ధత కలిగిన కార్యకర్తలను తయారు చేసుకోవడంలో వైఫల్యం అన్నింటికి మించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆపరేషన్ గ్రీన్ హంట్ మావోయిస్టుల మనుగడనే ప్రశ్నార్థకం చేసింది. ఈ విపత్కర పరిస్థితి నుంచి మావోయిస్టు పార్టీ ఏవైపుకు సాగుతుంది. దాని భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్నకు ఆ పార్టీ కార్యాచరణ సమాధానం చెప్పాలి.



# ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా ఢిల్లీ

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ :** రానున్న ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బిఎస్3 పెట్రోల్, బిఎస్4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం).. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుప రిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమం త్రి తెలిపారు. అదనంగా రూ.12500 కోట్ల సీఆర్‌ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించా రు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టు లను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS12UD 3270 | POCHAMPALLI SATYAPAL REDDY | A1 1616 IF FBT | 2013 |
| 2 | AP25AE 0161 | NARSIMHA SWAMY KOSARI | JOHN DEERE 5310 HARVESTER | 2010 |
| 3 | AP36TB 5148 | KARNAKAR REDDY PANNALA | MAHINDRA BOLERO MAXI TRUCK PLUS | 2013 |

AUCTION DATE : 04-01-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9704123166, 9989766426

## మంత్రి పొంగులేటిని కలిసిన గ్రానైట్ ట్రేడర్స్, మార్కర్స్ సభ్యులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పొంగులేటికి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్‌కు పూర్తి సహాయ సహకరాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు అదాలత్ నరేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జానిపాషా, కోశాధికారి ఎం. నవీన్ , కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, డి. దిలీప్‌కుమార్, రమేష్‌బాబు, వెంపటి వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఖాజామియా, నాగ మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా గణేశ్వరంలోని యుపిఎస్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శుక్రవారం సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయులు, ఖమ్మంజిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ అధ్యక్షులు లేడిబోయిన గోపాలరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మహిళా ఉపాధ్యాయులు కె. విజయశ్రీ, మజార్, కౌసల్య, రాధా తదితరులను సన్మానించారు. కార్యక్రమానికి రాజుపేట మాజీ ఎంపిటిసి భద్ర సహకరించారు. వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సామాజిక విప్లవ కారిణి, చదువుల తల్లి, భారతదేశ ప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు తెలిపారు. బిసి హక్కుల సాధన సమితి ఖమ్మంజిల్లా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న సావిత్రిభాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి వాళులర్పించారు. ఈసందర్భంగా తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే చదువుల ద్వారానే సామాజిక మార్పులు వస్తాయని ఉద్యమం చేపట్టారన్నారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి మాట్లాడుతూసావిత్రిబాయి లక్ష్య సాధనకు మహిళలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు రావుల హన్మంతరావు, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, తాటి నిర్మల, మంద వెంకటేశ్వర్లు, జ్వాలా నర్సింహారావు, మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు భూములు దక్కేవరకూ పోరాటం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపలి :** గూడు లేని పేదలకు గూడు కల్పించాలని గత కొన్ని నెలలుగా వేంసూరులో సాగుతున్న పోరాటం అధికారులు స్పందించక పోవడంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి పేదలు గుడిసెలు వేయటానికి సన్నద్ధమై పోరాటం ప్రారంభించారు. పేదలు ప్రారంభించిన పోరాటానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, మహిళా సమాఖ్య నియోజకవర్గ కన్వీనర్ ఎస్.కె.రంజాన్ బి, వేంసూరు శాఖా కార్యదర్శి ఎస్.కె .లాల్ మహమ్మద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల కోసం దున్నేవాడికే భూమి కావాలని పేదోడికి కనీసం తలదాచుకోవడానికి గుడిసె కావాలని, సిపిఐ పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. పేదలకు భూములు దక్కేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యాగసిరి వెంకటేశ్వరరావు, వెంకటమ్మ, సుబ్బారావు, ఏ ఐ వై ఎఫ్ నాయకులు ఎస్ కె.హమీద్, అజయ్, రమేష్, సుభద్రా, లక్ష్మి , సలీమా, మీరావలి, ఆయేషా, వెంకటేశ్వరమ్మ, చెన్నారావు, అంజమ్మ, సత్యవాణి, స్రవంతి పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

పోలీసు కమిషనర్ సునిల్‌దత్

ఆకట్టుకున్న పాసింగ్ ఔట్ పరేడ్

**ప్రజాపక్షం/ఖమ్మం, క్రైం :** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో తొమ్మిది నెలల పోలీసు శిక్షణ పూర్తిచేసుకున్న నూతన కానిస్టేబుళ్లు శుక్రవారం పాసింగ్‌ఔట్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరై మాట్లాడారు. పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ కీలకమన్నారు. న్యాయాలకు, చట్టాలకు అనుగుణంగా నిజాయితీగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ పిజేపిఎస్ చటర్జీ, అడిషనల్ కమిషనర్ విజయబాబు, సత్తుపల్లి ఏసిపి రఘు, ఇంటిలిజెన్సి అసిస్టెంట్ డైరెక్టర్ దామోదర్ రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.శ్రీధర్‌రాజు, రంగారెడ్డి, సత్తుపల్లి సిఐ కిరణ్, పిఆర్‌ఓ సాయిబాబా పాల్గొన్నారు.




# 'మున్నేరు' రిటైనింగ్ వాల్‌కు త్వరగా భూసేకరణ పూర్తి

జూలై 15లోగా రిటైనింగ్ వాల్ నిర్మాణం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మున్నేరుకు ఇరువైపులా చేపట్టనున్న రిటైనింగ్ వాల్‌కు సంబంధించి భూసేకరణను పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల సమస్యకు ఏడు నెలల్లో పరిష్కారం లభించబోతుందని ఆయన తెలిపారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ, భూ ఆక్రమణ తదితర విషయాలకు సంబంధించి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మున్నేరుకు ఇరువైపులా 8.5 కిలో మీటర్ల చొప్పున మొత్తం 17 కిలో మీటర్ల మేర రిటైనింగ్ వాల్‌ను నిర్మించనున్నామని ఇందుకు సంబంధించిన భూసేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 234 ఎకరాల భూమి అవసరం కాగా 64 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని మిగిలిన 170 ఎకరాల భూమిని వెంటనే భూయజమానులతో చర్చించి యుద్ధప్రాతిపదికన సేకరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో మున్నేరు వరద ఇరువైపులా నివసించే ప్రజలను ఇబ్బంది పెట్టరాదని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో అన్ని విషయాలను పరిగణలోకి తీసుకోవాలని మున్నేరు నీటి ప్రవాహం తదితర విషయాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఖమ్మం అర్బన్‌లోని భూములు ఎంత సేకరించాలి ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను అందుబాటులో ఉంచాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణ వివరాలు ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించిన వివరాలను వీలైనంత త్వరగా అందించాలని ఖమ్మం ఆర్‌డిఓను ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో 3.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైందని దీనిని దృష్టిలో ఉంచుకుని 15 మీటర్ల ఎత్తు, ఆరు మీటర్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపి రఘురాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఆర్‌డిఒ నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ హేమలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్‌తో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### రామవరం ప్రాంతంలో ఎయిర్ పోర్టు

**భద్రాచలం :** ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సమన్యాయం జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జిల్లా కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పోస్టాఫీస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేశారు. సుజాతనగర్ మండలంలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ విపాటిల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకంజలో ఉన్న కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళతామన్నారు. అనంతరం రామచంద్రా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పా టు చేసిన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ జిల్లాలోని రామవరం ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కొత్తగూడెంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. అనంతరం పాల్వంచ మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఐటిడిఏ పిఒ రాహుల్, నాయకులు ఎస్‌కె సాబీర్‌పాషా, నాగ సీతారాములు, సొసైటీ చైర్మన్ మండే హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎస్‌జిపిఎటి అధ్యక్షులు రాజేంద్రబాబు




**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సమస్యల సుడిలో పడి కొట్టుమిట్టాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు తెలిపారు. పలు దఫాలుగా పెన్షనర్ల సమస్య గురించి వివరించినా ఈ ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెన్షనర్స్‌డేను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం అవలంభిస్తుందని ఆరోపించారు. రూ.398 వేతనంతో పనిచేసిన ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్నింటికి మించి హెల్త్ కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందన్నారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించడానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఏడాది గడిచినా హామీని అమలు చేయడం లేదన్నారు.

**డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ :** సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ట్రెజరీ అధికారి ఎస్‌విఎస్ నర్సింహం, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 40 మంది రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, కె.కృష్ణమూర్తి, భాస్కరాచారి, ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సంఘం బాధ్యులు గుర్రాల శ్రీనివాసరావు, బెల్లం రాధాకృష్ణమూర్తి, ఊడుగు వెంకటేశ్వర్లు, మేరీ ఏసుపాదం, అంజలి, లక్ష్మి సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఐటిడిఏ పిఒ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేకాధికారులు, హెచ్‌ఎంలు, వార్డెన్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ పాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏసమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పత్యేక అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ప్రతీ ఒక్కరూ పదో తరగతి పాసయ్యేలే ప్రణాళికా బద్దంగా చదివించాలని, వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మ పాల్గొన్నారు.



## 'డబుల్' ఇండ్ల పంపిణీకి చర్యలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్రాంతిలోపు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌తో కలిసి డబుల్‌బెడ్ రూం ఇండ్లపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లె మడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బతండలో 29, నేలకొండపల్లి మండలం ఆచర్ల గూడెంలో 18 మొత్తం 131 డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్దిదారుల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని పేదలలో నిరుపేదలను ఎంపిక చేసి వారికి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పాలేరు అసెంబ్లీ పరిధిలో 209 డబుల్ బెడ్‌రూం ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఇండ్లకు కూడా లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి ఆ ఇండ్లు వారికి కేటాయించాలని, మిగిలిన పనులు చేసేందుకు ప్రణాళికలు, అవసరమైన నిధులు నివేదిక తయారు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాకపోతే ఎవరు బాధపడాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని సందేశం బలంగా వెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్‌లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్‌డిఒ నర్సింహారావు, హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నివిధాలా గిరిజన గ్రామాల అభివృద్ధి



అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**ప్రజాపక్షం/ములకలపల్లి :** ములకలపల్లి మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం పర్యటించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పూసుగూడెం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పూసుగూడెం గ్రామ పంచాయతీస్థాయి వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభించారు. సీతారాంపురం పంచాయతీ ధర్మన్న నగర్ గిరిజన గ్రామస్తులు ఎమ్మెల్యేని కలిసి తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు. క్రార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

### నూతన పంచాయతీ కోసం ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

**దమ్మపేట :** మండల పరిధిలోని మందలపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రకాష్ నగర్ మరియు గాంధీనగర్ గ్రామాల ప్రజలు శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి తమ గ్రామాలను పంచాయతీలుగా గుర్తించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయిలు నర్సి, ఎస్‌కె రఫీ, ఎస్‌కె పాషా, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక వాతావరణం ఉన్నందునే కాంగ్రెస్‌కు మద్దతు

ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్న వారికి ప్రజలే బుద్ధి చెప్పారు : ఎమ్మెల్సీ కోదండరాం




**ప్రజాపక్షం/పాల్వంచ:** రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం ఉన్నందునే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపామని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం పాల్వంచలోనీ కొమరం భీమ్ కార్యాలయ ప్రాంగణంలో టిజెఎస్ జిల్లా ప్లీనరీ సమావేశం జిల్లా అధ్యక్షులు బరగడి దేవదానం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. భ్రష్టు పట్టిన రాజకీయాల స్థానంలో సమూల మార్పు రావాలని, అలాంటి లక్ష్యాన్ని సాధించేందుకే టిజెఎస్ పార్టీ ఆవిర్భావించిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్న వారికి ప్రజలే బుద్ధిచెప్పారన్నారు. ప్రజలను ఆందోళనలకు దూరంగా ఉంచుతూ, తప్పుడు కేసులు పెడుతూ, నియంతృత్వాన్ని తెచ్చిన గత పాలకులను ప్రజలు ఓడించారన్నారు. ప్రజాస్వామ్యం పద్ధతుల్లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టకుండా స్వేచ్ఛా, స్వతంత్రాలను కల్పిస్తూ, ఉద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, నిరుద్యోగుల విషయంలో సానుకూల వాతావరణాన్ని అవలంభిస్తుందన్నారు. గోదావరి 1వ దశ పూర్తి చేసి ఇల్లందు ప్రాంతానికి నీరు అందించడం, కేటీపీఎస్ 6వ దశ స్థానంలో 800 మెగా వాట్ల ప్లాంట్లను 2 ఏర్పాటు చేయాలని, సింగరేణిలో 32000 మంది కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యమకారులకు ఇచ్చిన 6 హామీలు అమలు చేయాలని, భద్రాచలంలో ఆంధ్రాలోకి వెళ్లిన 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని, చత్తీఘడ్ నుండి వలస వచ్చిన గుత్తికోయలకు కులం సర్టిఫికెట్లు ఇవ్వాలని, సభ ఆమోదించిన తీర్మానాల అమలుకు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పోరాటాలు చేపడుతుందన్నారు. సభలో జిల్లా కార్యదర్శి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి, నాయకులు రామనాథం, సిద్దులు, నబి, వన్నారం శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఆంగ్లభాషపై పట్టుసాధిస్తే అవకాశాలు

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజుమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధిస్తేనే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ ముజుమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కొణిజర్ల జల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో లాంగ్వేజ్ టీచర్స్ అషోషియేషన్ సెక్టార్ జరిగిన మండలస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఇఒ సోమశేఖరశర్మ, మండల విద్యాశాఖాధికారి అబ్రహాం, జగదీష్ , రవికుమార్, భాస్కర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు శ్రీదేవి, కొండబోలు రమేష్, లక్ష్మీ నారాయణ, శ్రీనివాసరెడ్డి, భాగ్యలక్ష్మి , శైలజ తదితరులు పాల్గొన్నారు.




# పేదప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు

బాగం హేమంతరావు





**ప్రజాపక్షం/కొణిజర్ల :** పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది, వారికి అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కొణిజర్లలో సిపిఐ సీనియర్ నాయకులు బోడపోతు లక్ష్మయ్య, కొప్పురావూరి వెంకటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ సిపిఐ చరిత్ర నేటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యదర్శివర్గ సబ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, కొణిజర్ల గ్రామశాఖ కార్యదర్శి స్వర్ణ రమేష్, తోటపల్లి సీతారాములు, కొమ్మినేని వెంకయ్య, బండారు పుల్లయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య, బండారు మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### నిబద్ధతగల కమ్యునిస్టు చాట్ల ఏసు

**చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకులు నాగిలిగొండ మాజీ సర్పంచ్ చాట్ల ఏసు నిబ్బద్దత గల కమ్యునిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఏసు ప్రధమ వర్ధంతి సభ శుక్రవారం నాగిలిగొండ గ్రామంలో జరిగింది. సభకు భాగం హేమంతరావు హాజరై ఏసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి ఏసుపాత్ర ఎనలేనిదన్నారు. ఏసు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

### వేపూరి సీతయ్యకు సన్మానం

సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా 50 సంవత్సరాలుగా పార్టీ సభ్యత్వం కలిగిన నాగిలిగొండ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు వేపూరి సీతయ్య దంపతులను సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు సన్మానించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యునిస్టు పార్టీ చరిత్రలో పోరాటాల పురిటిగడ్డగా ఖమ్మం జిల్లా ఖ్యాతిగడించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్రబాబు, నాయకులు పదిమల వెంకట నర్సయ్య, షేక్ చిన్న జాన్, అరికొట్ల భాస్కర్, పంది పుల్లయ్య, చాట్ల రమేష్, వేపూరి నర్సయ్య, అద్దంకి ఏలియా, చాట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టింగ్ ఇవ్వాలని 2008 డిఎస్‌సి అభ్యర్థుల బైఠాయింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమకు పోస్టింగ్‌లు ఇవ్వాలని '2008 డిఎస్‌సి' అభ్యర్థులు ప్రజాభవన్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి వరకు బైఠాయించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఎంపికైన అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని డిఎస్‌సి అభ్యర్థులు అక్కడే బైఠాయించారు. సాయంత్రం 7గంటల వరకు ఆందోళనను కొనసాగించారు. ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి , నోడల్ అధికారి దివ్య చర్చలు జరిపారు. డిఎస్‌సి అభ్యర్థుల విషయంలో ఫిబ్రవరిలో క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని, సెప్టెంబర్ లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు నియామక పత్రాలు ఇవ్వలేదని అభ్యర్థులు వాపోయారు. దీంతో చిన్నారెడ్డి అభ్యర్థుల నియామక ప్రక్రియ అంశంపైన విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియామకాల ప్రక్రియను ఆగకుండా తాను దగ్గరుండి పర్యవేక్షిస్తానని చిన్నారెడ్డి వారికి హామీనిచ్చారు. దీంతో అభ్యర్థులు ఆందోళనను విరమించారు.

## 'విఆర్‌ఏ వారసుల'కు త్వరలో న్యాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్‌ఏ) వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ విఆర్‌ఏలు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్యను కలిసి తమ సమస్యను విన్నవించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 81, 85 ప్రకారం 3,797 మంది విఆర్‌ఏ వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. దీనిపైన చిన్నారెడ్డి, దివ్య స్పందిస్తూ రెవెన్యూ మంత్రి, రెవెన్యూ ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా ప్రజావాణి లో మొత్తం 359 దరఖాస్తులను స్వీకరించారు.

## ఉద్యోగులకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమగ్ర అభియాన్ శిక్ష ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి భరోసానిచ్చారు. హైదరాబాద్‌లోని దిల్ కుశ అతిథి గృహంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర అభియాన్ శిక్ష ప్రతినిధులు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సమగ్ర అభియాన్ శిక్ష కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 60 శాతం నిధులను ఇస్తుందని, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.అనిల్ దారి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60 శాతం నిధుల వాటాను కొనసాగించాలని వారు కోరారు. ఇందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ సమగ్ర అభియాన్ శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## విమానాశ్రయంలో సిబిఐ దాడులు

### ఇద్దరు కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్లు, బ్యాంక్ అధికారిపై కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం సిబిఐ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లంచం తీసుకున్న కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ కు చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, కెనరా బ్యాంక్ అధికారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఓ ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించారు. విమానాశ్రయంలోని కస్టమ్స్, ఎక్సైజ్ కౌంటర్‌లో ఎక్సైజ్ క్లియరెన్స్ చేసేందుకు అక్కడి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు రూ.50 వేల లంచం తీసుకున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ దాడులు చేసిన సిబిఐ అధికారులు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో పాటు కెనరా బ్యాంక్ అధికారిపై కేసు నమోదు చేశారు.

## జెపిఎస్‌లుగా మార్చాలని సిఎంకు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి నివాసంలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జెఏసి ఛైర్మన్ కోటూరి మానవతారాయ్ కలిసి ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో రాత పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ 4 ఏళ్ళ క్రితం నియమితులైన ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జెఏసి ఛైర్మన్ కోటూరి మానవతారాయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సిఎంను ఆయన నివాసం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జెఏసి గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షులు హేమంత్ చౌదరి,ఓయూ నిరుద్యోగ జెఏసి నాయకులు పుల్లగిరి అశోక్,ఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో 'రైతుభరోసా' లబ్ధిదారుల జాబితాను పెట్టండి : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు ఆరోపించారు. ప్రమాణ పత్రాల పేరుతో రైతులపై కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. గ్రామాల్లో 'రైతు భరోసా' లబ్ధిదారుల జాబితాను అందుబాటులో పెట్టాలని, కౌలు రైతులకు రైతు కూలీలకు ఏ విధంగా రైతుబంధు ఇచ్చారో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ప్రతి దానికి దరఖాస్తుల పేరుతో చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఇప్పుటి వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంట కొనుగోలు, వాటికి సంబంధించిన బోనస్ వివరాలతో కూడిన జాబితాను గ్రామాల్లో పెట్టాలన్నారు. రైతుబంధులో రూ 22 వేల కోట్లు పక్కదారి మళ్లాయంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, ఏ గ్రామాల్లో ఎంత మేరకు రైతుబంధు నిధులు దుర్వినియోగమయ్యాయో ,అయా గ్రామాల్లో జాబితా ప్రచురించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి దరఖాస్తులను స్వీకరించడాన్ని మానుకోవాలని సూచించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సంపూర్ణంగా అమలు చేయాలన్నారు.

## ఇప్పుడు మమకారం కురిపిస్తే బిసిలు నమ్మే పరిస్థితిలో లేరు: సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారంలో ఉన్నప్పుడు బిసిల పట్ల అహంకారంతో వ్యవహరించి, ఇప్పుడు మమకారం కురిపిస్తే బిసిలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి సీతక్క అన్నారు. సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీతక్క మాట్లాడారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎంఎల్‌సి కవిత వ్యాఖ్యలను సీతక్క తప్పు బట్టారు. బిసిల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కవిత ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తోడేలు గొర్రెల మందకు కాపలా కాస్త అంటే ఎలా?, బిఆర్‌ఎస్ తోడేళ్ళ గుంపు లాంటిదని, భక్షించడమే తప్ప రక్షించడం తెలియదని విమర్శించారు. అధికారంలో ఉన్న పదేళ్లు కవితకు బిసిలు గుర్తుకు రాలేదన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచేందుకు న్యాయ నిపుణులతో, మేధావులతో చర్చిస్తున్నామని చెప్పారు. బిసి ముసుగుతో కవిత మరో రాజకీయ డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్, బిసి మంత్రులకు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో సామాన్యులు సైతం ముఖ్యమంత్రిని సునాయాసంగా కలవగలుగుతున్నారని తెలిపారు. బిసిలను అడుగడుగునా మోసం చేసిన టిఆర్‌ఎస్, బిసి రాగం ఎత్తుకున్నంత మాత్రాన బిసిలు నమ్మరన్నారు.

# 2025 నాటి అవసరాల మేరకు 'ఫ్యూచర్' ప్లాన్



గ్రేటర్ హైదరాబాద్‌లో మంచినీటి సరఫరాకు ప్రణాళికలు

తాగునీటితో పాటు సివరేజ్ ప్లాన్‌కు రూపకల్పన

జలమండలి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

> జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలి. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలి. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలి. తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. అందుకు వీలుగా ప్రాజెక్టు డిపిఆర్‌లు తయారు చేయించాలి.
>
> — సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్**

రానున్న 25 ఏండ్ల భవిష్యత్తు 2050 నాటి అవసరాలను అంచనా వేసుకుని గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మంచి నీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకుని 2050 సంవత్సరం నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా 'ఫ్యూచర్ ప్లాన్' ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సివరేజీ ప్లాన్‌ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్‌టెన్సీలతో అధ్యయనం చేయించాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ జలమండలి బోర్డు సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డు సమావేశం జరగడం ఇదే తొలిసారి. బోర్డు చైర్మన్ హోదాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎండి అశోక్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో ఉన్న జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13. 79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు సిఎంకు అధికారులు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి సిటీకి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని, గోదావరి ఫేజ్ 2 ద్వారా మరింత నీటిని తెచ్చుకుని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్‌ను నీటి వనరుగా ఎంచుకోవాలా అనే అంశంపై సమావేశంలో చర్చించారు. కన్సల్‌టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతో పాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని మల్లన్నసాగర్ నుంచే తాగు నీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టిఎంసిలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టిఎంసిల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండి అశోక్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిఎంకు వివరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని వివరించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, విద్యుత్తు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, దాదాపు రూ.8,800 కోట్ల రెవిన్యూ లోటు ఉందని వివరించారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డిపిఆర్‌లు తయారు చేయించాలని చెప్పారు. మంజీరా నుంచి 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైప్ లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సిఎంకు వివరించారు. ఈ పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇందులో ఎవరు సందేహపడాల్సిన పనిలేదని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ మణి మంజరి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, బిఆర్‌ఎస్ నేతలు వి. శ్రీనివాస్ గౌడ్, బండ ప్రకాష్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, వి.హనుమంతరావు, జస్టిస్ ఈశ్వరయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయి కుమార్, బిసి కమిషన్ సభ్యులు బాలలక్ష్మి హాజరై, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని, ఆమె జయంతి రోజైనా జనవరి 3న 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా' ప్రకటిస్తూ జిఒ నంబర్,9 జారీ చేసిందని గుర్తు చేశారు. బిసిలలో వస్తున్న చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి లిక్కర్ కేసులో ఇరుక్కుని ఇప్పుడు రిజర్వేషన్లు పెంచాలని కవిత మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బిసి కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, మహిళా నేతలు ఇందిరా శోభన్, తుల ఉమా, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**మహిళా విద్యాభివృద్ధికి కృషి : జి.నిరంజన్**

సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుకలను బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు సావిత్రి బాయ్ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మొదటి మహిళ ఉపాధ్యాయురాలు అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగు, బాల మాయాదేవి, సభ్య కార్యదర్శి, యు.శ్రీనివాస్ రావు, డిప్యూటీ డైరెక్టర్ జి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

**మహిళా అభ్యుదయవాది పూలే : బిజెపి**

మహిళా అభ్యుదయవాది, అణగారిన వర్గాలకు అండగా నిలబడిన మహోన్నతురాలు సావిత్రి బాయి పూలే అని బిజెపి నేతలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం శుభపరిణామన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, బిజెపి ఒబిసి మో ర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ , ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ తదితర నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## తెలంగాణలో 'బ్లాక్ చెయిన్ సిటీ'

క్వాంటం కంప్యూటింగ్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'

త్వరలో ఏఐ సిటీకి శంకుస్థాపన

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణలో 'బ్లాక్ చైన్ సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామని తెలిపారు. మాదాపూర్‌లో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో సుమారు 1800 మందికి ఉపాధి కల్పిస్తున్న 'సెంటిలియన్ నెట్‌వర్క్స్ అండ్ హెచ్‌సి రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన క్యాంపస్‌ను శుక్రవారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. 'కొత్త సాంకేతికల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫ్యూచర్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఎఐ యూనివర్సిటీకి త్వరలో శంకుస్థాపన చేయనున్నామన్నారు. ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ప్రారంభించనున్నామన్నారు. 'దేశంలో ఫ్రాంటియర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉందని, ఆ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని మంత్రి తెలిపారు. ఇక్కడి అనుకూలతలను ప్రత్యేకంగా వివరించామని, ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని చెప్పారు. 'పౌర సేవలను చివరి వ్యక్తి వరకు సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎఐ, బ్లాక్ చెయిన్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను విరివిగా వినియోగించుకోనున్నామని, ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నాం' అని వివరించారు.

## బిఆర్‌ఎస్ తరహాలో కాంగ్రెస్ దోచుకుంటోంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అవినీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బిఆర్‌ఎస్ బాటనే పట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ దోచుకుంటే..ఇప్పుడు కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెట్టి వ్యక్తిగత కక్షలను కాంగ్రెస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. కేంద్రం రైతు పక్షపాతి అని, తెలంగాణలో ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతులు పండించే పంట మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేస్తోందన్నారు.

## నేను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు రిజర్వేషన్‌ల అమలు విషయంలో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. తాను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బిసి మహాసభలో ముఖ్య అతిథిగా కవిత పాల్గొని, ప్రసంగించారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూ కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించారన్నారు. ఇది బిసిలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం కాదా?, మండల్ కమిషన్ మొరార్జీ దేశాయ్ నియమించారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదన్నారు. మండల్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ పార్టీ తొక్కిపెట్టిందన్నారు. మళ్లీ కాంగ్రెసేతర ప్రధాని వి.పి. సింగ్ వచ్చినప్పుడే కమిషన్ నివేదికను అమలు చేసిందన్నారు. తాను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని కవిత సవాల్ విసిరారు. ఈ మహాసభలో శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముఠా జైసింహా, క్యామ మల్లేశం, పల్లె రవి కుమార్ గౌడ్, అంజనేయులు గౌడ్, తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు బండారి శ్రీనివాస్ గౌడ్, నవీన్ ఆచారి, బిసి సంఘాల నాయకులు బొల్ల శివశంకర్, ఆలకుంట హరి పాల్గొన్నారు.

## నేటి నుంచి మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు స్వర్ణోదయ పేరుతో ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్ శంషాబాద్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో జరగనున్నాయి. ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హజరై ఉత్సవాలను ప్రారంభిస్తారు. శనివారం సాయంత్రం జరిగే మహావీర్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవాలలో ముఖ్య అతిధులుగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంఎల్‌ఎ పి.సంజీవ్‌రెడ్డి పాల్గొంటారు. హైదరాబాద్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్ జైన్, అజయ్ నహత, ఛైర్మన్ వినోద్ సంచేటి, కన్వీనర్ సీమ షీల్ కుమార్ జైన్, వైస్ చైర్ పర్సన్ అర్చన నహత ఈ వివరాలను వెల్లడించారు. ఈ స్వర్ణోత్సవాలలో దేశవ్యాప్తంగా 350 కేంద్రాలు, 150 నగరాలు, పట్టణాలలో ఉన్న మహావీర్ సంస్థల నుంచి దాదాపు 800 మంది ప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. విద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాలలో ర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మహావీర్ ఇంటర్నేషనల్ దేశంలో సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని వారు వివరించారు. ఇప్పటికే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మహావీర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు ఆసుపత్రులను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

## ఎస్‌టియు నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, ఉపాధ్యాయులు సైతం కీలక భూమిక పోషించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియుటిఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా డిఎస్‌సి ప్రక్రియను పూర్తి చేసామని, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టామని, పండిట్, పీఈటిల ఉన్నతీకరణ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించడంతో పాటు ప్రభు త్వ పాఠశాలలకు ఉచిత కరెంటును అందిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఎస్‌ఎస్‌సిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్,డైరీ కన్వీనర్ ఏ.వి. సుధాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్, వై.కరుణాకర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాకు మళ్లీ దరఖాస్తులా ?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా పథకం కింద గత వానాకాలం యాసంగి పంటలకు ఎకరాకు పంటకు రూ. 7500 ఇస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం తన వాగ్దానాన్ని పక్కనపెట్టి తిరిగి రైతులు మళీ దరఖాస్తు చేసుకోవాలనడం సరైనది కాదని తెలంగాణ రైతు సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వెలువడుతున్న చైతన్యసేద్యం రైతుల మాస పత్రిక 2025 డైరీని హైదరాబాద్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీనియర్ నాయకులు సారంపెల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, మాదినేని రమేష్, నున్నా నాగేశ్వరరావు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, శెట్టి వెంకన్న, వర్ణ వెంకటరెడ్డి బుస్సు మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, అన్నవరపు సత్యనారాయణ, బొంతు రాంబాబు, మాటూరి బాల్ రాజు గౌడ్, గఫూర్ పాషా, ఈసంపెల్లి బాబు, రాపర్తి సోమయ్య, ఎం.శ్రీనివాసులు, రాష్ట్ర కమి టీ సభ్యులు అశోక్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, ఎస్.భాగ్యలక్ష్మి , అలివేలు ఆవిష్కరించారు.

## మినిస్టీరియల్ సిబ్బందికి పోలీసు తరహా శిక్షణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు శాఖ విధులు నిర్వహిస్తున్న మినిస్ట్రీరియల్ సిబ్బ ందికి అవసరమైతే, యూనిఫామ్ పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే విధంగా శిక్షణ ఇవ్వాల్సి ఉందని డిజిపి డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. డిజిపి కార్యాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు తెలంగాణ పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయం లో శుక్రవారం ఘనంగా జరిగాయి. డిజిపి డాక్టర్ జితేందర్ , టిజిపిఎ డైరెక్టర్ అభిలాష బిస్త్, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపిలు ఎం.రమేష్, వి. సత్యనారాయణ, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్న వేడుకలలో డిజిపి ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎక్సైజ్ శాఖ పురోగతికి అధికారుల పటిష్ట పర్యవేక్షణ అవసరం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఎక్సైజ్ శాఖలో కింది స్థాయిలో ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలంటే జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ, పరిశీలిన ఎంతో ఉపయోగ పడుతుందని తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధికారులు డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి కిషన్, గౌరవ అధ్యక్షులు ఖురేషి, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస రెడ్డి జాయింట్ సెక్రటరీ ఏ.చంద్రయ్య, పి.కరనంచంద్, రఘురాం, గణేష్, అర్గనైజింగ్ కార్యదర్శి జీవన్‌కరణ్, అధికారులు ఉన్నారు.

## పిల్లల రక్షణ, సంరక్షణపై ప్రత్యేక దృష్టి

### జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి బి.పాపిరెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** చిన్నపిల్లల హక్కులకోసం ఉద్దేశించిన చట్టాల అమలులో భాగంగా పిల్లల రక్షణ, సంరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి బి.పాపిరెడ్డి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో బాలల హక్కులు, చట్టాల అమలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ సభ్యులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జడ్జి ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ బాలల హక్కులపరిరక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణలో బాలల హక్కులు, చట్టాలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్నేహపూర్వకమైనబాలల న్యాయసేవల పథకం 2024 లో భాగంగా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డి. ఇందిర పర్యవేక్షణలో ప్యానల్ న్యాయవాదులు, ప్యారా లీగల్ వలంటీర్లు,లీగల్ సర్విసెస్ కమిటీ సభ్యులతో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీని ప్రకటించారు. ఈమేరకు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. రెండవ అదనపు సెషన్స్ జడ్జి శారదాదేవి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర, ప్యానల్ అడ్వకేట్లు,పారా లీగల్ వాలంటీర్లు తదితరులు ఉన్నారు.

## శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రమానికి భూరీ విరాళం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల లోని పాత బజార్లో శ్రీ సత్యే శ్వర మానసిక దివ్యాంగులు సేవా ఆశ్రమానికి గురువారం అమెరికాకు చెందిన చికాగోతెలుగు అసోసియేషన్ వారు దాదాపు రూ.50 వేల విలువైన చెస్ట్ ఫ్రిజ్, ఇన్వర్టర్ అందజేశారు. అదే కాకుండా ఒక పూట భోజనానికి కూడా సాయం అందజేసి వారి స్వహస్తాలతో వారికి వడ్డించారు. టిజెసి అధ్యక్షులు కొందూరి సంతోష్ కుమార్, వారి కుటుంబ సభ్యులు కొందూరు రాజయ్య, లావణ్య, ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణ, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం ప్రారంభించిన చైర్మన్లు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పలువురు చైర్మన్లు అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముడాచైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్ తో కలిసి మున్సిపల్‌చైర్మన్‌ఆనంద్‌గౌడ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో ప్రధానంగా విద్య, వైద్య, ఉపాధి తో పాటు వ్యవసాయం అభివృద్ధి పైన ఎమ్మెల్యే అత్యంత శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకుండా ఉండే విధంగా మహబూబ్‌నగర్ విద్యానిధిని ఎమ్మెల్యే ఈ నూతన సంవత్సరం సందర్భంగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యానిధికి తమ వంతు సహాయం అందజేయాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత,మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సిజే బెనహర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వసంత, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖద్రి, క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు శ్యామ్యూల్, నాయకులు నవనీత, సహజ, ప్రవీణ్ కుమార్ తో పాటు రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్ క్రాస్, బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్:** పట్టణంలో స్టేట్‌టీచర్స్ యూనియన్ తెలంగాణస్టేట్ 2025 క్యాలెండర్ డిఇఓ రమేష్ కుమార్ చేతులమీదుగా జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఇఓ మాట్లాడుతూ జిల్లాలో నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయసంఘాలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్. మురళి, ప్రధానకార్యదర్శి కె.శ్రీధర్‌రావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్రకార్యదర్శి రమేష్, డిఇఓ ఆఫీస్ సూపరింటెండెంట్ నాగేంద్రం, రాష్ట్ర నాయకులు రఘురాంరెడ్డి, జిల్లా నాయకులు కరుణాకర్‌రెడ్డి, నర్సింహ్మ, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ పెబ్బేరు :** కళారంగంలో ఉన్న క ళాకారులను సన్మానించడం సంతోషంగా ఉం దని లైఫ్ స్టైల్ ఫొటోగ్రఫీ అసోసియేషన్ అ ధ్యక్షులు అజంతా ఫొ టో స్టూడియో వెంకటయ్య అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల నాటక రంగస్థల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఉమామహేశ్వర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎన్నికైన సితార వెంకటేశ్వర్లు, పా త్రికేయ రంగంలో 36 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నారా శ్రీనివాసులు, ఆల్ స్టైల్ కరా టే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మాస్టర్ విజయ్ , గ్రామీణ వైద్యు ల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మాస్ట ర్ విజయ్ , గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ బాషా లను షాల్వా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శాలువా పూ లమాలతో సన్మానించి సన్మాన గ్రహీత అజంతా వెంకటన్నకు ఈ సందర్భంగా కళాకారులు వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మెల్యే మెగారెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/పెద్దమందడి :** మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువు మరమ్మతుల కోసం రూ. కోటి12లక్షలను మంజూరు చేయించిన వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎమ్మె ల్యే మెఘారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి వెంకటస్వామి, వనపర్తి జిల్లా యువజన అధ్యక్షుడు ఆదిత్య, మాజీ ఎస్‌ఎంసి చైర్మన్ టైలర్ రవి, టిఎంఆర్ నాయకులు ఎస్. రాఘవేందర్, గొల్ల పుల్లన్న యాదవ్ , పెద్దమందడి గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## దాతృత్వం చాటుకున్న మద్దిగట్ల వాకింగ్ క్లబ్ సభ్యులు

**ప్రజాపక్షం/పెద్దమందడి :** మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన వాకింగ్ క్లబ్ సభ్యులు వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. క్లబ్ స భ్యుడైన పెద్ద మొగులయ్య తల్లి మీసాల లక్ష్మమ్మ (65) గురువారం అర్ధరా త్రి మృతి చెందడంతో ఉదయాన్నే విషయం తెలుసుకున్న వాకింగ్ క్లబ్ సభ్యులందరూ బాధితుడికి తక్షణ సాయంగా రూ. 5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకింగ్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ‘పాఠశాల ఫీజుల నియంత్రణ’పై విద్యా కమిషన్ కసరత్తు

### విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యాకమిషన్ సమావేశం

### నాలుగు కేటగిరీలుగా ఫీజుల విభజన ?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాలల ఫీజు నియంత్రణ అంశంలో విద్యా కమిషన్ కసరత్తు మొదలు పెట్టింది. పాఠశాలలను నాలుగు కేటగిరీలుగా విభజించి, ఫీజులను నిర్ణయించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో సమావేశమైన విద్యా కమిషన్ తాజాగా శుక్రవారం ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైంది. ఈ సమావేశంలో తల్లిదండ్రుల అభిప్రాయాలను, వారి సూచనలను స్వీకరించింది. ఫీజుల నియంత్రణకు చట్టబద్ధమైన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, మూడేళ్ల పాటు ట్యూషన్ ఫీజును ఒకేలా ఉండాలని, కొన్ని పాఠశాలలు ప్రతి సంవత్సరం 10 శాతం నుంచి 15 శాతం వరకు,మరి కొన్ని 25 నుంచి 30 శాతం వరకు పెంచుతున్నాయని, పుస్తకాలు, యూనిఫాములు, స్టేషనరీ పరికరాలు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని,మరి కొన్ని పాఠశాలలు అధికంగా రవాణ చార్జీలను వసూలు చేస్తున్నాయని వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. అయితే ఫిర్యాదుల విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని, సిలబస్ అంశంపైన కూడా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీతో చర్చించారు. ఈ సమావేశంలో సభ్యులు చారకొండ వెంకటేశ్ తో పాటు పలువురు ఉన్నారు. అయితే ఫీజుల నియంత్రణ విషయంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించిన విద్యా కమిషన్ త్వరలోనే మరింత సమాచారాన్ని సేకరించి, ఇతర రాష్ట్రాలలో ఉన్న ఫీజుల నియంత్రణ, తదితర అంశాలపై ఆరా తీయనుంది. యాజమాన్యాలు, తల్లిదండ్రులు, మరిన్ని అంశాలను కూడా క్రోడీకరించి పలు ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ త్వరలోనే ఒక నివేదికను సమర్పించే అవకాశాలు ఉన్నాయి. పాఠశాలలను ఐదు ఎకరాలు, రెండు ఎకరాలపైన, ఒక ఎకరం, బడ్జెట్ స్కూల్స్ ఇలా నాలుగు కేటగిరీలుగా విభజించి ఫీజులను నిర్ధారించాలని కమిషన్ యోచిస్తోంది.

## పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్ రైళ్ళు

### రాజస్థాన్‌లో రన్ పరీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో మొట్ట మొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలు ఎక్కించేందుకు రైల్వే శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగం గానే రైలు వేగాన్ని క్రమ క్రమంగా పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నట్లు తెలిసింది.ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను షేర్ చేశారు.వందే భారత్ స్లీపర్ రైలు గంటకు 180 వేగంతో రయ్‌రయ్ మంటూ దూసుకెళ్లింది.అంత వేగంలోనూ రైల్లో సీటు వద్ద ఉన్న ట్రేపై పెట్టిన గ్లాసులో చుక్క నీరు కింద పడక పోవడం విశేషం. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కేంద్ర మంత్రి అశ్విని సూచనల మేరకు రాజస్థాన్ లోని కోటా రైల్వే డివిజన్లో ఈ పరీక్షలు నిర్వహించారు.

## నెరడగం వాసులు నిరాశ చెందొద్దు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/మాగనూరు:** నెరడగం వాసులు నిరాశ చెందవద్దని, తొందరలోనే గ్రామంలోని అన్ని కుటుంబాలకు 200 గజాల ఇళ్ల ప్లాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆబ్కారి , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శనివారం మాగనూరు మండలంలోని ముంపు గ్రామైన నేరడగం గ్రామంను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పరిశీలించారు. నేరడుగం గ్రామానికి వచ్చిన మంత్రి గ్రామంలో కూలిపోయిన ఇంటిని చూశారు. గ్రామానికి వస్తుంటే రహదారి కూడా భయంకరంగా ఉందని చెప్పారు. గత పదేళ్లుగా ఎక్కడి గొంగడి అక్కడే అన్న విధంగా ఉందని, ముంపు గ్రామ వాసులకు ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ మొదలు కావాలన్నారు. నేరడగం ముంపు గ్రామాల ప్రజలకు 200 గజాల ఇండ్ల స్థలాల పంపిణీ సంబంధించి భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫోన్ చేసి ఆదేశించారు.

## సిబ్బంది టీంవర్క్ రైల్వేకు బలం

### దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంకితభావంతో పనిచేసే సిబ్బంది టీం వర్క్ రైల్వే శాఖకు నిజమైన బలం అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. విధినిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన 75 సిబ్బంది, అధికారులకు విశిష్ట రైల్ సేవా పురస్కార్ అవార్డులను హైదరాబాద్ లోని రైల్‌కళారంగ్‌లో శుక్రవారం నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే 69వ రైల్వే వారోత్సవాల కార్యక్రమంలో అరుణ్‌కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ. రైల్వే నిర్వహణలో భద్రత, ఆస్తుల పరిరక్షణ, పనులు, శిక్షణలో నాణ్యత దక్షిణ మధ్య రైల్వే కి అత్యంత ప్రాధాన్యత అంశాలని సూచించారు. ఈ నాలుగు అంశాలు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నాయని, సంస్థ యొక్క మొత్తం విజయాన్ని నిర్ధారిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే సాధించిన విజయాలపై ప్రస్తావిస్తూ, జోన్ గత రెండు సంవత్సరాలలో అనూహ్యంగా ఉత్తమ పనితీరును కనబరిచిందని, అనేక విభాగాలలో అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పి, జోన్ యొక్క అర్హతలను బలోపేతం చేయడం, అత్యుత్తమ పనితీరుని ప్రదర్శించే జోన్ లలో ఒకటిగా దేశవ్యాప్త గుర్తింపు పొందడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ నీరజ్ అగ్రవాల్ గారు, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, శ్రీ జె. వినయన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జనరల్) శ్రీ ఉదయనాథ్ కోట్ల, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు , డివిజనల్ రైల్వేమేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెబ్బేరులో అడిషనల్ కలెక్టర్ పర్యటన

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పట్టణ పురపాలిక సంఘంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ పర్యటించారు. మొదటగా పట్టణంలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడ బిల్డింగ్ పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే నిర్మాణంలో ఉన్న మున్సిపల్ షట్టర్ కాంప్లెక్స్ పూర్తి వివరాలను మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ సాయినాథ్ , అడిషనల్ కలెక్టర్ కి వివరించారు. అనంతరం నిర్మాణ దశలో నూతన కూరగాయాల మార్కెట్ ను సందర్శించి కాంపౌండ్ చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.మార్కెట్ కాంపౌండ్ చుట్టూ పచ్చదనం ఉండాలనే ఉద్దేశంతో వివిధ రకాల మొక్కలు వెదురు, బొంగు, బొగనవిల, గన్నేరు, సపోట, నందివర్ధనం,ఖర్జూర,మంధారం, పారిజాతం లాంటి మొక్కలను మొత్తం కలిఇపి 1500వరకు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ పార్వతిదేవి, చిన్న ఎల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేష్ బాబు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అల్లె శ్రీనివాసులు,స్థానిక వైద్యఅధికారి హరినాథ్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి అనిల్‌కుమార్ , జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్ నిరంజనమ్మ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు నోబెల్ స్థాయికి ఎదగాలి

### డిఇఓ గోవిందరాజులు



**ప్రజాపక్షం/నారాయణపేటః** విద్యార్థులు గ్రామీణ స్థాయి నుండి నోబెల్ బహుమతుల స్థాయికి ఎదగాలని డిఇఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పరిజ్ఞానం అనేటటువంటిది ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. పాఠశాలలో విద్యనభ్యసించే ఈ చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు మెదడుకు మేత లాంటిదని పేర్కొన్నారు. రాబోయే రోజులలో నోబెల్ బహుమతిని గెలుచుకునే దిశగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అంతకుముందు అతిథులను బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం సావిత్రిబాయి పూలే, సర్ సివి రామన్ , సరస్వతి దేవి చిత్రపటాలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, జడ్పిసిఈఓ భాగ్యలక్ష్మి , డిఆర్డిఏ పిడి మొగులప్ప, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, జడ్పి డిప్యూటీ సిఈఓ జ్యోతి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాశ్ , మున్సిపల్ చైర్ పర్సన్ అనసూయ చంద్రకాంత్ ,కాంగ్రెస్ నాయకులు బండి వేణుగోపాల్ , సిఎంఓ రాజేంద్రకుమార్ , సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ , తపస్ జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, పిఆర్టియూ జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు బాలకిష్టప్ప, బాలాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రతకు నిరంతరం నిఘా

### జిల్లా ఎస్‌పి జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహిళలు, బాలికలు విద్యార్థినీలు వేధింపులకు గురిచేస్తే వెంటనే జిల్లా షీటీమ్స్ నెంబర్ 871265 9365 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని వారిపైన చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్‌పి జానకి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో జిల్లాలో షీ టీమ్ సిబ్బంది మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ వచ్చిన ఫిర్యాదులు 04 వాటిలో కౌన్సిలింగ్ 03 రెడ్ హ్యాండెడ్02, ఎఫ్‌ఐఆర్ 01 ఫిర్యాదులు నమోదయినట్లు తెలిపారు. అటువాటి వారికి అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న షీ టిమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, ప్రభుత్వం పాఠశాలల్లో. తెలంగాణ మోడల్ స్కూళ్లలో రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్/ఇవిటీజింగ్/పోక్సో/షీటిమ్స్/యాంటి హ్యూమెన్ ట్రాఫికింగ్ లపై నిత్యం అవగాహన కల్పిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో షీ టిమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. వేధింపులు గురయ్యే మహిళలు షీటీమ్‌కు తప్పకుండా ఫిర్యాదు చేయాలని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచుతామని, అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొం దాలని సూచించారు.

# మహిళా విద్యకు తొలి వెలుతురు సావిత్రిబాయి పూలే




సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాల కిషన్,

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** అసమానతల లింగ వివక్షతకు గురవుతున్న స్త్రీ జాతి అభ్యున్నతి కోసం చదువు ఒక్కటే మార్గమని , మహిళలను చదువుతో చైతన్యవంతం చేసి సావిత్రిబాయి చదువుల తల్లిగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. మహ బూబ్‌నగర్ పట్టణంలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మావతి మాట్లాడుతూ అస్పృశ్యత, అం టరానితనం, అజ్ఞానం, నిరక్షరాస్యత,వేళ్ళూనుకొని పోయి ఉన్న భారత సమాజంలో ఓ వెలుగు రేఖలా ఉద్భవించిన మహాత్మ జ్యోతిబాపూలే, అని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐజిల్లా కార్యదర్శి బి.బాల కిషన్ వచ్చేసి సావిత్రిబాయి జోహార్లు అర్పించారు. అదే విధంగా ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సురేష్ , ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుబి.భార్గవి, శ్రీలతిందిరా చెన్నమ్మ, విద్యార్థి యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయులు, సామాజిక సంఘ సేవకురాలు, రచయిత్రి సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, శివరాజ్ పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, గణేష్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పిజి అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సావిత్రి బాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావి త్రిబాయి పూలే చిత్ర పటానికి యంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన యంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మవతి మాట్లాడారు. అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం, సమాజ మార్పు కోసం జీవితాంతం కృషి చేసి విప్లవ చైతన్య మూర్తి, సామాజిక ఉద్య మకారిణి సావిత్రిబాయి పూలే అని కొనియాడింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా.పద్మా అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, వాసంతి, విద్యార్థినులు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.



### పూలే ఆశయబాటలో నడవాలి : కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** మహిళ విద్యాప్రదాతకు రాష్ట్రప్రభుత్వ నిర్ణయంతో సావిత్రిబాయిపూలేకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రి బాయిపూలే 194వ జయంతి సందర్భంగా జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో సాంఘిక సమానత్వంకోసం జీవితాంతం కృషిచేసిన సావిత్రిబాయిపూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్స వంగా అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్రప్రభుత్వం ఆమెకిచ్చిన ఘనమైన నివాళి అన్నారు. పలువురు మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్, ఎమ్మెల్యే, డిఇఓ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఇఓ రమేష్‌కుమార్, నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, నోడల్ అధికారి కుర్మయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటయ్య, శోభారాణి, వెంకటేశ్వర్లు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ పాండు, ప్రధానోపాధ్యాయురాలు లత, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పూలేకు నివాళులు అర్పించి కలెక్టర్

ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ హాల్ లో సావిత్రీ బాయి పూలే జయంతిని సందర్భంగా ఆమె చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో సేవలు అందించిన నలుగురు మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యా శాఖ అధికారి శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ కుమార్, సియంవో బాలుయాదవ్‌బైకాని, ఎఎంఓ శ్రీనివాస్ జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని నివాళులు అర్పించారు.

### సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం

### బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్




భారతదేశపు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బిసి సమాజ్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే పటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీ కాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, జిల్లా సాగర సంగం మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, రజక సంఘం జాతీయ నాయకుడు నడిమింటి శ్రీనివాసులు, జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కాశికపడి యువజన సంఘం నాయకులు, కోమల్, బిసి జర్నలిస్టు సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జడ్చర్ల :** సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా ఎమ్ఇఓ కార్యాలయం దగ్గర మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య సావిత్రి బాయ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ పుష్పాలత, కౌన్సిలర్, రఘుగౌడ్, ప్రశాంత్ రెడ్డి, శశికిరణ్, రగుపపతిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్, కరాటే శ్రీను, వెంకటేష్, ఆయూబ్, మతీన్, మహిమూదు, శివ టైగర్ జంగయ్య, రమేష్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మహిళలకు, దేశ ప్రజలకు విద్యతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని నమ్మి, మహిళల కోసం దేశంలోనే మొట్ట మొదటి పాఠశాలను పూణేలో ఏర్పాటు చేసిన గొప్ప సామాజిక సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అని మండల మహిళఆ సమాఖ్య కార్యదర్శి సుక్యశ్యామల అన్నారు.మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మాత సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన ప్రజలు , మహిళల విద్యాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలే ప్రతి మహిళకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం బుచ్చన్న, సీసీలు వీరయ్య, మాధవస్వామి, అకౌంటెంట్ , అంకె శ్రీలత, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్ కుమార్ , మహిళలు పాల్గొన్నారు.

**శ్రీరంగాపురం...**సావిత్రిబాయి పూలే జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రాజు, రాజు, దామోదర్ బాబు, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**పెద్దమందడిలో....**మండల పరిధిలోని మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం భారత మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో రణదీవ్ , వెంకటస్వామి, గద్వాల కృష్ణ, భగవంతు, వాణిప్రభ, పుల్లయ్య, మధుసూదన్ , వెంకటస్వామి, చిన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**వనపర్తిలో....**తెలంగాణ రాష్ట్రంలోని మహిళా ఉపాధ్యాయినీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని, జనవరి 3న నిర్వహించే సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని, వనపర్తి పట్టణ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ , వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , పట్టణ కౌన్సిలర్లు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు, మహిళా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మాగనూరులో.....** భారతదేశ మొట్టమొదటిఇ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు ఘనంగా మాగనూరు మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సగరం రమేష్ , బ్యాగరి మహేష్ , వెంకటేష్ , సగరం మధు, ఆంజనేయులు, సతీష్ , ధనుంజయ్ , లక్ష్మ ణ్ , సాయి, శంకర్ , సాయి, మణి, శంకర్ , ప్రభు తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్‌లో....** మంతన్ గౌడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరైన టైంలో హాజరు కాని ఉపాధ్యాయులపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని గువ్వల తిరుపతి అసెంబ్లీ అధ్యక్షుడు ఉదయం సావిత్రి బాయి పూలే జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్

# సైన్స్

## మరింత ముందుకు..






ప్రయోగాలు చేపట్టడం, విజయవంతంగా ముగించడంలో ఇస్రో ముందుకు దూసుకెళుతున్నది. గత ఏడాది చివరిలో నిర్వహించిన స్పేస్ క్రాఫ్టట్స్ డాకింగ్ (అనుసంధానం), అన్ డాకింగ్ (విడదీయడం) ప్రయోగంలో మొదటి దశ విజయవంతం కావడంతో, కొత్త ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నది. పిఎస్ఎల్‌వి 60 రాకెట్ ద్వారా స్పేస్ క్రాఫ్ట్ ఎ (స్పేడెక్స్ 01), స్పేస్‌క్రాఫ్ట్ బి (స్పేడెక్స్ 02) శాటిలైట్లను ఇస్రో ఈ వారం ప్రారంభంలో (డిసెంబర్ 30న) విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోవని శ్రీహరికోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి రాకెట్ మొదటి లాంచ్ పాడ్ నుంచి అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. 90 నిమిషాల్లోనే ఈ స్పేస్‌క్రాఫ్ట్ నిర్ధిష్ట కక్ష్యలోకి ప్రవేశించింది. అంతరిక్షంలో ఉపగ్రహాల డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియకు మొత్తం 1014 రోజుల సమయం అవసరం. భూమి నుంచి 475 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతున్న స్పేస్‌క్రాఫ్ట్ ఎ, స్పేస్‌కాఫ్ట్ బి మధ్య 5 కిలోమీటర్ల దూరాన్ని తగ్గించి, 3 మీటర్లకు తీసుకురావడానికి ఇస్రో ప్రయత్నాలు చేస్తున్నది. ఈ రెండు క్రాఫ్టు డాకింగ్ ప్రక్రియలో అనుసంధానం చేస్తారు. అనంతరం అన్‌డాకింగ్ విధానంలో విడదీస్తారు. స్పేస్‌క్రాఫ్ట్ ఎలో హై రిజల్యూషన్ కెమెరా ఉండగా, స్పేస్‌క్రాఫ్ట్ బిలో మినియేచర్ మల్టీ స్పెక్ట్రల్ పేలోడ్, రేడియేషన్ మానిటర్ పేలోడ్ అమర్చారు. ఇవి సహజ వనరులను పర్యవేక్షించి, వృక్ష సంపదపై అధ్యయనం చేస్తాయి. ఈ రెండు శాటిలైట్ల బరువు 220 కిలోలు. ఈ వ్యోమనౌకలు గంటకు 28,800 కిలోమీటర్ల వేగంతో అంతరిక్షంలో ప్రయాణించనున్నాయి. ఆ తర్వాత ఇస్రో వాటి వేగాన్ని తగ్గించి, రెండు అంతరిక్ష నౌకలను అనుసంధానం చేస్తుంది, రెండింటి మధ్య విద్యుత్ శక్తి బదిలీ చేస్తుంది. దీని తర్వాత రెండు అంతరిక్ష నౌకల అన్‌డాకింగ్ ఉంటుంది. అంటే రెండు వ్యోమనౌకలు విడిపోయి తమ తమ కార్యకలాపాలను ప్రారంభిస్తాయి. పిఎస్ఎల్‌వి మొదటి దశలో ఘన రాకెట్ మోటార్ ఉంటుంది. లాంచ్పాడ్ నుండి పిఎస్ఎల్‌విని పైకి లేపడానికి తగినంత థ్రస్ట్‌ను ఉత్పత్తి చేయడానికి ఘన రాకెట్ మోటారు, ఆరు ఘన స్ట్రాప్‌ఆన్ బూస్టర్లను ఉపయోగిస్తారు. రెండవ దశలో, 'వికాస్' అని పిలిచే లిక్విడ్ రాకెట్ ఇంజన్‌ను ఉపయోగిస్తారు. మూడో దశలో బలమైన రాకెట్ మోటార్ ఉపయోగంలోకి వస్తుంది. ఇది బలమైన థ్రస్ట్‌లో ఎగువ భావాన్ని ముందుకు నెట్టివేస్తుంది. ఇక నాలుగో దశలో రెండు ద్రవ ఇంజిన్లను ఉపయోగిస్తారు. ఈ రెండు ఇంజన్లు అంతరిక్ష నౌకను భూమి కక్షవైపు నెడతాయి. కాగా, పిఎస్ఎల్‌వి ప్రయోగం తర్వాత, దాని మూడు భాగాలు అంతరిక్షానికి చేరుకోవు. రాకెట్‌కు ఊపందుకున్న తర్వాత, అవి సముద్రంలో పడిపోతాయి. నాలుగో భాగం అంతరిక్ష చెత్తగా మారుతుంది. అయితే అంతరిక్షంలో చెత్తను వదలకుండా చేయడంలో కూడా ఇస్రో విజయం సాధించింది. టెస్టింగ్ సమయంలో దాని నాలుగో దశ అంతరిక్షంలోకి చేరుకుంటుంది.. తర్వాత అది అక్కడ పనికిరాని చెత్తగా మారుతుంది.

# ఇస్రో లక్ష్యం.. క్వాంటం ఉపగ్రహం



క్వాంటం ఉపగ్రహ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) లక్ష్యంగా ఎంచుకుంది. రాబోయే 23 సంవత్సరాల్లో క్వాంటం కమ్యూనికేషన్ల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నది. క్వాంటం ఉపగ్రహం అనేది కమ్యూనికేషన్ శాటిలైట్. వివిధ రకాకలైన సంకేతాలను, సమాచారాన్ని సురక్షితంగా ఉంచడానికి క్వాంటం భౌతిక సిద్ధాంతాలను ఉపయోగిస్తుంది. సిగ్నల్స్ భద్రతను మెరుగుపరచడానికి, క్వాంటం కంప్యూటింగ్ నుంచి వచ్చే బెదిరిం పుల నుంచి రక్షించడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది. సందేశాలను సురక్షితంగా ఉంచేందుకు వీలుకలుగుతుంది. ఒకవేళ అనుమానాలు తలెత్తితే సదరు సమాచార ప్రసారాన్ని నిలిపివేస్తుంది. ఫోటాన్‌ను కొలవడం ద్వారా దాని స్థితిని మారుస్తుంది. చిక్కుబడిన ఫోటాన్లు ఒకదానికొకటి మార్పులను తక్షణమే ప్రతిబింబిస్తాయి. ఫలితంగా సురక్షితమైన కీ పంపిణీని నిర్ధారించే అవకాశం ఉంటుంది. నేషనల్ క్వాంటం మిషన్ (ఎన్‌క్యుఎం)లో భాగంగా ఈ ఉపగ్రహ ప్రయోగాన్ని చేపట్టారు.2031 వరకూ అమలయ్యే ప్రాజెక్టు కోసం రూ. 6000 కోట్లు కేటాయించారు. ప్రపంచంలో మొట్టమొదటి క్వాంటం కమ్యూనికే షన్ ఉపగ్రహాన్ని చైనా 2016లో ప్రయోగించింది. క్వాంటం సాంకేతికత అధునాతన పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్మెంట్, క్వాంటం టన్నెలిం గ్ వంటి క్వాంటం మెకానిక్స్ సూత్రాలను ఆధారంగా చేసుకుటుంది. సం ప్రదాయ విధానంలో మాదిరి కా కుండా, క్వాంటం సిస్టమ్స్ సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రాసెస్ చేస్తాయి. సురక్షితమైన సమాచార వ్యవ స్థను నిర్మించడానికి సహకరిస్తుంది.



# ఐఎస్ఎస్ మెరుపు వేగం..



భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే, సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. భూమి తన భ్రమణాన్ని పూర్తి చేయడానికి 24 గంటల సమయం పడుతుందని మనకు తెలుసు. అదే విధంగా సూర్యుడి చుట్టూ ఒకసారి తిరగడానికి 265. 242199 రోజులు లేదా సూక్ష్మంగా 265.25 రోజులు పడుతుందని చదువుకున్నాం. ఈ తేడాను భర్తీ చేయడానికి, ప్రతి నాలుగేళ్లకోసారి ఏడాదికి 24 గంటలను కలుపుతారు. అదే 'లీప్ ఇయర్'. ఆ సంవత్సరం, ఫిబ్రవరి నెలలో 28కి బదులు 29 రోజులు ఉంటాయి. ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే, భూమిని చుట్టూ ఒకసారి పరిభ్రమణాన్ని పూర్తి చేసుకోవడాన్ని సంవత్సరంగా పిలిస్తే, అన్ని గ్రహాలు లేదా ఉపగ్రహాలకు సంవత్సరం ఒకే రీతిలోఉండవు. అదే విధంగా గ్రహాల భ్రమణాలు కూడా ఏకరీతిలో కొనసాగవు. గ్రహాలు, వాటి చంద్రులు ఒక స్థిరమైన వేగంతో కదులుతుంటే, మానవులు ప్రయోగించిన ఉపగ్రహాల వేగం మారుతూ ఉంటుంది. కాగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) భూమి చుట్టూ అత్యంత వేగంగా తిరుగుతున్నది. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఐఎస్ఎస్, గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నది. అంటే, గంటన్నర వ్యవధిలో ఈ స్పేస్ సెంటర్ భూమిని చుట్టేస్తుంది. దీనితో, ఇందులోని వ్యోమగాములు, ప్రతి 90 నిమిషాలకోసారి భూభ్రమణాన్ని పూర్తి చేస్తుంది. వారు రోజుకు16 పగళ్లు, అదే సంఖ్యలో రాత్రులను చూస్తారు. ఈ అంతరిక్ష కేంద్రంలో ప్రస్తుతం నలుగురు వ్యోమగాములు ఉన్న విషయం తెలిసిందే. వారిలో, కేవలం వారం రోజులు ఉండడానికి వెళ్లిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ అక్కడే చిక్కుకుపోయిన సంగతి కూడా విదితమే. వీరుగాక, వేర్వేరు స్పేస్ మిషన్స్ ద్వారా వచ్చిన మరో ఐదుగురు కూడా ఐఎస్ఎస్ లోనే ఉన్నారు. సునీత, విల్మోర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తిరిగి వస్తారని తొలుత అనుకున్నప్పటికీ, తిరుగు ప్రయాణాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' మరో నెల రోజులు వాయిదా వేసింది. మొత్తానికి ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో ఉన్నవారందరికీ ప్రతి 90 నిమిషాలకో రోజు పూర్తవుతుంది. అంటే, మన సంవత్సర కాలంలో వారు 5,843.92 పర్యాయాలు భూమిని చుట్టి వస్తారు. ఐఎస్ఎస్ మెరుపు వేగంతో భూమి చుట్టూ ప్రదక్షణ చేస్తున్నదని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

# ఆ ధూళిలో ఏముంది?



చంద్రుడిపైకి ప్రయాణం సాధించలేని స్వప్నమేమీ కాదని ఇప్పటికే రుజువైంది. 2023 సెప్టెంబర్‌లో చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంతో, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇప్పుడు చంద్రయాన్ 4 మిషన్‌కు ముమ్మర సన్నాహాలు చేస్తున్నది. 2027లోగా ఈ ప్రయోగాన్ని నిర్వహించాలన్న పట్టుదలతో ఉంది. భూమి నుంచి చూస్తే, మనకు కనిపించని చంద్రుడి రెండో వైపుకు ఇది వరకే రోవర్‌ను పంపిన ఇస్రో, ఇప్పుడు అక్కడి నుంచి ధూళి లేదా మట్టిని తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నది. అంతరిక్షంలో భవిష్యత్తు అవకాశాలను అన్వేషించడానికి చంద్రుడి మట్టి చాలా కీలకం. ఇప్పటి వరకు చంద్రుడి నుంచి భూమిపైకి అమెరికా, రష్యా, చైనా మాత్రమే మట్టి లేదా ధూళిని తీసుకొచ్చాయి. భారత్‌ను ఈ దేశాల సరసన చేర్చడానికి ఇస్రో శ్రమిస్తున్నది. ఇటీవల, చైనా మూన్ మిషన్ చాంగ్'ఇ6 (Chang'e6) చంద్రుని నుండి దాని మట్టితో తిరిగి వచ్చింది. ఈ మట్టిని చంద్రుని సుదూర, చీకటి భాగంలో ఉన్న 4 బిలియన్ సంవత్సరాల క్రేటర్ నుండి సేకరించారు. దీనికి ముందు, అమెరికా, రష్యా కూడా చంద్రుని నుండి మట్టి నమూనాలను తీసుకువచ్చాయి.. అయితే ఈ నమూనాలు చంద్రుని సమీప భాగం నుండి వచ్చాయి. అయిన ప్పటికీ, చైనా చంద్రుని కొంత భాగం నుండి మట్టిని తీసుకువచ్చింది. చంద్రుని మట్టిని భూమి పైకి తీసుకురావడం వెనుక శాస్త్రవేత్తలకు ప్రత్యేక ఉద్దేశం ఉంది. అంటే చంద్రునిపై భవిష్యత్తు అవకాశాలను కనుగొనడం. నిజానికి, శాస్త్రవేత్తలు చాలా కాలంగా చంద్రునిపై నీటి కోసం వెతుకుతున్నారు. దీనితో పాటు, చంద్రునిపై అనేక రకాల ఖనిజాలు కూడా ఉన్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. శాస్త్రవేత్తలు చంద్రుని నుండి మట్టి నమూనాలను తీసుకువచ్చి నీరు, ఖనిజాల కోసం అన్వేషిస్తున్నారు. చంద్రుడి నుంచి తీసుకొచ్చిన మట్టిలో నీటి అణువులు ఉన్నట్టు ఇటీవల చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. అయితే, ఇంకా లోతైన అధ్యయనం జరగాల్సి ఉంది. ఆ మట్టి లేదా ధూళిలో ఏముంది? ఎలాంటి సాంకేతికాలను అందిస్తున్నది? చంద్రుడి ఆవిర్భావం గురించి రహస్యాలు దీని ద్వారా తెలుస్తాయా? చంద్రుడిపై నివాసం సాధ్యమా? వంటి అనేకానేక ప్రశ్నలకు త్వరంలోనే సమాధానం లభిస్తుందని ఆశిద్దాం. ఏదిఏమైనా, చంద్రుడిపైకి వ్యోమనౌకను పంపి, అక్కడి నుంచి మట్టి లేదా ధూళిని కిందకు తీసుకురాగలిగితే, ఇస్రో చరిత్రలో సరికొత్త అధ్యయం ప్రారంభమవుతుంది.

## పెరిగిన ధరల జిఒను విడుదల చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సివిల్ సప్లయ్ హమాలీలకు పెరిగిన ధరల జీవోను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, సివిల్ సప్లయ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు ఎగుమతి, దిగుమతి ధరలను పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరవధిక సమ్మె మూడవరోజుకు చేరుకుంది. శుక్రవారం హుజూర్‌నగర్‌లో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హమాలీ ధరలు పెంచటానికి అంగీకరించి జిఒను విడుదల చేసి ప్రభుత్వం,పౌరసరఫరాల శాఖ హమాలీ శ్రమ ను గుర్తించేవారన్నారు. ప్రభు త్వం జిఒను విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని,కార్మికుల ఓపిక నశిస్తే జరిగే పరిణామాలకు మా బాధ్యత కాదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. ఎఐటియుసి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ గోదాముల్లో అవసరం మేరకు కార్మికులను నియమించుకునే అధికారం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభు త్వం ప్రజా పంపిణీ పథకాన్ని సంపూర్ణంగా రద్దు చేసి ఏటీఎమ్,ఏటీఆర్‌లను పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) నాయకులు బానోతు, సైదులు, పండుగ వెంకన్న,పొనుగోటి గోపి,జక్కుల మల్లయ్య, బాలాజీ, భిక్షం, వెంకన్న,వెంకన్న, లింగమ్మ, రాములు పాల్గొన్నారు.

## మూడోరోజుకు సివిల్ సప్లయీస్ కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం / నర్సంపేట :** సివిల్ సప్లెయి రేట్ల ఒప్పందం జీవో విడుదల చేసి పెరిగిన రేట్ల ప్రకారం బకాయిలను విడుదల చేయాలని ఏఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు అన్నారు. నర్సంపేట మండల కేంద్రంలో ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ వద్ద సివిల్ సప్లై హమాలి కార్మికులు నిర్వహిస్తున్నటువంటి మూడవరోజు సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆహార పంపిణీ పథకం కింద అనేక రకమైనటువంటి నిత్యావసర సరుకులను తమ రక్తాన్ని చెమటగా మార్చి ఈ దేశానికి రాష్ట్రానికి సంపదను అందిస్తుంటే సివిల్ సప్లై హమాలి కార్మికుల పై చవితి తల్లి ప్రేమ చూపెడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి అమలు పరచాల్సిన రేట్ల జీవో ఒప్పందాన్ని మభ్యపెడుతూ హమాలి కార్మికుల పొట్టలు కొడుతున్నాడన్నారు. సివిల్ సప్లై అధికారుల మధ్య జరిగిన ఒప్పంద జిఒను వెంటనే విడుదల చేసి తగు న్యాయం చేయాలని, లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడికి వెనుకాడబోమని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి కార్మికులు కొత్తగట్టు నరసింహం, బక్కెర కిషోర్, తుప్పతి కుమారస్వామి ,గొర్రె కుమారస్వామి, మిట్టపల్లి సురేందర్, రాయరాకుల సతీష్ ,కొలువుల సాంబయ్య, తుప్పతి రమేష్ పాల్గొన్నారు.

# సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చతుర్వర్ణ వ్యవస్థ, మానువాద దురాగతాలను ఎదిరించి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన యోధురాలు, సామాజిక విప్లవకారిణి సావిత్రిభాయి పూలే అని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ తెలిపారు. ఖమ్మం యూనివర్సిటీ పిజి కళాశాలలో ఎఐఎస్ఎఫ్ కళాశాల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిభాయి పూలే 194వ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మా ట్లాడుతూ స్త్రీలకు విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన సాహస నారి సావిత్రి భాయి పూలే అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతి రోజును జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి శివ, గోపి, హరికృష్ణ, నరేష్, సాయి రాకేష్, రోషన్, పల్లవి, అనూష, రమ్య, స్వాతి, పావని తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శ విప్లవమూర్తి ...

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిభాయి పూలే ఆదర్శ విప్లవ మూర్తి అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తెలిపారు. ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో పూలే జయంతి సందర్భంగా సావిత్రిభాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆడ పిల్లలకు విద్య నేర్పిన మహానీయురాలన్నారు. మహిళలు విద్య నేర్చుకున్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందని సావిత్రిభాయి పూలే నమ్మి మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు విశేష కృషి చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, సీనియర్ బిసి నాయకులు చిదిరాల వెంకటేశ్వర్లు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, మద్దోజు శ్రావణ్, నంబూరి శంకర్‌రావు పాల్గొన్నారు.

### మహిళలకు విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే : పి.రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** బ్రాహ్మణీయ భావజాలాన్ని ధిక్కరించి మ హిళలకు విద్యను బోధించిన మహాత్మురాలు సావిత్రిబాయి పూలే అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బిసి హక్కుల సాధనసమితి వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యు లు పంజాల రమేష్ అ న్నారు. సావిత్రిబాయి పూ లే 194వ జయంతి సందర్భ ంగా గాంధీనగర్ తెలంగాణ జంక్షన్ లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసిన సందర్భంగా మేడిది అశోక్ అధ్యక్షతన జరిగిన సభలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణ బాధ్యులు పంజాల రమేష్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే మను ధర్మ శాస్త్రాన్ని పాటించే బ్రాహ్మణ పురుషుల ఆదిపత్య అరాచకానికి ఎదురు నిలిచి మహిళలకు విద్యను అందించాలని చైతన్య పరచాలని సమాజ అభివృద్ధికి మహిళల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. బిసిల పట్ల సవతి తల్లి ప్రేమను అవలంబిస్తున్న ప్రభుత్వ విధానాలపై ఎస్‌సి, ఎస్‌టి బిసి మైనార్టీ వర్గా లు అందరూ కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని అందుకోసం బిసి హక్కుల సాధన స మితి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతుందని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు దేశ ప్రజలు ఘనమైన నివాళి అర్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స రవీందర్, గుండె బద్రి, బిసి హక్కుల సాధన సమితి నాయకులు పొనుగోడు చారి, కవిత, రమ, రాజేష్, నోముల ప్రతిబ్, రాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## సాంఘిక విప్లవ నారీమణి..

### ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/కాజీపేట :** భారతదేశంలోని పీడిత సమూహాలైన స్త్రీలు, శూద్రులు, అతిశూద్రులను సంఘటితపరిచి బానిస సంకెళ్ల నిర్మూలనకై పోరాటాలు నిర్మించుటకు సావిత్రిబాయి పూలే విద్యను ఆయుధంగా ఎంచుకోవడం జరిగిందని నేదునూరి జ్యోతి భారత జాతీయ మహిళా సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలిపారు. శుక్రవారం కాజీపేట మండలం ఏఆర్ నగర్‌లో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లా డుతూ స్త్రీ జాతి ఆణిముత్యం సావిత్రిబాయి పూలే అని, కరుడుగట్టిన బ్రాహ్మణిజం కబందాహస్తాల నుండి స్త్రీ జాతికి విముక్తి కల్పించిన మహ నీయురాలు మాతృమూర్తి అని, సాటి స్త్రీలకు విద్య చెప్పడానికి సాహసించి విద్యాభివృద్ధిలో ప్రధమ టీచరుగా నిలిచిందన్నారు. వేల సంవత్సరాలుగా భారత స్త్రీకి విద్య అందుబాటులో లేదని సావిత్రిబాయి పూలే సొంతంగా పాఠశాలలు నిర్మించి దళిత సోదర మహిళలకు ధైర్యంగా విద్యను అందించిందన్నారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎన్. రాజమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని సదానందం మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రకటించినందుకు శుభాకాం క్షలు అభినందనలు తెలిపారు. సావిత్రిబాయి పూలే అందించిన చైతన్యంతో మహిళలు రాజకీయ సాంఘిక ఆర్థిక సమానత్వం సాధించడానికి సమరశీల పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గుంటి రాజేందర్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రాస మల్ల కుమార్, బి రాజమణి, పోగుల జ్యోతి, ఎర్ర జయ, రాయారపు అనిత, ప్రతిభ, ఆర్ వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

# జిఒ విడుదలలో అధికారుల నిర్లక్ష్యం తగదు

### * ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు :** హామాలీ కార్మికులకు పెరిగిన రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని ఏఐటియూసి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరు సివిల్ సప్లై గోదాం పాయింట్ వద్ద జరిగిన హామాలీ కార్మికుల 3వ రోజు సమ్మె కార్యక్రమానికి పల్లా దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సివిల్ సప్లై రైట్ల ఒప్పందం కాల పరిమితి ముగిసి సంవత్సరం దాటిపోయిందని అక్టోబర్ నెలలో సివిల్ సప్లై అధికారులకు యూనియన్ నాయకులకు మధ్య చర్చలు జరిగి రేట్ల పెరిగినప్పటికి నేటికి కూడా జీవో విడుదల చేయ కుండ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం అవలంభిస్తున్నారని ఆరోపించారు. పెరిగిన రేట్ల ప్రకారం క్వింటాలుకు 26 నుండి 29 రూపాయలకు మరియు ఇతర పెరిగిన రేట్ల జీవో విడుదల చేయకుండ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోనందుకు అనివార్య కారణాల వలన సమ్మెచేస్తున్నామని అన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలను ఇబ్బంది గురిచేస్తున్న సివిల్ సప్లై అధికారుల వైఖరి చాలా బాధాకరమని అన్నారు. ఇందుకు సివిల్ సప్లై కార్మికుల బాధలను ప్రజలు అర్థం చేసుకొని వారికి సహకరించాలని కోరారు. అధికారులు ఇచ్చిన మాట ప్రకారం పెరిగిన రెట్లను వెంటనే విడుదల చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో సివిల్ సప్తై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి దొనకొండ వెంకటేశ్వర్లు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న, సివిల్ సప్లై నాయకులు కుక్కల నాగరాజు, పగిడిమర్రి రవి, గంటకంపు ధర్మతేజ, కావలి రాజు, కావలి సురేష్ ,కావలి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

**ప్రజాపక్షం/కొత్తూరు:** ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలంగాణ బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోరి దేవిగ్రాండ్ హోటల్ లో నిర్వహించిన సమావేశంలో బిసి మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచ్చ సుధాకర్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శిగా బుడ్డ నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, హక్కుల కోసం బిసి మహాసభ పని చేస్తుందన్నారు. బుడ్డ నర్సిం, మానపాటి ప్రదీప్‌కుమార్, క్యాసెట్ శ్రీనివాస్, కొడిచర్ల యాదయ్య, మాధవచారి, క్యాత్రమోని మల్లేష్ పాల్గొన్నారు.

# మహానగరి

## సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/నార్సింగి:** మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డిలను శుక్రవారం బిఆర్ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ధనరాజ్, రూపారెడ్డి, రాజేంద్రప్రసాద్, అందె లక్ష్మణ్ రావు, ఉపెందర్నాథ్ రెడ్డి, విజయ లక్ష్మి, రాంసుబ్బారెడ్డి, ఆరీఫ్ మొహమ్మద్, టోనీ, జై, శ్రీధర్, సుమ, రేఖ, కృపాకర్, రవి, అనూష, మంజు, అన్ను, గుట్టమిది నరేందర్, విఠల్, మాల్యాద్రి నాయుడు, కిరణ్ తది తరులు పాల్గొన్నారు.

## పోరాటాలు, త్యాగాల చరిత్ర సిపిఐది

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన చరిత్ర ఒక్క సిపిఐ పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని జాలగూడెం గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి అంజిరెడ్డి అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంత ఉత్సవాలలో భాగంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై సిపిఐ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, బికెయంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యురాలు మీనాక్షి, ఆశా వర్కర్ కళావతి, విజయమ్మ, లలిత, యశోద, సుగుణమ్మ, వెంకటమ్మ, నాయకులు యాదగిరి, శ్రీకాంత్ పెంటయ్య బీరప్ప,సత్తయ్య, బుచ్చయ్య,తదితరులు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు : కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణా అభివృద్ధి పిడి శ్రీలతలతో కలిసి మండలాల ఎంపిడిఓ, ఎపిఓలతో గ్రామీణాపాలన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిఎం. డిఐసి శ్రీలక్ష్మి, హౌసింగ్ పిడి నాయక్, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం

### గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరాభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, వివిధ విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్లు, కార్పొరేటర్లు శుక్రవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ 2025 నూతన సంవత్సరం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రజలు, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మరింత నిబద్ధతతో కృషి చేస్తామన్నారు. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నగర అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ, జిహెచ్ఎంసి ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజల సహకారంతో హైదరాబాద్ నగరాన్ని దేశంలోనే అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని మేయర్ అన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో జిహెచ్ఎంసి వివిధ విభాగాల ఉన్నతాధికారులు, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా రాణిస్తారు



**ప్రజాపక్షం/షాబాద్ :** ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా రాణిస్తారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసుదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లి గూడ గ్రామంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఉధ్యానవన శాఖ అధికారులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ప్రభుత్వ రాయితీపై రైతులకు ఆయిల్ పామ్ సాగు చేయడానికి పూర్తి ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు తెలిపారు. షాబాద్ మండలంలో రైతులు అత్యధికంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు పూర్తి అవగాహన కల్గించేందుకు ఉధ్యానవన శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణలో రైతులు పండిస్తున్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ పామ్ సిఇఓ రామకృష్ణ, ప్రమోద్, జిల్లా ఉధ్యానవన శాఖ అధికారి సురేష్, ఎపిడి కిషన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి నరసింహా రావు, డివిజన్ అధికారి సురేష్, షాబాద్ మండల ఉధ్యానశాఖ అధికారిణి కీర్తి క్రిష్ణ, ఎంపిడిఓ అపర్ణ, డిప్యూటి తహసీల్దార్ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అశోక్, రవీందర్ నాయక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక పురోగతిలో యువత భాగస్వాములు కావాలి

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఆర్థిక పురోగతిలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలోని స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ రి స్కిల్ అప్ స్కిల్ పద్ధతిలో యువత ముందుకెళ్లాలని, ప్రపంచానికే సవాల్‌గా మారుతున్న ఆర్టిఫిసియల్ ఇంటిలిజన్స్, డేటా సైన్సెస్, మిషన్ లర్నింగ్‌లలో నైపుణ్యాన్ని పెంచుకున్నపుడు యువత రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. డ్రీమ్ బిగ్ అచీవ్‌మెంట్స్ బిగ్ పద్ధతిలో నూతన ఆవిష్కరణలను యువత స్వాగతించాలన్నారు. నెల్సన్ మండేలా, స్వామి వివేకానంద, ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి లాంటి ఎంతో మంది మేధావులు యువతకు అద్భుతమైన సందేశాలు ఇచ్చారని, యువతలో దాగివున్న అపారమైన శక్తి వినియోగంలోకి వచ్చినపుడు భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్యాచులకు చెందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను గవర్నర్ అందజేశారు. అంతకుముందు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులచే ఈ దేశ ప్రగతికి తమ విద్యను అంకితం చేస్తున్నట్లు గవర్నర్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూషన్ అఫ్ ఇంజనీర్స్ ప్రెసిడెంట్ వి.బి. సింగ్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు, స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన కింద శిక్షణ పొందిన విద్యార్థులకు, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో శిక్షణ పొందిన వారికి కూడా గవర్నర్ ప్రశంసా పత్రాలను అవార్డులను అందించారు.

## ప్రైవేట్ లెక్చరర్లకు సావిత్రిబాయి పూలే అవార్డులు

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** తొలి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విద్యారంగానికి చేస్తున్న సేవలకు గానూ పలువురు ఉపాధ్యాయ, అధ్యాపకులను సన్మానించి, అవార్డులు అందజేశారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ (టిపిటిఎల్ఎ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో కాచిగూడ భద్రుక కాలేజీ కామర్స్ లెక్చరర్ డాక్టర్ స్నేహిత శ్రీవాత్సవకు, నారాయణగూడ బి.వి.ఆర్ ఉమెన్స్ కాలేజీ మ్యాథమెటిక్స్ లెక్చరర్ శ్వేత శ్రీవాత్సవకు సావిత్రభాయి పూలే అవార్డులిచ్చి సత్కరించారు. డాక్టర్ స్నేహిత శ్రీవాత్సవ, శ్వేత శ్రీవాత్సవ అధ్యాపక వృత్తిలో కొనసాగుతూ విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని ప్రముఖ కవి జయరాజ్ కొనియాడారు. శ్వేత శ్రీవాత్సవ, స్నేహిత శ్రీవాత్సవ అక్కాచెల్లెలు కావడం విశేషం.







## క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు

### రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ డిస్ట్రిక్స్ క్రికెట్ అసోసియేషన్ (టిడిసిఎ) ఆధ్వర్యంలో తెలంగాణ బిడ్డ అయిన యుఎస్ఎ క్రికెట్ బోర్డు చైర్మన్ వేణురెడ్డి సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సిఎం కప్ పేరిట మార్చి, ఏప్రిల్ నెలలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను అకాడమీ ద్వారా ఎంపిక చేసి, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పంపిస్తామని తెలిపారు. సిఎం కప్ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులను కలుపుతామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ పాఠశాలలకు డిగ్రీ వరకు పొడిగిస్తామని చెప్పారు. వచ్చే అకడమిక్ స్పోర్ట్ యూనివర్సిటీ అందుబాటులో తెచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం వేణురెడ్డికి టిడిసిఎ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, శివసేనారెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించి, మెమోంటో అందజేశారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాంరెడ్డి, ఎన్ఆర్ఐ బాసి రెడ్డి, టిఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి ముజీబ్ సినీ నటుడు శ్రీధర్ పాల్గొన్నారు.

## ప్రజాదరణ పొందుతున్న ‘ప్రజాపక్షం’

### జిహెచ్ఎంసి హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్న ప్రజాపక్షం పత్రికకు ప్రజలలో మంచి అదరణ లభిస్తుందని జిహెచ్ఎంసి హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. శుక్రవారం హయత్ నగర్ సర్కిల్ కార్యాలయంలో ఎల్‌బి నగర్ ప్రజాపక్షం విలేకరి మెగావత్ సీతారామ్‌తో కలిసి ప్రజాపక్షం నూతన సంసవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ యాదయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అనునిత్యం స్పందిస్తూ, సమస్యలను గుర్తించి వాటిని అధికారులకు దృష్టికి తీసుకురావడంలో పత్రికలు చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం నవ కిషోర్‌రెడ్డి, నీళ్ల అంజన్ కుమార్ గౌడ్, శంకరయ్య గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలి : కళ్లెం

ప్రజాపక్షం పత్రిక ప్రజలకు మరింత చేరువై ప్రజా సమస్యల పరిష్కారంలో ముందండాలని హయత్‌నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఎల్‌బి నగర్ రిపోర్టర్ మెగావత్ సీతారామ్ నాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాష్కర్, బాలు, విజయ్ కుమార్, శ్రీను, గోవింద చారి తదితరులు పాల్గొన్నారు.





## మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### ఘనంగా సావిత్రిబాయి జయంతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యతోనే వనితకు విముక్తి సాధ్యమని, మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషిచేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫరూక్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపడం, సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నయ్య, రఘు, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్, అందె మోహన్, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం కొందుర్గు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్సిలో ఎంఇఓ గాయత్రిదేవి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని ముఖ్య చౌరస్తాలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితవాడ పాఠశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి విద్యార్థులు పూలమాలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయురాళ్లను పూలమాలలు, శాలువాలతో సన్మాంచారు. కార్యక్రమాల్లో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, బి.నరేందర్, చేవెళ్ల కృష్ణయ్య, ఆర్ రామస్వామి, జిబి కృష్ణ, దుర్గని శ్రీను, ఎ ఆనంద్, దర్శన్, జె అశోక్, బి అశోక్, బి రాజు, టి గోపాల్, వేణు, రామగళ్ల సుందర్, కె మహేందర్, బి రవి, పి రమేష్, జంగయ్య, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు అక్షరజ్ఞానం అందించిన మహనీయురాలు సావిత్రిబాయి : సిపిఐ

**సరూర్ నగర్:** దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా అణగారిన మహిళలకు అక్షరజ్ఞానం అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడీ శేఖర్‌రెడ్డి, ఎఐటియుసి ఒబిసి రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాత రాజు నరసింహ ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివనాయక్, ఎఐటియుసి నాయకులు సక్రు నాయక్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీదేవి, నాయకులు ఆర్.కరుణాచారి, బోయపల్లి లింగయ్య, దొంతగోని దశరథ, శోభన్, అరుణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు

**ఆర్కెపురం డివిజన్‌లో...** సరూర్‌నగర్ మండల ఆర్‌కె పురం డివిజన్ పరిధిలో సావిత్రిబాయి పూలే జయంతిని అల్కా పురి కాలనీలో డిబిఆర్ యువసేన అధ్యక్షుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు సావిత్రిబాయి చిత్రపటానికి చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మి, శ్రీశైలం, పగడాల శ్రీశైలం, సందీప్, పగడాల ఎల్లన్న, తలాటి రమేష్ నేత, కిట్టు, జహంగీర్, రాజు, వినయ్, నగేష్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి:** ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వరంలో మాదాపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి శేర్లింగంపల్లి సిపిఐ కార్యదర్శి టి.రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.వెంకటస్వామి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి కె.చందుయాదవ్. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుధాకర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కూన కాశీం, శివకుమార్, ధర్మతేజ, నితీష్ కొండలయ్య బాలస్వామి. గోపి, కురుమయ్య పాల్గొన్నారు.

**యాచారం :** మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలోని ప్రాధమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.





### చదువుల తల్లి సావిత్రిబాయి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి

**ఎల్‌బినగర్:** సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను సిపిఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని సహారా కాలనీలో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ అణగారిన వర్గాల బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, మర్రి శోభన్, ఎఐటియుసి నాయకులు రమావత్ సక్రు నాయక్, కృష్ణ జయంత్, కృష్ణ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** సావిత్రిబాయి పూలేను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఫరూఖ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, చెన్నయ్య, రఘు, మహ్మద్ ఇబ్రహీం, బస్వం పాల్గొన్నారు. పట్టణంలోని చటాన్‌పల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నందారం అశోక్ యాదవ్, అంజయ్య, ప్రిన్సిపల్ పద్మావతి, మహేష్ మాల, శివ, ఉపాధ్యాయులు కళావతి, భాగ్యలక్ష్మి, స్వాతి, భవతి పాల్గొన్నారు.










**తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో దళిత, బహుజన నాయకుల అధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో జి.సుధాకర్ మాదిగ, పద్మ నరసింహ ముదిరాజ్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, మాజీ ఎంపిపి లక్ష్మీదేవి రఘురాములు, డేవిడ్, ఎమ్మార్పిఎస్ జిల్లా కార్యదర్శి పోతుగంటి కృష్ణ మాదిగ, జోగు రమేష్, దాసరి యాదయ్య, పోతుగంటి కుమార్, గణేష్, మల్లేష్, తూర్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.







## ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్న కమిషనర్

**ప్రజాపక్షం/తాండూరు :** ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శంగా చేపట్టాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా తాండూరు పట్టణంలో వర్డ్ ఆఫీసర్లు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి పలు వార్డులలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్వయంగా తానే ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో నంబర్1 మల్‌రెడ్డిపల్లి కౌన్సిలర్ బాలప్ప, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మహానగరి

## అనాధలకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బంగారు తెలంగాణ సంకల్ప శక్తి సేవా సమితి ట్రస్ట్ పంబి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనాధలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరాలేని అనాధలకు అండగా ఉండి చేయూతనందించడానికి మరిన్ని సంస్థలు ముందుకు రావాలని కోరారు. అనంతరం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

## రూ.రెండు లక్షల ఎల్‌ఒసి అందజేత



**ప్రజాపక్షం/నాగారం:** నిరుపేదలకు మెరుగైన వైద్యంకోసం సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ 15వ వార్డు ఈస్ట్ గాంధీ నగర్‌కు చెందిన పాండు అనారోగ్యం కారణంగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయల ఎల్‌ఒసిని వజ్రేష్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డిల చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ సత్యం సాగర్, దర్గా దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నాగారంలో రూ.కోటి 56లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి కోటి 56 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5,6వ వార్డుల్లో 14.50 లక్షలతో సిసి రోడ్డు పనులు, 6వ వార్డు శిల్పా నగర్ కాలనీలో 60 లక్షలతో సిసి రోడ్డు పనులు, 6,7వ వార్డుల్లో 25 లక్షలతో ప్రహరీ గోడ,7వ వార్డు శిల్పానగర్‌లో 22 లక్షలతో పార్కుకు శంకుస్థాపన, ప్రగతి ఎన్‌క్లేవ్‌లో 14.70లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ, సాయినివాస్ కాలనీలో 20 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు గూడురు సబితాఅంజనేయులు గౌడ్, కౌకుట్ల అనంత్ రెడ్డి,అన్నంరాజు లావణ్యశ్రీనివాస్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు.



## మన్నే సంతాప సభలో ఎంఎల్‌ఎ మల్లారెడ్డి

**ప్రజాపక్షం/నాగారం:** మన్నే సుబ్రమణ్యం ఆశయాలను కొనసాగించాలని ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో కీసర మండలం, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ టిడిపి ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నే సుబ్రమణ్యం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షులు అశోక్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, టిజికె మూర్తి, కొత్త రామారావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో నాగారం మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కొండా జంగారెడ్డి, ముప్పు రాంరెడ్డి, అనంత్‌రెడ్డి, ఎం యాదిరెడ్డి, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నీరుగొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



## అటవీశాఖ సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా అటవీశాఖ నెలవారి సమీక్ష సమావేశం వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి .జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా లోని అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అటవీ శాఖలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. 2025లో చేయవల్సిన పనులను చర్చించడం జరిగింది అని అన్నారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్నాపంట పోలల్లోని వ్యర్థులను రైతులు కాలుస్తున్న సందర్భంగాలో ఆ నిప్పు అడవి లో పడి అటవీ కాల్చివేతకు గురయ్యే ప్రమాదం ఉన్నాందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ,అడవులను రక్షించాలని అన్నారు. అడవి భూములు అక్రమనకు గురికకుండా చూడాలని అన్నారు.

## డిసిఎం వాహనం స్వాధీనం.. నిందితుడి అరెస్టు



**ప్రజాపక్షం/నాచారం :** డిసిఎం వాహనంతో సహా దానిలో ఉన్న సామగ్రిని చోరీ చేసిన నిందితుడిని నాచారం పోలీసులు అరెస్టు చేసారు. ఇనస్పెక్టర్ రుద్వీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గత గురువారం రాత్రి గగన్‌పహాడ్‌లోని వికాహ్ ఎకో టెక్ సంస్థ నాచారంలోని పారిశ్రామిక ప్రాంతానికి సామగ్రితో సహా రాత్రి నిలిపి తెల్లవారు జామున చూసేసరికి ఆ వాహనం కనిపించలేదని డ్రైవర్ కృష్ణనాయక్ ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన డిఎస్ఐ శ్రీశైలం, ఎస్ఐ వెంకటయ్య, క్రైం విభాగ సిబ్బంది నిందితుడైన నాచారంలోని అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ నిరంజన్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుండి చోరీ చేసిన సామగ్రితో సహా డిసిఎం వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

### ఐక్యకార్యాచరణతో మతోన్మాద శక్తుల

# దాడులు అరికడదాం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు రచయితలు, కవులు



**ప్రజాపక్షం/హైదరాబాద్/ఖైరతాబాద్:** పుస్తక రచన, ప్రచురణ, విక్రయాలపై జరుగుతున్న మతోన్మాద శక్తుల దాడులను ఎదుర్కొనేందుకు ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని పలువురు రచయితలు, కవులు, జర్నలిస్టులు, ప్రజాస్వామికవాదులు నిర్ణయించారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం, తెలంగాణ ఫర్ పీస్ అండ్ యూనిటీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.'తిరుపతి బాలాజీ బౌద్ధ క్షేత్రమే', 'ఉచ్చల జలధితరంగా' 'అశుద్ధ భారత్' అనే పుస్తకాల్లో ఏముందో తెలుసుకోకుండా శీర్షికలు చూసి హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో రచయిత వేణుపై దాడి చేయడాన్ని వక్తలు తీవ్రంగా ఖండించారు. అభ్యుదయ రచయితల సంఘం నాయకులు కెవిఎల్ మాట్లాడుతూ రచయితలపై దాడులు ఉన్మాదానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరాటామన్నారు. ప్రజోపయోగమైన రచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలేలా ప్రచారం జరగాలన్నారు. పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ సమిష్టిగా ఉండి ఇలాంటి మతోన్మాద శక్తులను ఎదుర్కొవాలని సూచించారు. వీక్షణం వేణుపై దాడి చేయడం ఒక ప్రయోగమేనన్నారు. జర్నలిస్టుల, కవులు, కళాకారులు, రచయితలు కలిసి సమావేశాలతో ఇలాంటి శక్తుల దాడులను ఆపలేమని, ఒక ఐక్యకార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ సమాజంలో బలమైన ప్రజాస్వామ్యిక శక్తులు, విప్లవశక్తులు ఉన్నాయని, తక్షణమే స్పందిస్తే ఇలాంటి మతోన్మాద శక్తులను ఎదుర్కొగలమన్నారు.

సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాల్లో ఏముందో తెలియకుండానే పుస్తకాల అట్టమీద శీర్షికలు చూసి దాడులు జరుగుతుండడం దారుణమన్నారు. ఇలాంటి దాడులు ఏ వ్యక్తిపై దాడులు కాదని సమాజంపై దాడి చేయడమేనన్నారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఒక వైపు సమాజంలో ప్రత్యేక విభజన ఏర్పడిందని, రాజ్యాంగాన్ని హిందూ రాజ్యాంగంగా మార్చాలనే హిందూ శక్తులు, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే ప్రజాస్వామ్య, లౌకిక, సోషలిస్టు భావాలు కలిగిన వారి మధ్య జరుగుతున్న పోరాటంలో ఇలాంటి దాడులు కొనసాగుతున్నాయన్నారు. మతోన్మాద భావజాలం ఉన్న శక్తులు 60వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీరల్తో ఎఐ ద్వారా ట్రోలింగ్ చేస్తున్నారని, దీనిని ఐక్య కార్యాచరణ ముందుకెళ్తేనే అరికడతామన్నారు. సమావేశంలో మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ రియాజ్, కటకోర్ఘ్వుల ఆనందాచారి (తెలంగాణ సాహితీ), కృపాకర్ మాదిగ (ఎంఆర్‌పిఎస్), పిఒడబ్ల్యూ నాయకురాలు సంధ్య, కవులు శివారెడ్డి, నందిని సిధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

### వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్‌ను ఈ నెల 6వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తెలంగాణలోనే మొట్టమొదటి టెర్మినల్ గా చర్లపల్లి టెర్మినల్ చరిత్రలో నిలిచిపోనుందని, ఇది భాగ్యనగర మణిహారంలో మరొక మణిపూసగా చేరనుందన్నారు.తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా రూ. 32 వేల కోట్లు కేటాయించి, 40 రైల్వేస్టేషన్లను, పలు రైల్వేలైన్లను ఆధునీకరించడం, 5 వందే భారత్ ట్రైన్లను కేటాయించడం తెలంగాణ పట్ల బిజెపి కి ఉన్న ప్రత్యేక అభిమానాన్ని నిదర్శమన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ఒక్క 2024–25 బడ్జెట్ లోనే కేంద్రం తెలంగాణకు రూ. 5,336 కోట్ల నిధులను కేటాయించిదని, గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ఏ ఒక్క సంవత్సరం బడ్జెట్ లో ఇన్ని నిధులు కేటాయించలేదన్నారు.

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను రూ. 720కోట్లతో, నాంపల్లి రైల్వేస్టేషన్ ను రూ. 350 కోట్లతో ఆధునీకరించడం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సహకరించకపోయినా చర్లపల్లి టెర్మినల్ ను పూర్తిచేసుకుని, ఈ నెల 6న హైదరాబాద్‌లో ప్రారంభించుకోనుండడం గర్వకారణమని కిషన్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించేలా దోహదపడుతూ, ప్రతి రోజు సుమారు 24 ట్రైన్లు చర్లపల్లి టెర్మినల్ కేంద్రంగా రాకపోకలు సాగించనున్నాయని, రాబోయే కాలంలో గూడ్స్ రైళ్ల రాకపోకలకు కేంద్రంగా హైదరాబాద్ పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఈ టెర్మినల్ మరింత దోహదపడనుందని వెల్లడించారు.



## విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి

### డిఇఒ విజయకుమారి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** విద్యార్థులను మంచి దేశ పౌరులుగా తీర్చి దిద్దటంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ బాల్య దశ నుండే విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రంగాల్లో ప్రావీణ్యతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించటంతో ఆయా పాఠశాల మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

# విద్యార్థులకు ఏ కష్టం రానివ్వం : ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం / కొడంగల్ :** గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏ కష్టం రానివ్వమని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతి గృహాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హాస్టల్‌లలో నెలకొన్న పలు సమస్య లను ఆరా తీసి వార్డెన్‌లపై మండిపడ్డారు. వసతి గృహాల పరిసర ప్రాంతాలతో పాటు వంట గదులను, వంట సామాగ్రిని , బియ్యం తదితర వస్తువులను పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. హాస్టల్‌లో విద్యార్థులను కంటికి రెప్పాల కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్రాగునీటిని ఎప్పటికప్పుడు టెస్ట్‌లు చేయిం చి విద్యార్థులకు అందించాలని మండల విద్యాధికారికి ఆదేశించారు. హాస్టల్స్‌లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం నివేదిక లు తయారు చేయాలని నిధులు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థుల విషయంలో ఏవరైన నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలకు వెనెకాడబోమని హెచ్చరించారు.

**అభివృద్ధి పనులను వేగవంతం చేయండి :**

ప్రజా అవసరాలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని కడ ప్రత్యేక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పా టు చేసి దిశ నిర్దేశం చేశారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలకు దాదాపు 2వేల కోట్ల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. రోడ్లువేసే క్రమంలో మిషన్ భగిరథ నీటి సరఫరాకు ఎటువంటి ఆటం కం కలగకుండా ప్రణాళికా బద్ధంగా నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంజురు అయిన పనులను వచ్చే సోమవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న అదనపు పాఠశాలల తరగ తి గదులు, ప్రహరీ గోడలు అంగన్‌వాడి భవనాల పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ సంజీవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇఇ ప్రభాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ నీలవతి, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, ఇడబ్ల్యుఐడిసి ఈఈ రాంకుమార్, ఇంజనీరింగ్ విభాగం డిఇ , ఇఇలతో పాటు కొడంగల్ మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి**

పరిగిలోని బిసి బాలుర వసతిగృహం, ప్రభుత్వ గిరిజన వసతిగృహం, ప్రీ పోస్ట్ మెట్రిక్ బాలురు వసతిగృహం తుంకుల గడ్డలోని గిరిజన బాలికల వసతి గృహన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖి చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలను, వంట గదులను వంట సామాగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అంచాలని ఈ అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఇచ్చే త్రాగునీరు నాణ్యతను ఎప్పటికప్పుడు హెచ్‌టు టెస్ట్ వైల్ ద్వారా పరీక్షిం చి త్రాగునీరు ఇవ్వాలని సూచించారు. వసతి గృహాలు మరమ్మత్తుపనులు చేయించేందుకు కావలసిన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వసతి గృహలకు నాణ్యమైన కలర్ పెయింటింగ్ వేయించాలని అధికారులకు సూచించారు. అనంతర గిరిజన విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.



## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సిపిఐ సహకారం: డిజి సాయిలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంటు చేయటంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ డిమాండ్ చేసారు.

గత 25 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో ఆందోళన చేస్తున్న సిబ్బందికి మద్దతుగా శుక్రవారం ఆయన శిబిరంలో కూర్చొన్నారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ న్యాయపరమైన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకొని వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఫణికుమార్, దేదీప్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉపాధ్యాయురాలి దినోత్సవం జరపడం శుభ పరిణామం



### కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** విద్య ద్వారా చైతన్యం, జ్ఞానం కలిగి సమానత్వం పొందుతారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. భారతదేశ మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు , సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, మగ్దూం నగర్ లలో ఆమె చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమాలకు సిపిఐ శాఖ కార్యదర్శి వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి నాయకత్వం వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయురాలి దినోత్సవం జరపడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు రాములు, మహిళా సమాఖ్య నాయకులు అనిత, భాగ్యమ్మ, మహేశ్వరి, చంద్రకళ, సిపిఐ నాయకులు బాబు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో:** సావిత్రిబాయి పూలే జయంతి షాపూర్ నగర్‌లోని సంజయ్ గాంధీ నగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్. లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిర్మల, భాగ్య, ధను, సరిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



**ఘట్‌కేసర్‌లో :** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవికుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాలు ఫిజికల్ డైరెక్టర్ ఎం సునీతను ఉపాధ్యాయులు కలిసి వారిని సన్మానించడం జరిగిందని తెలిపారు.

**నాచారంలో:** ఈసిఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్‌కు చెందిన శేఖర్, కీర్తన్, మధురిమ,రవళి, సరిత, దీప్తి, రమ్యలతో పాటు పలు విద్యాసంస్థల విద్యార్థినులు పాల్గొన్నారు. సిపిఐ శాఖ కార్యదర్శి



వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమవతి, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు, మహిళా సమాఖ్యకు చెందిన వారు, సిపిఐకి చెందిన బాబు, శ్రీకాంత్, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో**

శుక్రవారం సావిత్రి బాయి పులే జయంతి సంధర్భంగా శామీర్‌పేట,మూడుచింతపల్లి మండలాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి ఎంఈవొ భాగ్యమణి, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

**వికారాబాద్‌లో :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సావిత్రబాయి పూలే జయంతి కార్యక్రమాన్నిఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డిఇఒ రేణుకాదేవి, విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జయసుధ ,పౌరసంబంధలశాఖ అధికారి జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**కోట్‌పల్లిలో :** శుక్రవారం సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని కోట్‌పల్లి జిల్లా పరిష్యత్తు పాఠశాలలో మహిళ ఉపాధ్యాయురాలు దినోత్సవంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులకు విద్యాబుద్దులను నేర్పి ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత ఆమేకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు యాస్మిన్ బేగం, ఫాతిమా బేగం, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

**తాండూరులో :** తాండూరు పట్టణంలో బిసి సంఘం ఆధ్వర్యాన సామాజిక ఉద్యమకారిణి మహిళా తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.



ఈ సందర్భంగా జాతీయ బిసి సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ అణగారిన కూలల కోసం పోరాడిన మహానేత చదువుల తల్లి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షరాలు మధులత, జ్యోతి, అనిత నర్సమ్మ, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## క్రీడ

# బుమ్రాతో కొన్‌స్టాస్ గొడవ..!



## ముగిసిన తొలిరోజు ఆట

సమయాన్ని వృథా చేయాలనే వ్యూహంలో భాగంగానే జస్‌ప్రీత్ బుమ్రాతో ఆస్ట్రేలియా ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ గొడవకు దిగాడని టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అన్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ తొలి రోజు ఆట చివర్లో బుమ్రా కొనస్టాస్ గొడవపడ్డారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఐదో బంతి వేసేందుకు బుమ్రా సిద్దమవ్వగా.. స్ట్రైకింగ్‌లో ఉన్న ఉస్మాన్ ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. కాస్త ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందుకు నాన్ స్ట్రైకర్‌గా ఉన్న కొన్‌స్టాస్ బదులివ్వడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దూసుకెళ్లేందుకు సిద్దమవ్వగా అంపైర్లు జోక్యం చేసుకొని వారించారు. ఈ ఓవర్ చివరి బంతికే ఉస్మాన్ ఖవాజా ఔటవ్వగా.. భారత ఆటగాళ్లు కొన్‌స్టాస్ లక్ష్యంగా సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్ (98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 40), రవీంద్ర జడేజా (95 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో బుమ్రా(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) విలువైన పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్‌బోలాండ్ (4/31) నాలుగు వికెట్లతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్ (3/49) మూడు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్(2/37) రెండు వికెట్లు దక్కాయి. నాథన్ లయన్ ఓ వికెట్ తీసాడు. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా(3) విఫలమవ్వగా.. సామ్ కోన్‌స్టాస్(7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న రిషభ్ పంత్‌కు బుమ్రాకొన్‌స్టాస్ గొడవకు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. సమయాన్ని వృథా చేయాలనే ఉద్దేశంతోనే ఆసీస్ ఓపెనర్లు అలా వ్యవహరించారని పంత్ బదులిచ్చాడు. 'నాకు తెలిసి సమయాన్ని వృథా చేయాలని ఆసీస్ ఓపెనర్లు భావించారు. జస్‌ప్రీత్ బుమ్రాతో సామ్ కొన్‌స్టాస్ గొడవపడటానికి కారణం కూడా ఇదేనని నేను భావిస్తున్నా. అతను ఏదో అన్నాడు. ఏం అన్నాడో నాకు వినిపించలేదు. కానీ ఆ సమయంలో నాకు అనిపించింది ఏందంటే.. మేం మరో ఓవర్ వేయకుండా సమయాన్ని వృథా చేయాలని భావించారని అర్థమైంది.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.



# రోహిత్ లాస్ట్ టెస్టు మ్యాచ్ ఆడేశాడు..!

చివరి టెస్ట్‌లో రోహిత్ శర్మ ఆడకపోవడంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ తన చివరి టెస్టు మ్యాచ్ ఆడినట్లు గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. 5వ టెస్ట్ మ్యాచ్ లంచ్ విరామ సమయంలో మాట్లాడిన గవాస్కర్, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 202425 చివరి టెస్ట్ మ్యాచ్ నుంచి తనకు తానుగా విశ్రాంతి తీసుకోవాలనే రోహిత్ శర్మ నిర్ణయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నాడు. భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేదని తను అనుకుంటున్నట్లుగా చెప్పాడు. బహుశా తాము టెస్టు క్రికెట్‌లో చివరిసారిగా రోహిత్ శర్మను చూశామని సునీల్ గవాస్కర్ స్టార్ స్పోర్ట్స్‌తో పేర్కొన్నాడు. సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో రోహిత్ శర్మకు విశ్రాంతి ఇవ్వడం వెనుక సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ పాత్ర ఉందని గవాస్కర్ వాదించారు. సిడ్నీ టెస్టుకు ముందు భారత్ 12తో వెనుకబడి ఉంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో నిలవాలంటే సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించాలన్నారు. భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కూడా గవాస్కర్ లాగానే అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తే ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నాడు. రోహిత్ శర్మ ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్ లు ఆడాడు. సిరీస్‌లో కేవలం 31పరుగులే చేశాడు. ఒకసారి మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. రోహిత్ 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 10.93 సగటుతో 164 పరుగులు చేశాడు.ఈ నేపథ్యంలో అతడిపై వేటు వేయాలని డిమాండ్ పెరిగింది. అయితే అతను కెప్టెన్ కాబట్టి అంత త్వరగా వేటు వేయ్యరని అనుకున్నారు. అయితే సిడ్నీ మ్యాచ్ ఒక రోజు ముందు టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మీడియా సమావేశానికి హాజరయ్యారు. సిడ్నీ టెస్ట్ లో రోహిత్ ఆడతాడా అన్న ప్రశ్నకు పిచ్ పరిశీలించన తర్వాత తుది జట్టును ప్రకటిస్తామని గంభీర్ చెప్పాడు. దీంతో చివరి మ్యాచ్ లో రోహిత్ శర్మ ఆడకపోవచ్చని అందురు అన్నుకున్నారు. అనుకున్నట్లుగానే జరిగింది.

## రీల్

# విశ్వంభరపై ఇంట్రెస్టింగ్ అప్డేట్..!



మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రం విశ్వంభర. అయితే అన్నీ సరిగ్గా సెట్ అయి ఉంటే ఈ జనవరి 10న విశ్వంభర హంగామా ఓ రేంజ్‌లో ఉండేది. అయితే ఈ సినిమా టీజర్ రిలీజ్ తర్వాత వచ్చిన మిక్స్ రెస్పాన్స్‌తో మేకర్స్ కొంచెం వెనకడుగు వేశారు. మెయిన్‌గా విఎఫ్‌ఎక్స్ పరంగా వచ్చిన కామెంట్స్‌పై తగు జాగ్రత్తలు ఇపుడు తీసుకుంటున్నారట. ఇలా ప్రస్తుతం గతంలో వర్క్ చేసిన గ్రాఫికల్ టీంని తీసి కొత్త టీంని సెట్ చేసినట్టుగా తెలుస్తుంది. దీనితో కొంచెం బెటర్‌గా విజువల్స్‌ని వీరు అందిస్తారని మేకర్స్ భావిస్తున్నారట. నిజానికి టీజర్ లో మరీ అంత నెగిటివ్ చేసే రేంజ్‌లో విజువల్స్ లేవు కానీ సోషల్ మీడియాలో జరిగిన నెగిటివిటీకి మేకర్స్ రిస్క్ తీసుకోకుండా ముందే మార్పులు చేర్పులు చేస్తున్నారని చెప్పాలి. ఇక ఈ సినిమాకి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# 'భైరవం' నుంచి 'ఓ వెన్నెల' సాంగ్ రిలీజ్




దర్శకుడు విజయ్ కనకమేడల తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'భైరవం' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ నటిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. ఇక ఈ సినిమా నుంచి 'ఓ వెన్నెల' అనే సాంగ్‌ను బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు కానుకగా రిలీజ్ చేశారు. ఈ పాటను న్యాచురల్ స్టార్ నాని లాంచ్ చేశారు. మంచి క్యాచీ ట్యూన్‌తో ఈ పాటను శ్రీచరణ్ పాకాల కంపోజ్ చేశారు. ఈ పాటను బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అదితి శంకర్‌లపై చిత్రీకరించారు. కోనసీమ అందాలను ఈ పాటలో అద్భుతంగా తెరకెక్కించారు. ఇక అనురాగ్ కుల్‌కర్ణి, యామిని ఘంటసాల ఈ పాటను చక్కగా పాడారు. రొమాంటిక్ సాంగ్‌గా వచ్చిన 'ఓ వెన్నెల' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

# 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్



ప్రస్తుతం టాలీవుడ్‌లో సంక్రాంతి సినిమాల సందడి నెలకొంది. ఈ సంక్రాంతికి ఏకంగా మూడు బడా చిత్రాలు పోటీ పడుతుండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాలపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక ఈసారి ఇద్దరు సీనియర్ హీరోలు, ఓ యంగ్ హీరో బాక్సాఫీస్ దగ్గర పోటీ పడుతున్నాడు. నందమూరి బాలకృష్ణ 'డాకు మహారాజ్', విక్టరీ వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం', రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మూడు సినిమాల్లో వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీగా ఆడియెన్స్‌ను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్‌కు సాలిడ్ రెస్పాన్స్ లభించింది. అయితే, ఇప్పుడు ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేందుకు చిత్ర యనిట్ ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు రెడీ అయ్యింది. 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ ట్రైలర్‌ను జనవరి 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇక ఈ ట్రైలర్ లాంచ్‌ను నిజామాబాద్‌లోని కలెక్టర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈమేరు ఓ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. దీంతో ఈ మూవీ ట్రైలర్ ఎలాంటి ఎంటర్‌టైనింగ్ కంటెంట్‌తో వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను దిల్ రాజు, శిరీష్ ప్రొడ్యూస్ చేశారు.

## సత్యరాజ్ లీడ్ రోల్‌లో..

# త్రిబాణధారి బార్బరిక్



బాహుబలి ఫేం సత్యరాజ్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం త్రిబాణధారి బార్బరిక్. మైథలాజికల్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షేర్ చేసిన టైటిల్ గ్లింప్స్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు సత్యరాజ్ పోషిస్తున్న డ్యాక్టర్ శ్యామ్ కథు పాత్ర లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వీయ నాశనానికి మూడు ద్వారాలున్నాయంటూ మొదలైంది టీజ ర్. గిది నువ్వో నేనో చేసే పని కాదు.. ధిమాకున్నోడు చేయాలే. ఒకడు తాచుపాము తోకను తొ క్కాడు. ఆ పాము తొక్కిన వాడిని కాటేయబోతుం ది. మరి తొక్కించిన వాడి సంగతేంటి..? అంటూ సాగుతున్న సంభాషణలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్యరాజ్ బార్బరిక్ పాత్రలో జీవించేశాడని టీజర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ మూవీలో వశిష్ఠ ఎన్ సింహా, సంచి రాయ్, సత్యం రా జేశ్, క్రాంతి కిరణ్, వీటీవీ గణేశ్, మొట్ట రాజేంద్ర, ఉదయ భాను ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి అండగా ఉంటా

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్: జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకీ అండగా ఉంటా అని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తనను కలిసిన సొసైటీ నూతన కార్యకవర్గానికి హామీ ఇచ్చారు. ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ జూబ్లీహిల్స్ నూతన కార్యవర్గం శుక్రవారం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డితో భేటీ అయింది. అనంతరం జరిగిన సమావేశంలో సొసైటీకి జరిగిన ఎన్నికలు, ఫలితాలుపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. గతంలో హౌసింగ్ సొసైటీకి రెండు పర్యాయాలు కార్యదర్శిగా పనిచేసిన కె.శ్రీనివాసరెడ్డి తన అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. సొసైటీ కార్యవర్గానికి పలు సూచనలు, సలహాలను అందించారు. కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులకు, సొసైటీ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ భేటిలో ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మండభేరి గోపరాజు, కార్యదర్శి మిక్కిలినేని రవీంద్ర బాబు,ట్రెజరర్ భీమగాని మహేశ్వర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు డి.కమలాకరాచార్య పాల్గొన్నారు.

# వీలైనంత త్వరగా 'ట్రిపుల్ ఆర్' భూసేకరణ

### రైతులకు మెరుగైన పరిహారం అందేలా చూడాలి

### మూడేళ్లలో హ్యామ్ రహదారుల నిర్మాణం పూర్తి..

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూసేకరణలో రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఆర్బిట్రేటర్లుగా ఉన్న జిల్లా కలెక్టర్లు వీలైనంత ఎక్కువ మొత్తంలో రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారుల భూ సేకరణ, పరిహారం, హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటి మోడల్) విధానంలో రహదారుల నిర్మాణం, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై సచివాలయంలో సిఎం శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. భూ సేకరణ సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతోనూ చర్చించాలని, తరచూ రైతులతో సమావేశమై వివిధ రహదారుల నిర్మాణాలతో కలిగే ప్రయోజనాలను వివరించడం ద్వారా భూ సేకరణను వేగవంతం చేయవచ్చని సిఎం అభిప్రాయపడ్డారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణ)కు ఎన్‌హెచ్ఎఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపినందున హెచ్ఎండిఎతో అలైన్‌మెంట్ చేయించాలని సూచించారు. హైదరాబాద్‌ను కలిపే 11 రహదారులకు ఆటంకం లేకుండా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సిఎం అన్నారు. రేడియల్ రోడ్లకు సంబంధించి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడం, పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉండడంతో పాటు అవుటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ అనుసంధానంలో ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా సాగే నాగ్‌పూర్‌విజయవాడ (ఎన్‌హెచ్163జి) రహదారి,ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల రహదారి (ఎన్‌హెచ్63), జగిత్యాల–కరీంనగర్ (ఎన్‌హెచ్ 563) రహదారుల నిర్మాణంతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల (ఎల్‌డబ్ల్యూఎఫ్) రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, అటవీ అనుమతుల్లో అడ్డంకుల తొలగింపునకు సిఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే రహదారుల నిర్మాణంలో అటవీశాఖ ఎందుకు కొర్రీలు పెడుతోందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పిసిసిఎఫ్) డోబ్రియల్‌ను సిఎం ప్రశ్నించారు. గతంలో కొన్ని నిబంధనలు పాటించకపోవడంతో సమస్యలు ఉన్నాయని పిసిసిఎఫ్ బదులిచ్చారు. రాష్ట్రస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామని, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి, అటవీశాఖ నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా ఈ సమస్యల పరిష్కారానికి కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారితో పది రోజులకోసారి సమీక్షించి త్వరగా క్లియరెన్స్ వచ్చేలా చూడాలని, ఇక్కడ కాకపోతే ఆర్ అండ్ బి, అటవీ శాఖ మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి, అధికారులతో సమావేశమై అనుమతులు సాధించాలని సిఎం సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అండర్ పాస్‌ల నిర్మాణాన్ని విస్మరిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆ సమస్య ఎదురుకాకుండా నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు కిలోమీటర్ల కొద్ది దూరం వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**హ్యామ్ విధానంలో అమలు**

రాష్ట్రంలో హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బి పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్లు రహదారులు నిర్మించాలని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అనే తేడా లేకుండా ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి కన్సల్‌టెన్సీల నియామకం, డిపిఆర్‌ల తయారీ, రహదారుల నిర్మాణం విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని అధికారులను సిఎం ఆదేశించారు. మూడేళ్లలో ఈ రహదారుల నిర్మాణం పూర్తికావాలని సూచించారు.

# బిసిల సమస్యలపై కమిషన్ ప్రత్యేక దృష్టి

### పలు కీలక నిర్ణయాలు తీసుకున్న బిసి కమిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి ఉద్యోగుల పదోన్నతులు, రోస్టర్ విధానంతో పాటు వివిధ బిసి కులాలకు సంబంధించిన సమస్యల పరిష్కానికి తెలంగాణ బిసి కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో బిసికమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సమావేశమైనది.ఈ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు మరియు సభ్య కార్యదర్శి బాలమాయ దేవిలు పాల్గొన్నారు. ఇటీవల బిసి కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో తమ కులాల పేర్లను సమాజంలో న్యూనతా భావంతో చూస్తున్నారని ఆలాంటి పేర్లను మార్చాలని దొమ్మర, పిచ్చిగుంట్ల, తమ్మలి బుడబుక్కల, కుమ్మర, వీరముష్టి కులా ల ప్రతినిధుల నుంచి అందిన వచ్చిన విజ్ఞప్తులపై ఈ సమావేశంలో సమిక్షించారు. కుమ్మ ర, రజక, మేర, కులాల వారు వారికి ప్రస్తుత పేర్లకు అదనంగా ప్రాచుర్యంలో ఉన్న కొన్ని పేర్లను పర్యాయపదాలుగా చేర్చాలనే అంశా న్ని సైతం ఈ సందర్భంగా చర్చించినట్లు చైర్మ న్ జి.నిరంజన్ తెలిపారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన బిసి కమిషన్ ఈనెల 18వ తేదీవరకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఖైరతాబాద్ లోని కమిషన్ కార్యాలయంలో అందజేయవల్సిందిగా కోరింది. అంతేకాకుండా ప్రభుత్వ శాఖల, సంస్థలలోని నియామకాలలో ప్రమోషన్లలో బిసి రిజర్వేషన్ పాటిస్తున్నారా లేదా, ప్రభుత్వ వివిధ శాఖల, సంస్థలలో రోస్టర్ పాయింట్స్ రిజిస్టర్‌లను మెయింటైన్ చేస్తున్నారా అనే అంశాన్నిపరిశీలించాలని కమిషన్ నిర్ణయించింది. అంతేకాకుండా సంచార జాతుల ప్రస్తుత స్థితిగతులను సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఈ నెల మూడో వారంలో వారి నివసించే ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కమిషన్ నిర్ణయించిందని చైర్మన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలకు గాను రాసిన లేఖకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఏలాంటి పొదుపు చర్యలను తీసుకోవాల్సిన నిర్దేశించిన అంశాలపై కమిషన్ కూలంకషంగా చర్చించామని తెలిపారు. పొదుపు చర్యల్లో భాగంగా అవసరమైన మేరకేసిబ్బంది నియామకం చేపట్టడంతో పాటు ఆతిథ్య వ్యయం భారీగా తగ్గించడంతో పాటు చైర్మన్, సభ్యులు అధికారులకు వెసులుబాటులో ఉన్న ఫోన్ తదితర సౌకర్యాలను స్వచ్ఛందంగా వదులుకోవాలని నిర్ణయించినట్లు చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు.

# 'రాజ్యాంగహక్కు'

(మొదటి పేజీ తరువాయి)

భూమిని స్వాధీనం చేసుకున్నారని ధర్మాసనం పేర్కొంది. అప్పీలుదారులుగా ఉన్న భూయజమానులు అనేక సందర్భాలలో కోర్టుల తలుపులు తట్టాల్సివచ్చిందని, వాటికి ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ఆస్తిని లాక్కున్నారని సుప్రీంకోర్టు వెల్లడించింది.నష్టపరిహారం అందకపోవడ ంలో అప్పీలుదారులకు ఎలాంటి ఆలస్యం జరుగలేదని పేర్కొంది. అయితే ఇది రాష్ట్ర లేదా కెఐఎడిబి అధికారుల నిర్లక్ష్యవైఖరి మూలంగా అప్పీలుదారులకు పరిహారం అందకుండా పోయిందని తెలిపింది. కంటెంప్ట్ విచారణలో నోటీసులు జారీ చేసిన తర్వాత మాత్రమే సేకరించిన భూమి మార్కెట్ విలువను నిర్ణయించడానికి 2011లో ఉన్నటువంటి మార్గదర్శక విలువలను తీసుకుని, ప్రత్యేక భూసేకరణ అధికారి (స్పెషల్ ల్యాండ్ అక్విజీషన్ ఆఫీసర్ ఎస్ఎల్ఎఒ) ఏప్రిల్ 22, 2019న పరిహారం నిర్ణయించారని బెంచ్ పేర్కొంది.2023నాటి మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వాల్సిన పరిహారాన్నిఅనుమతించినట్లయితే అది న్యాయాన్ని అపహాస్యం చేసినట్లే అవుతుంది. అంతేకాకుండా ఆర్టికల్ 300ఏ ప్రకారం రాజ్యాంగ నిబంధనలను అపహాస్యం చేసినట్లే అవుతుందని ధర్మాసనం తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ప్రకారం సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించుకోవడం, అప్పీల్‌దారుల భూమి మార్కెట్ విలువను నిర్ణయించడానికి తేదీని మార్చాలని నిర్ణయించడం సరైనకేసుగా అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'కాబట్టి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్142 ప్రకారం సుప్రీంకోర్టు తనఅధికారాన్ని ఉపయోగించి, న్యాయప్రయోజనాల దృష్ట్యా ఇక్కడ అప్పీలుదారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని దాని ఆధారంగా నిర్ణయించమని ఎస్ఎల్ ఎఒను ఆదేశించడం సముచితమని మేం భావిస్తున్నాం. 2019, ఏప్రిల్ 22 నాటికి మార్కెట్ విలువ అమలులో ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. పార్టీల వాదనలు విన్న తర్వాత రెండు నెలల్లోగా 2019 ఏప్రిల్ 22నాటికి ఉన్నమార్కెట్ విలువను తీసుకుని తాజా అవార్డును జారీచేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్ఎల్‌ఎఒను ఆదేశించింది. దాదాపు 22సంవత్సరాలుగా అప్పీలుదారులు తమ చట్టబద్ధమైన బకాయిలను కోల్పోయారని బెంచ్ ప్రస్తావించింది. భూసేకరణ విషయంలో అవార్డును నిర్ణయించడం, పరిహారాన్ని పంపిణీ చేయడం చాలా ముఖ్యమైనదని ధర్మాసనం తెలిపింది.

# మీదైపోదు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ అనుసరిస్తున్న సుస్థిరమైన వైఖరిపై చైనా చర్య ఎలాంటి ప్రభావం చూపించబోదని జైస్వాల్ స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారి 15 రోజుల క్రితం భారత్–చైనా ప్రభుత్వాల అధికార ప్రతినిధులు సరిహద్దుల సమస్యపై సంప్రదింపులు ప్రారంభించారు. అంటే 2024 డిసెంబరు నెలారంభంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ బీజింగ్‌లో 23వ విడత సరిహద్దు సమస్యలపై చర్చలు జరిపారు.ఈ చర్చలు ముగిశాక డిసెంబరు 27న రెండు కొత్త కౌంటీల ఆవిర్భావాన్ని పకటించింది. ఆక్సాయ్‌చిన్ ప్రాంతానికి ''హెయాన్ కౌంటీ''గా చైనా నామకరణం చేసింది. మొత్తం 38,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని చైనా ఆక్రమించిందని భారత్ ఆరోపిస్తున్నది. వాయువ్య చైనా గ్జిన్‌జియాంగ్ ఉగర్ అటానమస్ రీజియన్‌లో కొత్తగా రెండు కౌంటీలను సృష్టించినట్లు చైనా ప్రకటించింది. వీటిలో ఒకటి హెయాన్ కౌంటీ, మరొకటి హెకాంగ్ కౌంటీ. ఈ కౌంటీల ఆవిర్భావానికీ చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీలు ఆమోదముద్ర వేశాయి. ఇకమీదట హెయాన్, హెకాంగ్ కౌంటీలలో ఎన్నికలు కూడా జరుగుతాయి. దీనిపై జైస్వాల్ స్పందిస్తూ, ''చైనా హోటన్ ప్రిఫెక్చర్‌లో రెండు కొత్త కౌంటీలను సృష్టించినట్లు చైనా చేసిన ఒక ప్రకటన చూశాం, ఈ కౌంటీల పరిధిలోకి వచ్చిన భూభాగాలు భారత దేశ కేంద్రపాలిత ప్రాంతం లఢఖ్ పరిధిలో ఉన్నాయి, ఈ విధంగా భారత భూభాగాలను అక్రమంగా ఆక్రమించిన చైనా చర్యలను ఎప్పటికీ మేం సమ్మతించబోం, కొత్త కౌంటీలు సృష్టించినంతమాత్రాన దీర్ఘకాలంగా అనుసరిస్తున్న భారత సార్వభౌమాధికార వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదు, చైనా అక్రమంగా, బలవంతంగా ఆ ప్రాంతాన్ని ఆక్రమించింది, ఈ విషయంలో మేం దౌత్యమార్గాల ద్వారా చాలా గంభీరమైన, అతి తీవ్రమైన నిరసన తెలియజేస్తున్నాం' అని జైస్వాల్ నిరసన తెలియజేశారు. భారత్–చైనా మధ్య వైరుధ్యాలు తలెత్తిన తర్వాత అపనమ్మకాలను తగ్గించుకోవడంకోసం నాలుగున్నర సంవత్సరాల ప్రతిష్ఠంభనకు అంతం పలికేందుకు రెండు దేశాలు తాజాగా ప్రయత్నాలు పునరుద్ధరించాయి. ఈ ప్రయత్నాలు జరుగుతుండగానే చైనా ప్రకటనతో మళ్ళీ ఈ కొత్త ఉద్రిక్తతలు పుట్టుకువచ్చాయి. అక్టోబరు 21వ తేదీన రెండు దేశాలూ ఒక అవగాహనకు వచ్చాయి. ఆ మేరకు రెండు దేశాల సైన్యాలూ ప్రస్తుతం ఉన్న స్థానాల నుండి తమ తమ పూర్వస్థానాలకు వెనక్కు వెళ్ళిపోవాలని ఒప్పందం చేసుకున్నాయి. అధికారస్థాయిలో ఒప్పందం జరిగాక రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా అక్టోబరు 23న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇద్దరూ చర్చలు జరిపి ఒక అంగీకారానికి వచ్చారు. ఆ మేరకు డెమ్చోక్, దెప్సాంగ్ ప్రాంతాల నుండి సైన్యాలను రెండు దేశాలూ వెనక్కు తరలించాయి. 50 నిమిషాల సేపు వారిద్దరిమధ్య జరిగిన సంభాషణల్లో, వివిధ స్థాయిలలో ద్వైపాక్షిక చర్చల యంత్రాంగాలను పునరుద్ధరించేందుకు కూడా వారిద్దరూ అంగీకరించారు. రెండు దేశాలమధ్య వైరుధ్యాలను, విభేదాలను సక్రమ పద్ధతిలో ఆలోచించి పరిష్కరించుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాలనీ, సరిహద్దు ప్రాంతాలలో శాంతికి, స్థిరత్వానికి విఘాతం కలిగించే చర్యలు తీసుకోకూడదనీ వారిద్దరూ సంభాషణల్లో అంగీకరించారు. ఈ సంభాషణలు జరిగిన నాలుగు వారాల తర్వాత సరిహద్దు సమస్యపై ప్రత్యేక ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీలు బీజింగ్‌లో సంభాషణలు జరిపారు. ఈ చర్చల్లో దోవల్–వాంగ్ యీ ఇద్దరూ సరిహద్దు సమస్యలపై సానుకూల మార్గంలో సహకారంపై దృష్టిపెట్టాలనీ, కైలాశ్ మానస సరోవర్ యాత్ర పునరుద్ధరణపై కూడా ఆలోచన చేయాలని, నదులకు సంబంధించిన గణాంకాలు, సరిహద్దు వాణిజ్యంపై కూడా దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. దీని తర్వాతే చైనా కొత్త కౌంటీల ప్రకటన పరిణామం సంభవించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com